www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 31-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 1 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: విదియ ఉ.9.11 తదుపరి తదియ; నక్షత్రం: అశ్విని మ.1.45 తదుపరి భరణి, వర్జ్యం: ఉ.10.13-11.38, రా.10.17-11.43, దుర్ముహూర్తం: మ.12.43-1.32, మ.3.09-మ.3.58, అమృతఘడియలు: ఉ.7.24-8.48, రాహుకాలం:7.30-9.00, సూర్యోదయం: ఉ.6.14; సూర్యాస్తమయం: సా.6.24 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మయన్మార్ భూకంపం..
334 అణుబాంబులతో సమానం!

ఆ స్థాయిలో విధ్వంసం: జియాలజిస్టు ఫీనిక్స్

భారత్-యురేషియన్ ఫలకాల ఢీ

రాబోయే రోజుల్లోనూ ప్రకంపనలు!

మయన్మార్‌లో 3 వేలకు చేరిన మరణాలు

ఆదివారం మరోమారు భూకంపం

2

మారుతున్న భూకంప జోన్లు

మరో రెండు నెలల్లో ఖరారు.. ప్రస్తుతం ఉన్న 5 జోన్లు 6కు పెంపు.. ఉన్నతస్థాయి కమిటీ ఓకే

భద్రాచలం మినహా.. సేఫ్‌జోన్‌లో తెలంగాణ

ఆసక్తి.. ఆ 'శక్తి'.. తగ్గుతున్నాయ్!

సంసార సుఖాన్ని ఆస్వాదించలేకపోతున్న యువజంటలు

"మా దగ్గరకు వచ్చే జంటల్లో 20 శాతం మందికి ఆరోగ్యపరంగా ఏ సమస్యా ఉండదు.. కానీ, పిల్లలు పుట్టడం లేదని చెబుతారు. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత.. వారికి మేం ఇచ్చే సలహా ఏంటంటే.. నెలసరి అయిన తర్వాత కనీసం 10 నుంచి 17 రోజుల లోపు రోజూ సెక్స్‌లో పాల్గొనమని! సెక్స్‌లో పాల్గొనడానికి కూడా షెడ్యూల్ వేసుకుంటున్న జంటలకు అంతకుమించి ఏం చెప్పగలం?"

\- డాక్టర్ శాంతి

భారీగా పెరుగుతున్న హెచ్‌ఎస్‌డీడీ కేసులు

జీవనశైలి, అనారోగ్య, మానసిక సమస్యలే కారణం

కొత్తగా పెళ్లయిన వారిలోనూ చాలామంది నెలకు ఒకట్రెండు సార్లే శృంగారంలో పాల్గొంటున్నారు!!

కోరికలు తగ్గుతున్నాయంటే గుండె జబ్బులకు సంకేతం

ఏడాది ముందు నుంచి అంగస్తంభన సమస్యలు

హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు బాగుండాలి.. ఎలాంటి కష్టాలు లేకుండా ఆనందంగా గడపాలి.. నేటి తరం ఆలోచన ఇది!! అందుకోసం రేయింబవళ్లు కష్టపడుతున్నారు. భార్యాభర్తలిద్దరూ కొలువులు చేస్తున్నారు. తమకు దేనికీ కొదవ లేదన్న భ్రమల్లో బతికేస్తున్నారు. లక్షల్లో జీతాలు.. కార్లు.. బంగళాలు.. విలాసవంతమైన జీవితాలు.. ఇప్పుడు కష్టపడితే రేపు సుఖపడొచ్చన్న భావనతో అలుపెరగకుండా శ్రమిస్తున్న జంటలు సహా వృత్తిగతంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నిరంతరం

మిగతా 12వ పేజీలో...





పెళ్లయిన కొత్తలో ఎక్కువ సార్లు శృంగారంలో పాల్గొన్నా, తర్వాత అది కాస్త తగ్గడం సాధారణం. కానీ, పెళ్లయిన కొత్తలోనే ఈ ఇబ్బందులు ఉంటున్నాయంటే మానసిక కారణాలే అధికంగా ఉంటాయి. పని ఒత్తిడి, శారీరక, మానసిక అలసటతో పాటు ఐటీ ఉద్యోగులు అమెరికా, యూరోప్ సమయాల్లో పనిచేయడం వల్ల లైంగిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా డబుల్ ఇన్‌కమ్ కుటుంబాల్లో ఇద్దరికీ వేర్వేరు పనివేళలు ఉండడం కూడా సమస్యగా మారింది. చాలా మంది నెలకు ఒకటి లేదా రెండు సార్లే సెక్స్‌లో పాల్గొంటున్నారు.

\- డాక్టర్ రవికుమార్



ఆదివారం హుజూర్‌నగర్‌లో జరిగిన సన్నబియ్యం ప్రారంభోత్సవ కార్యక్రమంలో లబ్ధిదారులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

పేదలకు ఇక పండగే

3 కోట్ల మందికి ఉచితంగా సన్నబియ్యం.. చరిత్రలో శిలాశాసనంలా నిలిచిపోయే పథకం

ఏ ప్రభుత్వం వచ్చినా దీనిని కొనసాగించాల్సిందే

రూ.21 వేల కోట్ల వడ్లను తాకట్టు పెట్టిన గత ప్రభుత్వం

7వేల కోట్ల ధాన్యం వేలమేస్తే వచ్చింది 3వేల కోట్ల ధాన్యమే

నల్లగొండకు నీళ్లివ్వాలనే ఆలోచనే బీఆర్‌ఎస్‌కు లేదు

ఎస్‌ఎల్‌బీసీని పట్టించుకోలేదు.. ఓట్లు సీట్లపైనే వారి ధ్యాస

కాళ్లలో కట్టె పెట్టి కింద పడేయాలని చూస్తున్నరు

మా కార్యకర్తలు కళ్లలో కారం కొడతారు: సీఎం రేవంత్

సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

నల్లగొండ/సూర్యాపేట/హుజూర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం అన్నంతో రాష్ట్రంలోని పేదల ఇళ్లలో ఇక ప్రతిరోజూ పండుగ రోజు కానుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శ్రీమంతుల ఇళ్లలో తిన్నట్టే.. పేద ప్రజలు కూడా ప్రతిరోజూ సన్నబియ్యం తినేలా చేయాలనే సంకల్పంతోనే రాష్ట్రంలోని మూడు కోట్ల మంది ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం అందించే పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులపై సన్నబియ్యం అందించే పథకాన్ని ఉగాది రోజున ఆదివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎం ప్రారంభించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభావేదిక నుంచి హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం సంచులను

మిగతా 13వ పేజీలో...

ఏప్రిల్ 2 లేదా 3న
ముహూర్తం?!

మంత్రివర్గ విస్తరణపై గవర్నర్‌కు సీఎం సమాచారం

ఉగాది సందర్భంగా జిష్ణుదేవ్‌తో రేవంత్ మర్యాద పూర్వక భేటీ

ఎస్సీ వర్గీకరణ, బీసీ బిల్లులపైనా ఇరువురి మధ్య చర్చ

3

పురుషులకు 59
మహిళలకు 41

గ్రూప్-1 తొలి 100 ర్యాంకుల్లో మగవారిదే పైచేయి

550 మార్కులతో టాపర్ కొమ్మిరెడ్డి లక్ష్మీ దీపిక

535.5 మార్కులతో వెంకటరమణకు రెండో ర్యాంకు

టాప్ 10లో జోన్-1లో నలుగురు, జోన్-2లో ఐదుగురు

ర్యాంకర్లలో బీసీలు 48 మంది, ఓసీలు 32, ఓసీ(ఈడబ్ల్యూఎస్) 12, ఎస్టీలు 5, ఎస్సీలు ముగ్గురు

మొత్తం 52 మందికి 500కు పైగా మార్కులు

టీజీపీఎస్సీ గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ ఫలితాల విడుదల.. వెబ్‌సైట్‌లో 12622 మంది జాబితా



లక్ష్మీ దీపిక



దాది వెంకట రమణ

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ ఫలితాలు విడుదలయ్యాయి. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆదివారం విడుదల చేసిన ఫలితాల్లో మల్టీజోన్-2కు చెందిన ఓసీ అభ్యర్థి కొమ్మిరెడ్డి లక్ష్మీ దీపిక రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఆమెకు 900కి గాను 550 మార్కులు వచ్చాయి. మల్టీజోన్-2కు చెందిన బీసీ-ఏ అభ్యర్థి దాది వెంకటరమణ 2వ ర్యాంక్ సాధించారు. ఇతనికి 900కి గాను 535.5 మార్కులొచ్చాయి. ఇక తెలంగాణేతరులను మల్టీ జోన్-9లో చేర్చారు. ఈ జోన్ పరిధిలో ఓసీ పురుషుడు జనరల్ ర్యాంకింగ్‌లో 535.5 మార్కులతో మూడో స్థానంలో ఉన్నారు. మల్టీజోన్-1లో ఓసీ మహిళకు

మిగతా 14వ పేజీలో...

సివిల్స్ సన్నద్ధతతోనే ఈ విజయం

ప్రత్యేకంగా గ్రూప్-1 కోసం చదవలే.. కోచింగ్ తీసుకోలేదు

2 సార్లు సివిల్స్ ఇంటర్వ్యూకెళ్లా

అభ్యర్థులకు ఓపిక, స్థిరత్వం అవసరం: లక్ష్మీ దీపిక

14

ముగ్గురు పిల్లలు, సవతి తల్లి
మృత్యువాత

కామారెడ్డి జిల్లా వెంకటాపూర్‌లో ఉగాది పండుగ రోజున ఘోరం

చెరువులో పడి నలుగురి మృతి

ప్రమాదమా? ఆత్మహత్యా? హత్యా?

అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు

పోలీసుల అదుపులో పిల్లల తండ్రి

3

గోడకేసి కొట్టి.. చిన్నారి హత్య

కాలుతున్న పెనంపై కూర్చోబెట్టి

మరో బిడ్డకు నరకం.. సవతి తల్లి కర్కశం

గుంటూరు జిల్లా గొల్లపాలెంలో దారుణం

పోలీసులకు సమాచారం ఇచ్చిన ఇరుగుపొరుగు వారు.. దంపతులపై కేసు

శ్రవణ్‌రావు అరెస్టు తప్పదా?

పోలీసుల విచారణకు సహకరించని ఫోన్ ట్యాపింగ్ నిందితుడు

3

పెద్దల పేర్లు బయటపెట్టని వైనం

విచారణ పరిణామాలను సుప్రీంకోర్టుకు తెలపనున్న ప్రభుత్వం

శ్రవణ్‌రావుకు మధ్యంతర రక్షణ తొలగించాలని కోరే అవకాశం



గాంధీభవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

ఏ పార్టీకి ఆ పంచాంగం..!!

ప్రజలు మెచ్చేలా ముఖ్యమంత్రి రేవంత్ పాలన

సీఎంకు బుధ మహర్దశ.. కానీ నరఘోష

ప్రభుత్వ కార్యక్రమంలో సంతోష్‌కుమార్ శాస్త్రి

రేవంత్‌కు పదవీ గండం.. కేసీఆర్‌కు సీఎం చాన్స్

బీఆర్‌ఎస్ ఉగాది వేడుకల్లో రాజేశ్వర సిద్ధాంతి

ఈ ఏడాది ప్రపంచ దిశానిర్దేశకుడిగా మోదీ

బీజేపీ ఆఫీసులో సూర్యనారాయణ మూర్తి

తెలంగాణలో టీడీపీ కూటమిదే విజయం

పంచాంగకర్త మల్లికార్జున శర్మ

13

సీఎం రేవంత్ ప్రజలు మెచ్చేలా పాలిస్తూ విపరీతమైన నరఘోష ఎదుర్కొంటారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పరుగులు పెట్టబోతుంది..!! అబ్బే.. సీఎంకు పదవీ గండాలు ఉన్నాయి. కేసీఆర్ ఈ ఏడాదే సీఎం అవుతారు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే అంతే..!! టీడీపీ కూటమి వచ్చే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో అధికారం చేపడుతుంది..!! ప్రధాని మోదీకి ఈ ఏడాది మధ్యస్థంగా ఉంటుంది..!! మోదీ చండశాసనుడిగా మారతారు, ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తారు..!! ఉగాది సందర్భంగా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు నిర్వహించిన పంచాంగ పఠన కార్యక్రమాల్లో పండితులు చెప్పిన మాటలివి. ఈ కార్యక్రమాలపై ఎన్ని విమర్శలు వస్తున్నా, ఎన్నికలకు చాలా సమయం ఉందని తెలిసినా.. ఏ ఎండకా గొడుగు అన్నట్టు.. ఏ పార్టీ కార్యక్రమంలో కూర్చుంటే ఆ పార్టీకి అనుకూలంగా పంచాంగం చెప్పడం ఆనవాయితీగా మారింది. ఈ తీరు మరు ఉగాదికైనా మారుతుందో లేదో..!!



నాగపూర్‌లో గోల్వాల్కర్ చిత్రపటానికి మోదీ నివాళి

సంఘ్.. ఓ వటవృక్షం

సేవకు ప్రతిరూపం: ప్రధాని నరేంద్ర మోదీ

నాగపూర్‌లో ఆరెస్సెస్ హెడ్‌క్వార్టర్స్ సందర్శన

హెడ్గేవార్, గోల్వాల్కర్లకు నివాళి

2

కాంగ్రెస్ విధానాలతోనే నక్సలిజం వ్యాప్తి!

ఛత్తీస్‌గఢ్‌లో ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో మోదీ



ప్రొఫెసర్ సామ్ పార్నియా

'మరణించినా'.. బతికించొచ్చు!

మరణం తాత్కాలిక స్థితే.. వెనక్కి తిప్పటం సాధ్యమే

ఎక్మో యంత్రం, కొన్ని ఔషధాలతో తిరిగి జీవం పోయవచ్చు


2

కణాల్లో జీవక్రియలు నిలిచిపోనంత వరకూ దీనికి అవకాశం ఉంది

న్యూయార్క్ వర్సిటీ ప్రొఫెసర్ సామ్ పార్నియా

మారుతున్న భూకంప జోన్లు

- మరో రెండు నెలల్లో ఖరారు
- ప్రస్తుతం 5 జోన్లు.. 6కు పెంపు
- భద్రాచలం మినహా సేఫ్‌జోన్‌లో తెలంగాణ



దేశంలోని భూకంప జోన్లు మారనున్నాయి. ప్రస్తుతం ఐదు జోన్లుండగా.. వాటి సంఖ్య ఆరుకు పెరగనుంది. 1962లో తొలిసారి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఐదు జోన్లను ఏర్పాటు చేయగా.. భారత ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) 1970, 1984లో కొన్ని మార్పులు చేసి, జోన్ల పరిధిలోని ప్రాంతాలను మార్చింది. 2002లో 'ఐఎస్ 1893:2002' పేరుతో వాటిని అభివృద్ధి చేసింది. అప్పటి నుంచి భూమి లోపల ఫలకాల కదలికలో వేగం(యాక్సలరేషన్) పెరుగుతూ.. ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో.. భూభౌతిక శాస్త్రవేత్తలు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు, భూకంపాల పరిశోధకులు, బీఐఎస్ అధికారులతో కొత్త జోన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ పలు భేటీల తర్వాత.. ప్రస్తుతం ఉన్న ఐదు జోన్లను ఆరుగా మార్చాలని నిర్ణయించింది. మరో రెండు నెలల్లో కొత్త జోన్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుంది.

అంకెలా? ఆంగ్ల వర్ణమాలా?

ప్రస్తుతం ఉన్న జోన్లు రోమన్ నంబర్లలో ఉన్నాయి. జోన్-5లో అత్యంత ప్రమాదకరమైన భూకంపాలు సంభవించే ప్రాంతాలుండగా.. జోన్-2లో అత్యల్ప ప్రభావం ఉంటుంది. కొత్త జోన్లకు ఇదేవిధంగా రోమన్ నంబర్లను వాడాలా? పాత-కొత్త మధ్య అయోమయాన్ని తొలగించేందుకు ఆంగ్ల వర్ణమాలలోని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్‌లను వాడాలా? అనే దానిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఈ కమిటీలోని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ అంశం మినహా.. ఏ జోన్ పరిధిలోకి ఏయే ప్రాంతాలు వస్తాయి? అనే దానిపై బీఐఎస్ రూపొందించిన 'ఐఎస్ 1893:2025'ని కమిటీ ఖరారు చేసిందని వివరించారు. ప్రమాదకర ఆరో జోన్‌లో ఎగువ హిమాలయాలు, శివాలిక్ శ్రేణులు ఉన్నాయని తాజా మ్యాప్ చెబుతోంది. వీటితోపాటు.. గుజరాత్ రాష్ట్రంలోని కచ్ ప్రాంతం, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, కొంకణ్ ఈ జోన్‌లో ఉన్నాయి. హిమాలయాల్లోని జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, నేపాల్‌తో సరిహద్దులను పంచుకుంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని పలు ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ దీవులు ఇదే జోన్‌లో ఉన్నాయి. భూగర్భంలో ఫలకాల కదలికకు సంబంధించిన యాక్సలరేషన్ ఈ ప్రాంతాల్లో 5జీ(గ్రావిటీ)గా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో భూగర్భంలో ఫాల్ట్స్ కారణంగా భూకంప తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అంతర్-ఫలకల ప్రాంతం కావడంతో నష్టం తీవ్రంగా ఉంటుందని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

ఐదో జోన్ కొంత భాగమే

పాత జోన్-5లో భూగర్భ ఫలకాల యాక్సలరేషన్ 0.36జీగా ఉండేది. కొత్త జోన్-5లో ఈ వేగం 0.333జీగా ఉన్నట్లు సమాచారం. దిగువ హిమాలయ ప్రాంతాల్లోని గంగామైదానాలు కొంత వరకు ఐదోజోన్‌లోకి వస్తాయి. ఇక్కడ కూడా రివర్స్ స్ట్రైట్‌స్లిప్ ఫాల్ట్స్ ఉన్నా.. వాటి యాక్సలరేషన్ తక్కువగా ఉంటుంది. రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు ఈ జోన్‌లో ఉంటాయి. 0.233 గ్రావిటీ ఉండే ప్రాంతాలను జోన్-4లో చేర్చారు. ఇక్కడ భూకంపాలు వచ్చినా.. తీవ్రత తక్కువగా ఉంటుంది. ఈ జాబితాలో న్యూఢిల్లీ, ఎన్‌సీఆర్-ఢిల్లీ, పట్నా, కోల్‌కతా నగరాలున్నాయి.

జోన్-3లో కీలక నగరాలు

జోన్-3(0.125జీ)లో లఖ్‌నవూ, పట్నా లోని కొన్ని ప్రాంతాలు, రాంచీ, భువనేశ్వర్, డామన్, ముంబై, ఏపీలోని అమరావతి, చెన్నై, పుదుచ్చేరి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భూకంపాల తీవ్రత తక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర ప్రాంతాలు, తెలంగాణలోని భద్రాచలం, తమిళనాడులోని థేని, కేరళలోని శబరిమల, పెరియార్ అడవులు కూడా ఈ జోన్‌లోనే ఉన్నాయి.

జోన్-2లో తెలంగాణ

తెలంగాణ రాష్ట్రంలో ఒక్క భద్రాచలం మినహా.. మిగతా ప్రాంతాలన్నీ గత జోన్లలో మాదిరిగానే జోన్-2లో ఉన్నాయి. ఇక్కడ భూగర్భంలో ఫలకం కదలిక 0.075 గ్రావిటీతో ఉంటుంది. ఈ కారణంగా పెద్దగా ఆస్తి, ప్రాణనష్టం ఉండవని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర, కర్ణాటకలోని 99% ప్రాంతాలు, కేరళలోని గురువాయూర్ ఈ జోన్‌లోనే ఉన్నాయి.

- సెంట్రల్‌డెస్క్

అవయవ మార్పిడి డేటా నమోదు తప్పనిసరి

న్యూఢిల్లీ, మార్చి 30: అవయవ మార్పిడికి సంబంధించిన డేటాను ఆస్పత్రులు పంచుకోకపోవడంపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై వాటిని నేషనల్ ట్రాన్స్‌ప్లాంట్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేయాలని కోరింది. ఈ మేరకు రాష్ట్రాలకు లేఖ రాసింది. దేశవ్యాప్తంగా అనేక రిజిస్టర్డ్ ఆస్పత్రులు రోజువారీ, నెలవారీ సమర్పించడంలో విఫలమవుతున్నాయని, తద్వారా పారదర్శకత ఉండటం లేదని ఆ లేఖలో పేర్కొంది. దీనివల్ల అందరికీ సమానంగా అవయవాల కేటాయింపు చేయడానికి ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. వెబ్‌పోర్టల్‌లో ఈ డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, ప్రక్రియ జరిగిన 48 గంటల్లోనే అవయవ దాతలు, గ్రహీతల వివరాలను రిజిస్ట్రీలో నమోదు చేయాలని స్పష్టం చేసింది.

అవినీతి తగ్గాలంటే ఆఫీసర్లకు బదిలీలు తప్పనిసరి

- కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ సూచనలు

న్యూఢిల్లీ, మార్చి 30: మంత్రిత్వ శాఖల్లో పనిచేసే అధికారులు ఒకే పదవిలో ఎక్కువకాలం కొనసాగితే అవినీతికి ఆస్కారం ఏర్పడుతుందని పార్లమెంటరీ ప్యానెల్ అభిప్రాయపడింది. నిర్ణీత కాలపరిమితికి మించి వారు అదే పోస్టులో కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అధికారులందరికీ రొటేషన్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని మార్చి 27న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నివేదికలో కమిటీ పేర్కొంది. అన్ని బదిలీలు వెంటనే పాలసీ ప్రకారం జరగాలని, ఏ ఒక్క అధికారి కూడా నిర్దేశిత కాలపరిమితికి మించి మంత్రిత్వ శాఖల్లో కొనసాగడానికి వీల్లేదని కమిటీ స్పష్టం చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో 3 నెలల్లో 280 నక్సల్స్ లొంగుబాటు

న్యూఢిల్లీ, మార్చి 30: ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాదిలో ఇప్పటివరకు 280 మంది నక్సలైట్లు, జన్ మిలీషియా సభ్యులు లొంగిపోయారు. ఇక, 2024లో ఛత్తీస్‌గఢ్‌లో మొత్తంగా 787 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారు. నక్సల్స్ ఆయుధాలను వీడేలా సంప్రదింపులు జరిపి, ఒప్పించడంలో సీఆర్‌పీఎఫ్ నిఘా విభాగం కీలకంగా వ్యవహరిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో 20 బెటాలియన్లు, కోబ్రా యూనిట్‌తో యాంటీ నక్సల్స్ ఆపరేషన్లలో సీఆర్‌పీఎఫ్ కీలకంగా ఉంది.


మయన్మార్‌లో నేల మట్టమైన భవన సముదాయం

334 అణు బాంబులతో సమానం

మయన్మార్ భూకంపం అంత శక్తిమంతమైంది.. జియాలజిస్టు జెస్ ఫీనిక్స్ వెల్లడి

- భారత్-యురేషియన్ ఫలకాల ఢీ.. రాబోయే రోజుల్లోనూ ప్రకంపనలు!
- 3 వేలకు పెరిగిన మరణాలు
- ఆదివారం మరోమారు భూకంపం

నేపిదా, మార్చి 30: మయన్మార్‌లో శుక్రవారం సంభవించిన భారీ భూకంపం, తదనంతర ప్రకంపనలు అత్యంత తీవ్రత ఉన్నాయని అమెరికాకు చెందిన జియాలజిస్టు జెస్ ఫీనిక్స్ వెల్లడించారు. ఈ తీవ్రత 334 అణుబాంబుల విధ్వంసంతో సమానమని పేర్కొన్నారు. భూగర్భంలో భారత-యురేషియన్ టెక్టానిక్ ఫలకాలు ఢీకొనడం వల్ల.. మయన్మార్‌లోని స్ట్రైక్‌స్లిప్ కేటగిరీకి చెందిన 'సగైంగ్ ఫాల్ట్' వద్ద రాబోయే కొన్ని నెలల పాటు తదనంతర ప్రకంపనలు(ఆఫ్టర్ షాక్స్) వచ్చే ప్రమాదముందని ఆమె హెచ్చరించారు. ఆదివారం రాత్రి కడపటి వార్తలందేసరికి మయన్మార్ భూకంప మృతుల సంఖ్య 2,972కు చేరుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. క్షతగాత్రుల సంఖ్య 3,122గా ఉన్నట్లు తెలిపాయి. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ.. మరణాల సంఖ్య పెరుగుతోందని చెప్పాయి. కాగా.. అంతర్యుద్ధం కారణంగా ఆంక్షలు కొనసాగుతుండడంతో.. సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలేర్పడుతున్నాయి. భవనాల శిథిలాలను తొలగించి, ఒక్కో మృతదేహాన్ని వెలికితీయడానికి 2 నుంచి 8 గంటల సమయం పడుతున్నట్లు రెస్క్యూ బృందాలు చెబుతున్నాయి.

అనుక్షణం భయంభయం

శుక్రవారం నాటి భారీ భూకంపం తర్వాత కూడా మయన్మార్ పౌరులు అనుక్షణం భయంభయంగా గడుపుతున్నారు. ఇక్కడ తదనంతర ప్రకంపనలు కూడా తీవ్రంగానే ఉంటున్నాయి. శుక్రవారం తొలి భూకంప తీవ్రత 7.7గా నమోదవ్వగా.. ఆ తర్వాత వరుసగా 3.3-4.7 మధ్య, శనివారం 3.8-4.7 మధ్య తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. ఆదివారం ఉదయం మండలే నగరానికి 28 కిలోమీటర్ల దూరంలో 5.1 తీవ్రతతో భూమి కంపించింది. మరిన్ని భూకంపాలు రావొచ్చనే వార్తల నేపథ్యంలో మయన్మార్ పౌరులు రోడ్లపైనే ఉంటున్నారు.

సికాయ్ 80% ధ్వంసం

మాండలే కేంద్రంగా భూకంపం సంభవించినా.. పర్వతప్రాంతం సికాయ్ దారుణంగా దెబ్బతిన్నట్లు స్థానికులు చెబుతున్నారు. 80% పట్టణం ధ్వంసమైపోయిందని, మిగతా 20% కూడా పాక్షికంగా భూకంప ప్రభావిత ఇళ్లతో మిగిలిపోయిందని పేర్కొన్నారు. సెనేట్ ప్రతినిధి కమిటీ కార్యదర్శి మావో ఝూవోటియాన్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఓ ప్రకటన చేశారు. రెబల్స్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో తమకు మానవతాసాయం అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలా చోట్ల పౌరులే వట్టి చేతులతో శిథిలాలను తొలగించి, తమవారి కోసం వెతుకుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వెలికితీసిన 183 మృతదేహాలను ఆదివారం సామూహికంగా ఖననం చేసినట్లు సికాయ్‌లోని ఓబో హెల్త్ అండ్ రెస్క్యూ టీమ్ బృందం సభ్యుడొకరు తెలిపారు.



సహాయక చర్యల్లో ఆటంకాలు..

మయన్మార్‌లో భూకంప సహాయక చర్యలు మందకొడిగా సాగుతున్నాయి. ఇందుకు అనేక కారణాలున్నాయి. రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో సహాయక బృందాలు భూకంప ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడంలో ఆలస్యమవుతోంది. రెబల్స్ ఉంటున్న ప్రాంతాలకు దారి తీసే రహదారుల్లో మిలటరీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సహాయక బృందాలను అడ్డుకుంటున్నారని, అక్కడి సైనికులకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాకే, సహాయక సిబ్బందిని అనుమతిస్తున్నారని ఓ వార్తా సంస్థ వెల్లడించింది.

సాయానికి స్టార్‌లింక్

మయన్మార్‌లో కమ్యూనికేషన్ పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో స్టార్‌లింక్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పేస్‌ఎక్స్ చీఫ్ ఎలాన్ మస్క్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మయన్మార్‌లోని సైనిక సర్కారు అనుమతిస్తే.. వెంటనే చర్యలను ప్రారంభిస్తామని తెలిపారు. భూప్రకోపానికి గురైన మయన్మార్‌ను ఆదుకునేందుకు భారత్ 'ఆపరేషన్ బ్రహ్మ'ను ప్రారంభించింది. ఇదిలా ఉండగా, భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో కుప్పకూలిన 33 అంతస్తుల భవనంలో చిక్కుకున్న వారిపై ఆశలు ఆవిరవుతున్నాయని బ్యాంకాక్ పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు బయటకు తీసిన వారిలో ఎవరూ ప్రాణాలతో లేరని గుర్తుచేశారు. శిథిలాలను పూర్తిగా తొలగించడానికి కనీసం రెండు నెలల సమయం పడుతుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 18 మంది చనిపోయినట్లు పేర్కొన్న పోలీసులు.. ఇంకా 82 మంది గల్లంతైనట్లు వివరించారు.

శ్మశాన వాటికల్లో రద్దీ!

మాండలేలోని దక్షిణ, లాంగికాన్ శ్మశాన వాటికల్లో ఆదివారం విపరీతమైన రద్దీ నెలకొంది. ఖననాలకు స్థలం సరిపోని పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు చెబుతున్నారు. "ఆదివారం ఉదయం శ్మశానవాటిక బయట పార్క్ చేసిన కార్లతో రహదారులు నిండిపోయాయి. మయన్మార్ చట్టాల ప్రకారం మరణ ధ్రువీకరణ పత్రం లేనిదే మృతదేహాలను ఖననం చేయకూడదు. వందల మృతదేహాల విషయంలో అలాంటి పత్రాలు లేవు. దీంతో.. సమీప సరస్సు వద్దే బంధుమిత్రులు తమవారి మృతదేహాలతో పడిగాపులు కాస్తున్నారు" అని లాంగికాన్ శ్మశానవాటికలో పనిచేసే ఓ వ్యక్తి చెప్పారు. ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన మృతదేహాలు కూడా శ్మశాన వాటికలో కుప్పలుగా ఉన్నాయని వివరించారు.

లోకం తీరు



అణు ఒప్పందానికి ఒప్పుకోకపోతే బాంబులేస్తా

- ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం



వాషింగ్టన్, మార్చి30: కొత్త అణు ఒప్పందానికి ఒప్పుకోకపోతే ఇరాన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో బాంబులేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. కొత్త అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రత్యక్ష చర్చలకు రావాలంటూ ట్రంప్ లేఖ ద్వారా ఇచ్చిన ఆహ్వానాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తిరస్కరించారు. ప్రత్యక్ష చర్చలకు ఒప్పుకోబోమని, ఒమన్ వేదికగా పరోక్ష చర్చలకు సిద్ధమని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఎన్‌బీసీ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్‌ను హెచ్చరించారు. రెండు నెలల్లోగా ఇరాన్ కొత్త అణు ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. లేకపోతే తర్వాత జరగబోయే పరిణామాలను ఎవ్వరూ ఊహించలేరని చెప్పారు. వాస్తవానికి 2015లో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన అణు ఒప్పందం నుంచి ట్రంప్ ప్రభుత్వం 2018లో తప్పుకుంది. తాజాగా అణ్వాయుధాల తయారీపై ఇరాన్ చురుగ్గా ఉందనే కథనాల మధ్య ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు.

పుతిన్‌కు ట్రంప్ తాజా వార్నింగ్

ఉక్రెయిన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని వెంటనే అమలు చేయకుంటే రష్యాపై మరిన్ని సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. రష్యా చమురుపై సుంకాలు పెంచుతామని, ఆ దేశం వద్ద చమురు కొనే దేశాలు అమెరికాతో వ్యాపారం చేయకుండా కట్టడి చేస్తామన్నారు. ఉక్రెయిన్‌లో జెలెన్‌స్కీ ఊసులేని తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుకు పుతిన్ పిలుపునీయడం ట్రంప్ ఆగ్రహానికి కారణమైంది.

'మరణించినా'.. బతికించొచ్చు!

- న్యూయార్క్ వర్సిటీ ప్రొఫెసర్ సామ్



వాషింగ్టన్, మార్చి 30: మరణంతో అంతా అయిపోయినట్టేనా? జీవితానికి ముగింపేనా?.. కానే కాదని, మరణాన్ని వెనక్కి తిప్పవచ్చని చెబుతున్నారు న్యూయార్క్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ సామ్ పార్నియా. గుండె, ఊపిరితిత్తులు పాడైపోయిన వారికి చికిత్సను అందించే ఎక్మో యంత్రంతో కొన్ని ఔషధాల సమ్మేళనాన్ని ఉపయోగించి 'పోయిన ప్రాణాన్ని' తిరిగి నిలబెట్టవచ్చని ఆయన పేర్కొంటున్నారు. ఎపినెఫ్రిన్, మధుమేహ చికిత్సలో వినియోగించే మెట్‌ఫార్మిన్, విటమిన్ సీ, వాసోప్రెసిన్, నఫ్లిమెంట్ సల్‌బుటమైన్.. వీటిని తగుపాళ్లలో కలిపి ఎక్మో మెషిన్‌తో కలిపి అందిస్తే.. గుండె స్తంభించిన వారిలో కూడా తిరిగి జీవం పోయవచ్చని సామ్ తెలిపారు. ప్రయోగశాలలో జంతువుల మీద తాము జరిపిన ప్రయోగాల్లో ఇది సాధ్యమైందన్నారు. 'మనిషి మరణించిన తర్వాత శరీరంలోని కణాలన్నీ వెంటనే చచ్చుబడిపోవు. దానికి కొంత సమయం పడుతుంది. మెదడు కూడా కొన్ని రోజులపాటు సజీవస్థితిలో ఉంటుంది. దీనిని సైన్స్ ఇప్పటికే నిరూపించింది. మేం జరిపిన కొన్ని పరిశోధనల్లో.. గుండెపోటుకు గురైన వ్యక్తుల్లో గుండె కొట్టుకోవటం మానేసిన తర్వాత కూడా దాదాపు గంటపాటు జ్ఞాపకాలు పదిలంగా ఉండటం గమనించాం. వారి మెదడు పనితీరును పరిశీలించినప్పుడూ ఇది నిజమేనని తేలింది' అని సామ్ వివరించారు. మరణానికి గురైన వ్యక్తి శరీర కణాల్లో జీవక్రియలు పూర్తిగా నిలిచిపోనంత వరకూ ఆ వ్యక్తిని బతికించవచ్చని సామ్ పేర్కొన్నారు.

భారత్‌లో అణు రియాక్టర్ల నిర్మాణానికి అమెరికా గ్రీన్ సిగ్నల్

- హోల్టెక్ సంస్థకు అనుమతి

న్యూఢిల్లీ, మార్చి 30: భారత్-అమెరికా మధ్య అణు ఒప్పందంలో రెండు దశాబ్దాల తర్వాత కీలక ముందడుగు పడింది. భారత్‌లో అణు రియాక్టర్ల నిర్మాణం, రూపకల్పనకు హోల్టెక్ ఇంటర్నేషనల్ సంస్థకు అమెరికా రెగ్యులేటరీ అనుమతిచ్చింది. ఈ ఒప్పందానికి అమెరికా ఇంధన శాఖ (డీవోఈ) మార్చి 26న ఆమోదం తెలిపింది. 2007లో భారత్, అమెరికా మధ్య 123 ఒప్పందాలపై సంతకాలు జరిగిన తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు ఈ ఆమోదం లభించడం గమనార్హం. అప్పట్లో కుదిరిన అణు ఒప్పందంలోని వాణిజ్య కోణాన్ని అందిపుచ్చుకునే మార్గంలో దీన్ని తొలి అడుగుగా పరిగణిస్తున్నారు. భారత్‌లోని మూడు సంస్థలైన హోల్టెక్ ఆసియా, లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్, టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ లిమిటెడ్‌తో కలిసి మాడ్యులర్ రియాక్టర్ టెక్నాలజీని పంచుకునేందుకు హోల్టెక్‌కు అనుమతి లభించింది. '10సీఎఫ్ఆర్810' అని పిలిచే నిర్బంధ అమెరికా రెగ్యులేషన్ కింద ఈ అనుమతి ఇచ్చింది. ఈ ఒప్పందం పదేళ్లపాటు చెల్లుబాటవుతుంది. ప్రతి ఐదేళ్లకొకసారి దీన్ని పునఃసమీక్షిస్తారు.

సంఘ్.. ఓ వటవృక్షం

- సేవకు ప్రతిరూపం: ప్రధాని మోదీ
- ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ సందర్శన

న్యూఢిల్లీ, మార్చి 30: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సేవకు మరో పేరని ప్రధాని మోదీ అన్నారు. అది భారతీయ ప్రాచీన సంస్కృతికి, ఆధునికీకరణకు వటవృక్షంలాంటిదని చెప్పారు. దాని విలువలు, ఆదర్శాలు జాతీయ చైతన్యాన్ని పరిరక్షిస్తున్నాయని తెలిపారు. ఆదివారం ఆయన మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ప్రథమ, ద్వితీయ సర్‌సంఘ్ చాలక్‌లు కేబీ హెడ్గేవార్, ఎంఎస్ గోల్వాల్కర్‌ల స్మృతి మందిరాలకు వెళ్లి నివాళులు అర్పించారు. సంఘ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన రెండో ప్రధాని మోదీ. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు 2000లో వెళ్లారు. ఇద్దరూ మూడోసారి ప్రధాని అయిన తర్వాతే ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం గమనార్హం. సంఘ్ ప్రాంగణంలో మాధవ్ నేత్రాలయ ఐ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు అనుబంధంగా మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్ భవనానికి మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ.. గత వందేళ్లుగా 'సంఘటన్', 'సమర్పణ్'తో ఆర్ఎస్ఎస్ చేస్తున్న తపస్సు.. 'వికసిత్-భారత్-2047' లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఇప్పుడు ఫలాలందిస్తోందని తెలిపారు. 'వందేళ్ల తర్వాత సంఘ్ మరో మైలురాయి దిశగా కదులుతోంది. స్వాతంత్ర్య పోరాటంలో 1925-47 సంక్షోభ సమయం. ఇప్పుడు 2025-47 మధ్య కాలం కూడా చాలా కీలకమైనది. భారీ లక్ష్యాలు మన ముందున్నాయి. వచ్చే వెయ్యేళ్ల శక్తిమంతమైన, పురోగామి భారత నిర్మాణానికి మనం శంకుస్థాపన చేయాలి' అని అన్నారు. స్మృతి మందిరం వద్ద ఉన్న సందేశ పుస్తకంలో మోదీ హిందీలో సందేశం రాశారు. హెడ్గేవార్, గోల్వాల్కర్‌ల ఆలోచనలు తనతో పాటు ఎంతో మందికి స్ఫూర్తిని, బలాన్ని ఇచ్చాయన్నారు. ఆయన వెంట సంఘ్ చీఫ్ భాగవత్, కేంద్ర మంత్రిగడ్కరీ, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా ఉన్నారు. నాగపూర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన 'దీక్షాభూమి'ని కూడా మోదీ సందర్శించారు. 'దీక్షాభూమి' సామాజిక న్యాయానికి, బడుగుల సాధికారతకు చిహ్నమన్నారు. దీక్షాభూమిలోని స్తూపం వద్దకు వెళ్లి 'అంబేడ్కర్ అస్థి' వద్ద మోదీ నివాళులు అర్పించారు.


హెడ్గేవార్‌కు ప్రధాని మోదీ నివాళి

కాంగ్రెస్ విధానాలతోనే నక్సలిజం వ్యాప్తి!

కాంగ్రెస్ దశాబ్దాల తరబడి అనుసరించిన విధానాలు నక్సలిజానికి ఊతమిచ్చాయని మోదీ అన్నారు. అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లోనే నక్సలిజం ప్రబలంగా విస్తరించిందని తెలిపారు. ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయని.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిశకం ప్రారంభమైందని చెప్పారు. మోదీ ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లా మోహభట్టాలో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. అనంతరం రూ.33,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంబికాపూర్-రాయ్‌పూర్ మధ్య మెమూ రైలును ప్రారంభించారు. రూ.9,790 కోట్లతో ఎన్‌టీపీసీ నిర్మించే సీపత్ సూపర్ థర్మల్ విద్యుత్కేంద్రం మూడో దశ(800 మెగావాట్లు) కు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.15,800 కోట్లతో నిర్మించిన మొదటి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టును ప్రారంభించారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లోని బీజీపూర్ జిల్లాలో ఆదివారం 50 మంది నక్సలైట్లు సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిలో 14మందిపై రూ.68 లక్షల మేర రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటనకు కొన్ని గంటల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

జల సంరక్షణకు కదలండి!

- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జల సంరక్షణకు నడుంబిగించాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గత ఎనిమిదేళ్లలో ప్రభుత్వం సహా పలు స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన కార్యక్రమాల ద్వారా 11 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని పొదుపు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ప్రతి నెలా చివరి ఆదివారం 'మన్‌కీ బాత్' శీర్షికన దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో చేసే ప్రసంగంలో ప్రధాని పేర్కొన్నారు. పండుగలు భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తాయని మోదీ అన్నారు. "ఈ ఆదివారం ఏపీ, తెలంగాణ, కర్ణాటక ప్రజలు ఉగాదిని జరుపుకొంటున్నారు. మహారాష్ట్రలో గుడిపడ్వా పేరుతో పర్వదినాన్ని నిర్వహించుకుంటున్నారు. ఇవన్నీ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. రాబోయే రోజుల్లో అసోం, పశ్చిమ బెంగాల్, కశ్మీర్‌లలో వేర్వేరు పండుగలు జరగనున్నాయి. అయినప్పటికీ భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తిని కొనసాగించాలి" అని ప్రజలను కోరారు. త్వరలోనే వేసవి సెలవులు రానున్నాయని, విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు మెరుగు పెట్టేందుకు ఈ సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాని సూచించారు. సెలవు దినాల్లో విద్యార్థుల కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించేవారు 'మైహాలీడేస్' హ్యాష్ ట్యాగ్‌ను వినియోగించాలని సూచించారు. కాగా, వస్త్ర వ్యర్థాలతో ప్రపంచం పెను సవాలు ఎదుర్కొంటోందని మోదీ చెప్పారు. ఇదొక చిత్రమైన సమస్య అని.. కానీ, ప్రపంచ దేశాలన్నీ ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయన్నారు. వస్త్ర వ్యర్థాల సమస్యను ఎదుర్కొంటున్న దేశాల్లో భారత్ మూడోస్థానంలో ఉందని తెలిపారు. పాత దుస్తుల రీసైక్లింగ్‌కు స్టార్టప్‌లు రావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు.

ఆదిలాబాద్ మహిళలకు మోదీ అభినందనలు

వివిధ రకాల పువ్వుల గురించి ప్రధాని మోదీ తన మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. అయితే.. విప్పపూల గురించి పెద్దగా ప్రాచుర్యం లేదన్నారు. కానీ, ఈ ఇప్పపూలు గిరిజనుల సంస్కృతిని ప్రతిబింబిస్తాయని చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా, తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన గిరిజనులు ఇప్ప పూలతో సరికొత్త ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకున్నారని మోదీ ప్రస్తావించారు. "తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు సోదరీమణులు ఇప్ప పువ్వులతో కొత్త ప్రయోగం చేస్తున్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. వాటిని ప్రజలు ఎంతో ఇష్టపడుతున్నారు" అని తెలుపుతు ప్రధాని వారిని అభినందించారు.



ఇక మీ జట్టు వీడం

- అమిత్‌షాకు నితీశ్ కుమార్ హామీ

పట్నా, మార్చి 30: బీజేపీతో మరోసారి తెగదెంపులు చేసుకొనే ప్రసక్తే లేదని జేడీయూ అధ్యక్షుడు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు హామీ ఇచ్చారు. గతంలో రెండుసార్లు బీజేపీ నుంచి దూరమవడం పొరపాటున జరిగిందని, దానికి తమ పార్టీలోని కొందరు కారణమని తెలిపారు. మరోసారి అలా చేయబోనని తేల్చిచెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నితీశ్ కుమార్‌తో కలిసి రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆదివారం అమిత్‌షా ప్రారంభించారు. అయోధ్యలో రామజన్మభూమి తరహాలోనే సీతాదేవి జన్మస్థలమైన బిహార్‌లో ఆమె గొప్ప ఆలయాన్ని నిర్మించాలని కేంద్రం భావిస్తోందని అమిత్‌షా చెప్పారు. కాగా, నితీశ్ నివాసంలో ఆదివారం సాయంత్రం ఎన్డీయే కూటమి నేతలు సమావేశమై అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో అమిత్‌షా కూడా పాల్గొన్నారు.

రెండు లేదా మూడున ముహూర్తం?!

» మంత్రివర్గ విస్తరణపై గవర్నర్‌కు సీఎం సూచన


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ మొదటివారంలో మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉందంటూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనప్రాయంగా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండో తేదీ సాయంత్రం లేదా మూడో తేదీ ఉదయం కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం పెట్టుకోవాలని భావిస్తున్నట్లు గవర్నర్‌కు చెప్పినట్లు సమాచారం. కనుక కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించాలని గవర్నర్‌ను సీఎం రేవంత్ కోరారని ప్రభుత్వ వర్గాల కథనం. ఉగాది పండుగ సందర్భంగా ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సీఎం రేవంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డిలతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సీఎం రేవంత్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్‌తో విడిగా సీఎం రేవంత్ భేటీ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్‌రెడ్డి అరగంట పాటు విడిగా సమావేశమయ్యారు. వారిద్దరూ పాలనాపరమైన అంశాలపై మాట్లాడుకున్నట్లు సమాచారం. ఏప్రిల్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చునని, రెండో తేదీ సాయంత్రం లేదా మూడో తేదీ ఉదయం కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం ఉండొచ్చునని గవర్నర్‌కు సీఎం వివరించారని చెబుతున్నారు. దీంతోపాటు అసెంబ్లీ ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదముద్ర వేయాలని గవర్నర్‌ను సీఎం కోరినట్లు తెలుస్తోంది. బిల్లుకు ఆమోదం తెలిపితే, ఉద్యోగ నియామకాల కోసం నోటిఫికేషన్ల విడుదలకు ఏర్పాట్లు చేసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఎస్సీ వర్గీకరణ చట్టరూపం దాల్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా తాను ప్రకటించిన సంగతిని గవర్నర్‌కు సీఎం గుర్తు చేసినట్లు తెలియవచ్చింది. స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం అసెంబ్లీ ఆమోదించిన బిల్లు లకు రాష్ట్రపతి ఆమోదం కోసం ప్రయత్నించాలని కోరినట్లు సమాచారం. ఇంకా అసెంబ్లీ ఆమోదించిన పలు బిల్లులకు ఆమోద ముద్ర వేయాలని కోరినట్లు తెలుస్తోంది.

అధిష్ఠానం నిర్ణయమే తరువాయి

మంత్రివర్గ విస్తరణ విషయమై ఇటీవల ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల అభిప్రాయాలను పార్టీ అధిష్ఠానం సేకరించింది. ఆ తర్వాత తమ వర్గానికి కూడా మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరుతూ మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ఎస్టీ లంబాడావర్గ ప్రజా ప్రతినిధులు.. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కలిశారు. ఈ అంశాలనూ పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం తుది నిర్ణయంపై కసరత్తు చేస్తోంది. సీఎం రేవంత్, ఇతర ముఖ్య నేతలతోనూ ఫోన్ల ద్వారా సంప్రదింపులూ నిర్వహిస్తోంది. అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోగానే కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతున్నారు. కాగా, వివిధ రాష్ట్రాల ప్రజల మధ్య అనుబంధం పెంచడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్‌భారత్- శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. ఆదివారం రాజ్‌భవన్‌లో రాజస్థాన్ అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజస్థానీ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.

విజయవాడలో ఆ 4 గంటలు!

పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో వీడుతున్న చిక్కుముళ్లు .. విజయవాడకు రాకముందే ఒకసారి రోడ్డు ప్రమాదం

» పగిలిన బుల్లెట్‌లైట్.. పాస్టర్ చేతికి గాయం
» రామవరప్పాడు రింగ్ వద్ద రెండో ప్రమాదం
» మద్యం మత్తులో బైక్ నడపడం నేరమని పాస్టర్‌కు ట్రాఫిక్ ఎస్ఐ కౌన్సెలింగ్
» వెళ్లొద్దని వారించినా మళ్లీ ప్రయాణం
» ఏలూరులో మరో మద్యం సీసా కొనుగోలు
» పోలీసుల వద్ద సీసీ ఫుటేజీలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతి కేసులో ఒక్కో చిక్కుముడి వీడుతోంది. విజయవాడలో ప్రవీణ్ 4 గంటల పాటు ఎక్కడున్నారన్న ప్రశ్నకు సాంకేతికంగా ఆధారాలను పోలీసులు సేకరించారు. రాజమహేంద్రవరం చేరుకోవడానికి ముందు ప్రవీణ్ విజయవాడలో ఆగినట్టు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించిన విషయం తెలిసిందే. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవడంతో సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా ప్రవీణ్ ప్రతి కదలికను పోలీసులు గుర్తించారు. దీనికోసం విజయవాడ, రాజమహేంద్రవరం పోలీసులు 300 కెమెరాల ఫుటేజీలను విశ్లేషించారు.

కోదాడలో మద్యం సీసా కొనుగోలు

ఈ నెల 24న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరిన ప్రవీణ్ అదేరోజు మధ్యాహ్నంలో కోదాడలోని మద్యం దుకాణంలో రూ.650తో మద్యం సీసా కొనుగోలు చేసి, ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించడానికి ముందే ప్రవీణ్ మద్యం తాగినట్టు అనుమానిస్తున్నారు. సరిగ్గా కంచికచర్ల-పరిటాల మధ్య అదుపు తప్పి పడిపోవడంతో బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిపోయింది. సేఫ్టీ రాడ్స్ వంగిపోయాయి. ప్రవీణ్ చేతులకు గాయాలయ్యాయి. గొల్లపూడి చేరుకున్న తర్వాత బంకు వద్ద పెట్రోలు పోయించుకున్నారు. అప్పటికే ప్రవీణ్ మాట్లాడలేని స్థితిలో ఉన్నట్టు బంక్‌లోని ఉద్యోగులు పోలీసులకు తెలిపారు. బంక్‌కు రాగానే ఎంత పెట్రోల్ పోయమంటారని సిబ్బంది అడిగితే ప్రవీణ్ ఎనిమిది వేళ్లు చూపించారు. 8 లీటర్లు పోయమంటారా అంటే.. అవునని సంకేతం ఇస్తూ తల పైకి, కిందకు ఊపారు. రూ.872 ఫోన్‌పే చేశారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీని పెట్రోల్ బంక్ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆయన జాతీయ రహదారిపై దుర్గగుడి ఫ్లైఓవర్, రాజీవ్‌గాంధీ పార్కు, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ మీదుగా బెంజిసర్కిల్ రెండో ఫ్లైఓవర్ ఎక్కి మహానాడు జంక్షన్‌కు చేరుకున్నారు.


విజయవాడలోని రామవరప్పాడు రింగ్ వద్ద ప్రమాదం తర్వాత అక్కడే కూర్చున్న ప్రవీణ్



పాస్టర్ ప్రవీణ్ బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిన దృశ్యం

'మహానాడు'లో దాటాక కాసేపు మాయం

మహానాడు కూడలి దాటాక రామవరప్పాడు రింగ్ వస్తుంది. ఇక్కడ సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు ప్రవీణ్ కనిపించకపోవడంతో మహానాడు కూడలి- రామవరప్పాడు రింగ్‌కు మధ్యలో ఏదో జరిగిందని అనుమానించారు. రామవరప్పాడు రింగ్‌కు పది మీటర్ల దూరంలోనే వోక్స్ వ్యాగన్ షోరూమ్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై బుల్లెట్‌పై నుంచి ఆయన పడిపోయారు. అక్కడే ఉన్న ఆటోడ్రైవర్లు రింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావుకు విషయం చెప్పారు. ఆయన పడిపోయిన ప్రవీణ్‌ను పైకి లేపి పక్కన ఉన్న రెయిలింగ్ వద్ద కూర్చోబెట్టారు. కాసేపటి తర్వాత పాస్టర్‌ను ఎస్ఐ నెమ్మదిగా నడిపించుకుంటూ, బుల్లెట్‌ను ఆటోడ్రైవర్లు తోసుకుంటూ రింగ్ వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్ దగ్గరకు తీసుకొచ్చారు. అక్కడ ముఖం కడుక్కోవడానికి ఆయనకు ట్రాఫిక్ ఎస్ఐ నీళ్లు ఇచ్చారు. ఆ తర్వాత బూత్ ఎదురుగా ఉన్న గడ్డిలో రాత్రి 8.20 గంటల వరకు పాస్టర్ నిద్రపోయారు. ఆయన నిద్రలేచ్చాక మద్యం మత్తులో వాహనం నడపడం నేరమని ఎస్ఐ సుబ్బారావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత ఇన్నోటెల్ హోటల్ పక్కన ఉన్న టీస్టాల్ వద్దకు తీసుకెళ్లి టీ ఇప్పించారు. టీ తాగిన తర్వాత ప్రవీణ్ బుల్లెట్‌పై ఏలూరు వైపు బయల్దేరారు. ఎస్ఐ వద్దని వారించినా ఆయన ఆగలేదు. ట్రాఫిక్ ఎస్ఐతో కలిసి పాస్టర్ టీ తాగడానికి వెళ్లడం, తిరిగి ట్రాఫిక్ బూత్ వద్దకు వచ్చిన దృశ్యాలు ఇన్నోటెల్ హోటల్ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. టోల్‌గేట్లు దాటుకుని ఏలూరు చేరుకున్నాక టానిక్ వైన్స్‌లో మద్యం కొని, రూ.350 ఫోన్‌పే చేశారు. ఈ సీసీ కెమెరా ఫుటేజీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చేతులకు గాయాలతో..

విజయవాడ రామవరప్పాడు రింగ్ సమీపంలో జాతీయ రహదారిపై ప్రవీణ్ పడిపోయారు. అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావుకు ఆయన ఎవరో తెలియదు. బుల్లెట్ హెడ్‌లైట్ పగిలిపోయి వైరుతో వేలాడుతూ ఉండడం, సేఫ్టీ రాడ్లు వంగిపోవడం, చేతులకు కొట్టుపోయినట్టుగా గాయాలు ఉండటం, హెల్మెట్‌కు సొట్ట పడటంతో ఎస్ఐ వీడియోలు, ఫొటోలు తీశారు. ఆ రోజున బుల్లెట్ పైనుంచి పడిపోయిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని, హెల్మెట్ ధారణపై అవగాహన పెంచడానికి ఫొటోలు, వీడియోలు తీశానని అధికారులకు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

చిన్నారిని గోడకేసి కొట్టి హత్య

» చిత్రహింసలు పెట్టి కర్కశంగా వ్యవహరించిన సవతి తల్లి
» కాలుతున్న పెనంపై కూర్చోబెట్టి మరో బిడ్డకు నరకం
» గుంటూరు జిల్లా గొల్లపాలెంలో దారుణం
» పోలీసులకు ఇరుగుపొరుగు సమాచారం.. దంపతులపై కేసు


కవలలు ఆకాశ్, కార్తీక్ (ఫైల్)

యడ్లపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సవతి బిడ్డలను చిత్రహింసలకు గురిచేయడంతో పాటు వారిలో ఒకరిని గోడకేసి కొట్టి హతమార్చిందో సవతి తల్లి. మరో బిడ్డను కాలుతున్న పెనంపై కూర్చోబెట్టిన నరకం చూపించింది. అయినా, ఈ అమానవీయ ఘటనలపై ఆ చిన్నారుల తండ్రి స్పందించలేదు. పిల్లల ఆర్తనాదాలకు చలించిపోయిన ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం గొల్లపాలెం గ్రామంలో జరిగిందీ దారుణం. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామానికి చెందిన కంచర్ల సాగర్ రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటారు. ఆయనకు కృష్ణాజిల్లా జనగాం ప్రాంతానికి చెందిన అనూషతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి తొలికాన్పులో కవలలు ఆకాశ్, కార్తీక్ జన్మించారు. రెండో కాన్పులో రెండేళ్ల క్రితం పాపకు జన్మనిచ్చిన మరుసటి రోజే అనూష మరణించారు. అనంతరం గొల్లపాలెం గ్రామానికి చెందిన లక్ష్మిని సాగర్ రెండో పెళ్లి చేసుకున్నారు. వీరికి 8 నెలల క్రితం పాప జన్మించింది. అనూషకు ద్వితీయ కాన్పులో కలిగిన పాపను యనమదల గ్రామస్థులకు దత్తత ఇచ్చారు. తమ వద్దే ఉంటున్న సాగర్, ఆకాశ్‌లను లక్ష్మి కొట్టడం, హింసించడం నిత్యకృత్యమైంది. సాగర్ మిన్నకుండిపోవడంతో లక్ష్మి మరింత రాక్షసంగా ప్రవర్తిస్తోంది. సుమారు నలభై రోజుల క్రితం వీరు కొండవీడు వదిలి గొల్లపాలెంకు మకాం మార్చారు. శనివారం ఉదయం సాగర్ పనికి వెళ్లగా, లక్ష్మి కవలలిద్దరినీ చిత్రహింసలకు గురిచేసింది. కార్తీక్(6)ను గోడకేసి కొట్టడంతో మృతిచెందాడు. ఆకాశ్‌ను నిక్కరు ఊడదీయించి కాలుతున్న పెనంపై కూర్చోబెట్టి పైశాచికంగా ప్రవర్తించింది. ఈలోగా పిల్లల ఆర్తనాదాలు విన్న ఇరుగుపొరుగువారు ఫిరంగిపురం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రవీంద్ర అక్కడికి వచ్చేసరికే కార్తీక్ నిర్జీవంగా పడిఉన్నాడు. కాలిన గాయాలతో ఏడుస్తున్న ఆకాశ్‌ను ఆస్పత్రికి తరలించారు. చిన్నారుల మేనత్త విజయ ఫిర్యాదు మేరకు లక్ష్మి, సాగర్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్తీక్ మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ముగ్గురు పిల్లలు, సవతి తల్లి మృత్యువాత

» కామారెడ్డి జిల్లా వెంకటాపూర్‌లో ఘటన
» చెరువులో పడి నలుగురి మృతి


మృతి చెందిన మైథిలి, వినయ్, అక్షర (ఫైల్)

ఎల్లారెడ్డి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ వేళ ఓ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. సవతి పిల్లలను కాపాడబోయి వారితో పాటు ఆ తల్లి కూడా మృత్యువాత పడింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం భిక్కనూరు పంచాయతీ వెంకటాపూర్ అగ్రహారంలో ఈ విషాదం జరిగింది. గ్రామానికి చెందిన బొమ్మర్తి లింగయ్యకు గతంలో మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన శ్యామలతో వివాహం అయింది. కూతుళ్లు మైథిలి, అక్షర, కుమారుడు వినయ్ పుట్టిన కొన్నాళ్లకు శ్యామల అనారోగ్యంతో చనిపోయింది. దాంతో లింగంపేట్ మండలం షెట్‌పల్లికి చెందిన మౌనికను లింగయ్య వివాహం చేసుకున్నాడు. మౌనికకు కూడా ఇది రెండో వివాహమే. లింగయ్య కూలి పనులు చేసుకుంటూ తండ్రి లక్ష్మయ్య, భార్య మౌనిక(26), ఇద్దరు కూతుళ్లు మైథిలి(10), అక్షర(9), కుమారుడు వినయ్(7)లతో కలిసి జీవిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం మౌనిక చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్తుండగా పిల్లలు కూడా వెళ్లారు. మౌనిక పని చేసుకుంటుండగా చెరువులో స్నానానికి దిగిన పిల్లలు మునిపోతుండడంతో వారిని కాపాడబోయి మౌనిక కూడా నీట మునిగింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి చూడగా గట్టున వారి చెప్పులు, బట్టలు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించగా .. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్ గజ ఈతగాళ్లతో వెతికించి ఆదివారం తెల్లవారుజామునకు నలుగురి మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వినయ్ గ్రామంలో రెండవ తరగతి చదువుతుండగా మైథిలి, అక్షర మెదక్‌లోని ఓ ప్రభుత్వ హాస్టల్లో చదువుకుంటున్నారు. ఉగాది పండుగకు ఇంటికి వచ్చిన పిల్లలు మృత్యువాత పడడంతో బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆత్మహత్యా?.. హత్యా? అన్న కోణంలో విచారణ:

తల్లి, పిల్లల మరణాలపై అనుమానాలున్నట్లు గ్రామంలోని కొందరు చర్చించుకుంటున్నారు. మౌనికకు భర్త లింగయ్యకు మధ్య కుటుంబ కలహాలుండేవని అంటున్నారు. ఈ క్రమంలో తల్లి, పిల్లల మరణాలు ప్రమాదవశాత్తు సంభవించినవా?? లేక ఆత్మహత్యా? లేక హత్యా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లింగయ్యను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.


దేవాదుల పైపులైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీళ్లు

ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద టన్నెల్ లీకేజీ

» అధికారుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం
» మోటార్లు ఆన్ చేసిన నాలుగు రోజులకే..
» ఆందోళనలో నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు

హనుమకొండ టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా దేవన్నపేటలోని దేవాదుల పంప్‌హౌస్ మూడో దశ పంపులకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మోటార్లను ఆన్ చేసిన నాలుగు రోజులకే ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద టన్నెల్ లీకవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం రెండు గంటలు నీరు లీకవగా పంటలు మునిగే క్రమంలో అధికారులు అప్రమత్తమై మోటార్లను నిలిపివేశారు. రెండు రోజుల్లో లీకేజీని సరి చేసిన తర్వాత మోటార్లు ఆన్ చేస్తామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని స్థానిక పోలీసులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా దేవన్నపేట పంప్‌హౌస్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 43 అడుగులు కాగా ప్రస్తుతం 36.8 అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

షకీల్ బియ్యం ఎగవేత కేసు రివర్స్!

» రూ.120 కోట్ల విలువైన బియ్యాన్ని బుక్కిన బోధన్ మాజీ ఎమ్మెల్యే
» ఫోర్జరీ, అక్రమ బదిలీపై న్యాయపోరాటం చేసిన మిల్లర్ కిశోర్
» హైకోర్టు ఆదేశాలతో అదనపు కలెక్టర్, డీఎస్‌వో, డీటీలపై కేసులు

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి చెందిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ బియ్యం ఎగవేత కేసు రివర్స్ అయ్యింది. ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ మాయం చేసి, తన మిల్లుల్లో బియ్యం బకాయిలేమీ లేవని చూపించడానికి చేసిన అక్రమ బదిలీ వ్యవహారం బెడిసి కొట్టింది. షకీల్ రైస్‌మిల్లుల నుంచి తన మిల్లులకు ధాన్యం తరలించినట్లు అధికారులు దొంగ కాగితాలు సృష్టించారని, సంతకాలు ఫోర్జరీ చేశారంటూ నిజామాబాద్ జిల్లా వర్నికి చెందిన రైస్ మిల్లర్ బోయపాటి కిశోర్ హైకోర్టును ఆశ్రయించడంతో బండారం బయటపడింది. కేసు విచారణ అనంతరం హైకోర్టు ఆదేశాల మేరకు గతంలో నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్, డీఎస్‌వోగా పనిచేసిన చంద్రప్రకాశ్, డిప్యూటీ తహసీల్దారు నిఖిల్‌రాజ్‌పై వర్ని పోలీసులు 465, 468, 506, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అప్పుడు ఎమ్మెల్యే షకీల్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ధాన్యం అక్రమ బదిలీ చేసిన అధికారులు ఇప్పుడు కేసులపాలయ్యారు. గత పదేళ్లలో డీఎస్‌వోలు, డీఎంలు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్లుగా ఉండేది. ధాన్యం కేటాయింపులు, సీఎంఆర్ రికవరీలో అక్రమాలకు పాల్పడి, కోట్లకు పడగలెత్తిన అధికారులు రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన ధాన్యం అక్రమ బదిలీలు, సీఎంఆర్ అక్రమాల్లో అదే జిల్లాకు చెందిన ఓ రాష్ట్రస్థాయి రైస్‌మిల్లర్ల సంఘం నాయకుడి హస్తం ఉన్నట్లు ఫిర్యాదులు అందాయని సమాచారం. మరోవైపు అసోసియేషన్ నేతల మిల్లుల్లో ఉన్న బియ్యం బకాయిలపైనా ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. అధికారులు కేసుల్లో ఇరుక్కోగా.. షకీల్ మాత్రం దుబాయిలో తన వ్యాపార పనుల్లో తలమునకలై ఉండడం గమనార్హం.

శ్రవణ్‌రావు అరెస్టు తప్పదా?

విచారణకు సహకరించని మీడియా చానల్ అధినేత!.. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులకు అరకొర జవాబులు

ఆదేశాలిచ్చిన పెద్దల పేర్లు బయటపెట్టని వైనం

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడైన మీడియా చానల్ అధినేత శ్రవణ్‌రావును పోలీసులు అరెస్టు చేస్తారా? ఆయనను అరెస్టు చేయకుండా కల్పించిన మధ్యంతర రక్షణను తొలగించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరతారా? అంటే.. అవుననే అంటున్నాయి పోలీసు వర్గాలు. శ్రవణ్‌రావు వ్యవహార్‌శైలి ఇదేవిధంగా కొనసాగితే ఆయనను అరెస్టు చేయక తప్పదని సీనియర్ పోలీసు అధికారులు అంటున్నారు. శనివారం పోలీసు విచారణకు హాజరైన శ్రవణ్‌రావు.. విచారణాధికారికి పూర్తిగా సహకరించలేదని తెలుస్తోంది. నాటి ప్రభుత్వ పెద్దల నుంచి తనకు వచ్చిన ఆదేశాల మేరకు కొన్ని ఫోన్ నెంబర్లను పోలీసు అధికారి ప్రణీత్‌రావుకు ఇచ్చానని అంగీకరించిన శ్రవణ్‌రావు.. ఆ పెద్దలు ఎవరంటే మాత్రం మౌనం వహించారని సమాచారం. గతేడాది మార్చిలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదవగా, ఆ వెంటనే శ్రవణ్‌రావు విదేశాలకు పారిపోయారు. దీంతో "ఈ కేసులో మీ ప్రమేయం లేకపోతే ఎందుకు విదేశాలకు పారిపోయారు? అక్కడి నుంచి ఎవరెవరితో మాట్లాడారు?" అని పోలీసులు అడిగిన ప్రశ్నలకు శ్రవణ్‌రావు సూటిగా సమాధానాలు ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే ఈ కేసులో అరెస్టయిన ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు సెల్‌ఫోన్లలోని వాట్సాప్ సందేశాలను ఆయన ముందు పెట్టి ప్రశ్నించడంతో కొన్ని ప్రశ్నలకు మాత్రం అరకొర జవాబులు ఇచ్చినట్లు సమాచారం. ఏప్రిల్ 2న మరోసారి విచారణకు హాజరుకావాలని దర్యాప్తు అధికారులు నోటీసు జారీ చేశారు. అప్పటికీ ఆయన వ్యవహార శైలి అలాగే ఉంటే.. విచారణ తీరును సుప్రీంకోర్టుకు వివరించి శ్రవణ్‌రావుకు ఇచ్చిన మధ్యంతర రక్షణను తొలగించాల్సిందిగా పోలీసులు కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రవణ్‌రావు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు ఈ నెల 2న తిరస్కరించడంతో ఆయన తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. శ్రవణ్‌రావు దేశానికి తిరిగి వచ్చి విచారణకు సహకరించదలచుకుంటే అప్పటివరకు ఆయనపై కఠినచర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన విదేశాల నుంచి వచ్చి పోలీసుల విచారణకు హాజరయ్యారు.



ప్రభాకర్‌రావు వస్తారా?

తనకు బెయిల్ ఇవ్వాలంటూ ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వేసిన పిటిషన్‌పై తీర్పు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఒకవేళ బెయిల్ పిటిషన్ హైకోర్టులో డిస్మిస్ అయితే శ్రవణ్‌రావు తరహాలోనే సుప్రీంకోర్టుకు వెళ్లాలని ప్రభాకర్‌రావు భావిస్తున్నట్లు సమాచారం. సుప్రీంకోర్టులో వచ్చే ఆదేశాల తర్వాత.. స్వదేశానికి తిరిగి రావాలా? లేదా? అనే విషయంలో ఆయన నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ఈలోపే ప్రభాకర్‌రావును రెడ్‌కార్నర్ నోటీసు ఆధారంగా విదేశాల నుంచి డిపోర్ట్ చేయించడానికి పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధానంగా నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, కుటుంబసభ్యులు, అనుచరుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు, ఆ సంభాషణలను ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ద్వారా నాటి ఎస్ఐబీ టీం విన్నట్లు చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా మునుగోడు, దుబ్బాక ఉప ఎన్నికలు, ఆ తర్వాత జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులకు సంబంధించిన ఫోన్ సంభాషణలు వింటూ వారికి ఆర్థిక సహాయం అందకుండా ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు పనిచేశాయన్న విషయం విచారణలో వెల్లడైంది. అప్పట్లో శ్రవణ్‌రావు ద్వారా కొన్ని ఫోన్ నంబర్లు వీరికి అందాయని, వాటిలో కొన్ని ముగ్గురు మంత్రుల ద్వారా వీరికి అందాయని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఆయా మంత్రులకు, ఫోన్ ట్యాపింగ్‌కు ఉన్న సంబంధాలను బయటపెట్టాలంటే శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావు జరిగిన విషయాలను వివరించాలని, వీరు అడ్డం తిరిగితే సాంకేతిక ఆధారాల ప్రకారం కేసును ముందుకు తీసుకువెళ్లాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

41 డిగ్రీలు దాటిన ఎండ

» రాష్ట్రమంతటా 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవి ఇంకా ముదరకముందే రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఆదివారం అన్ని జిల్లాల్లో 40డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధూరులో అత్యధికంగా 41.5 డిగ్రీలు నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, గద్వాల, ఆసిఫాబాద్, వనపర్తి, నిర్మల్, ఖమ్మం, నాగర్‌కర్నూల్, నిజామాబాద్ జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా అన్ని జిల్లాల్లో 40-41 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. కాగా, హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఆదివారం ఎల్‌బీనగర్‌లో అత్యధికంగా 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాప్రాలో 40.3, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, గోషామహల్, ముషీరాబాద్, చందానగర్, రామచంద్రాపురం, కుత్బుల్లాపూర్, అల్వాల్ ప్రాంతాల్లో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్‌లో గ్రేటర్ పరిధిలో 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశాలుంటాయని వెల్లడించింది. సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధికంగా నమోదవుతాయని అంచనా వేసింది. కాగా, రాష్ట్రంలో రెండు రోజుల తర్వాత అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 2,3,4 తేదీల్లో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాలకు వాతావరణశాఖ బుధవారం ఎల్లోఅలర్ట్ జారీ చేసింది.

బీఆర్ఎస్‌లో ఉన్నందుకు ఆర్ఎస్ ప్రవీణ్ సిగ్గు పడాలి: మల్లు రవి

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బీఎస్పీలో ఉన్నప్పుడు కేసీఆర్‌ది రాక్షసుల, రాబందుల పాలన అంటూ విమర్శలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అదే బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్నందుకు సిగ్గు పడాలని నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి అన్నారు. ఈ మేరకు గాంధీభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలను మల్లు రవి తీవ్రంగా ఖండించారు. ఒక దళిత వ్యక్తిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యల పట్ల తాను సిగ్గు పడుతున్నానని చెప్పారు.

ప్రతి మనిషీ ఒక్క పుస్తకమైనా రాయాలి

హిందీ కవి, రచయిత వినోద్ కుమార్ శుక్లా 2024 సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 1937లో జన్మించిన శుక్లా మొదటి కవితా సంపుటి 'లగ్‌భగ్ జైహింద్' 1971లో ప్రచురితమైంది. 'నౌకర్ కి కమీజ్', 'దీవార్ మే ఏక్ కిడ్‌కీ రహ్తీ థీ', 'ఖిలేగా తో దేఖేంగే' మొదలైనవి ప్రసిద్ధ నవలలు. జ్ఞానపీఠ్‌కు ఎంపికైన సందర్భంగా వేర్వేరు ఇంటర్వ్యూలలో ఆయన మాటల్లోంచి కొన్నింటిని ఏరి ఇక్కడ ప్రచురిస్తున్నాం.

– వివిధ



రచనలో సవాళ్ళు

పిల్లలు ఆడుతూ పెరిగినట్టు నేను రాస్తూ పెరిగాను. పదిహేను పదహారేళ్ళ వయసు నుంచీ రాస్తూనే ఉన్నాను. ఐనా రచన మీద పట్టు రాలేదు. మొదట్లో ఎదురైన సవాళ్లే ఇప్పుడూ ఎదురవుతాయి. నా దృష్టిలో రాయటం అంటే ఎప్పుడూ రాయటానికి చేసే ప్రయత్నమే.

కవిత పుట్టుక

రాయకముందే ప్రతి కవితా వాస్తవంలో దాగి ఉంటుంది. సమయం వచ్చినప్పుడే దాని సమక్షం మనకు తెలుస్తుంది. పచ్చటి చెట్లలో కలిసిపోయే రామ చిలక లాగ. అది ఎగిరిపోయినా దాని సమక్షం మన లోంచి మాయం కాదు. అది మన అనుభవంలో కలిసి పోతుంది. మన జ్ఞాపకంలో భాగమవుతుంది. ఆ జ్ఞాపకం నుంచి మరికొన్ని జ్ఞాపకాలు జన్మిస్తాయి.

ఆఖరు పంక్తి

కవిత ఏ పంక్తితో ముగిసేదీ ఆ కవితకే తెలుస్తుంది. ఒక్కోసారి నేను ఒకే కవితను జీవితమంతా తిరగ రాయగల ననిపిస్తుంది.

వచనం – కవిత్వం

నేను ఎక్కువ కాలం పాటు ఏ కవితా రాయలేనప్పుడే వచనం జోలికి వెళ్తాను. అలా వచనం రాస్తూపోతే మధ్యలో కవిత్వం ఎదురవుతుంది. వచనం నాకొక తవ్వకం పనిముట్టు. ఆలోచనల లోతుల్లోకి తవ్వు కుంటూ పోయాకనే కవిత్వం దొరుకుతుంది.

కవితలు కథలుగా, కథలు కవితలుగా...

నా కవితలేమీ కథలుగా మారలేదు. కానీ ఒక్కోసారి కథ రాస్తున్నప్పుడు కొన్ని పదాలు, వాక్యాలు–– పూర్తిగా ఏర్పడో ఏర్పడకుండానో–– ఎక్కడి నుంచో ఊడిపడ తాయి. అప్పుడు వెంటనే వెళ్ళి కవిత రాయబుద్ధవు తుంది. వచన రచనలో ఒక్కోసారి కవిత్వం పుట్టడం సహజమే. దాన్ని ఒక అడ్డుగా ఏమీ భావించనక్కర్లేదు. సృజనలో అదొక భాగం. మనలో కవిత పుట్టి అది అక్షరంగా మారడమనే ప్రక్రియ ఒక క్రమపద్ధతిని పాటించదు. ప్రతి కవితా తన పద్ధతిని తనే ఎంచుకుం టుంది. కవిత ముగియగానే ఆ పద్ధతీ ముగిసిపోతుంది.

మనుషుల ఆధారంగా పాత్రల్ని కల్పించేటప్పుడు

వాళ్ళ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. రాజకీయ నేతల కార్టూన్లు వేసేవాళ్ళు వాళ్ళని అడిగి వేయరు కదా. కొన్ని అడిగి చేయలేం. మనకి మంచో చెడో జరిగినప్పుడు ఆ అనుభవం గురించి రాసు కుంటాం. మన అనుభవం మనం రాసుకుంటున్నప్పుడు అందుకు కారణమైన వాళ్ళూ అందులోకి వస్తారు. అన్నిసార్లూ అనుమతి అడగలేం.

ప్రేరణ

మొదట ఒక సంఘటన గురించో ఆలోచన గురించో రాయాలనిపించి మనల్ని మనమే ప్రేరేపించుకుంటాం. రాసేదాక ఆ సంఘటన, ఆలోచనల పూర్తి స్వభావం ఏమిటో మనకే తెలియదు. రాయటం మొదలుపెట్టిన తర్వాత ఆ రాస్తున్నదే మనలో కొత్త ఆలోచనలను పుట్టిస్తూ మనల్ని ముందుకి నడిపిస్తుంది.

పిల్లల కోసం ఎలాంటి భాషలో రాస్తారు?

పిల్లల కోసం రాస్తున్నప్పుడు వాళ్ళ వయసును దృష్టిలో ఉంచుకుంటాను. కానీ నేను వాడే భాష మాత్రం పెద్ద వాళ్ల కోసం వాడేదే. ఊహాశక్తిలో పిల్లలు మన కంటే ఏమాత్రం తీసిపోరు. కాబట్టి భాషను మార్చను. వాక్య నిర్మాణం మాత్రం మారుతుంది. అంత్యప్రాస పిల్లల భాషలో భాగం. అది వాళ్ళ పసితనానికీ అమాయకత్వానికీ భావోద్వేగాలకూ దగ్గరగా వెళుతుంది.

సృష్టించిన పాత్రల్లో దగ్గరగా అనిపించే పాత్ర

నాకు దగ్గరగా అనిపించే పాత్ర నేనే. నేను రాసిందంతా నా జీవితం నుంచి పుట్టిందే. నా రచనల్లో 'నేను' అని మాట్లాడే ప్రతి పాత్ర లోనూ నేనున్నాను. నా రచనల్లో కనపడే ప్రదేశాలన్నీ నేను తిరిగినవీ, చూసినవీ! నేను చూడని, వినని వాటిని కూడా నా ఊహాశక్తితో సొంతం చేసుకుంటాను.



పాత రచనల్లో ఏదైనా మార్చే వీలుంటే...

మార్చాలన్న యావ ఉంటుంది. అందుకే ఒకసారి పబ్లిష్ అయ్యాక ఇక వాటి వంక మళ్ళీ చూడను. చూస్తే మార్చాలనిపిస్తుంది. కానీ ఒకసారి పబ్లిష్ అయ్యాకా ఆ రచన పాఠకులది అవుతుంది. వాళ్ళు ఒక రచనను తమ సొంతం చేసుకున్నాక ఇక దాన్ని మార్చే హక్కు నాకు లేదు.

స్థానీయత

స్థానీయత లోనే విశ్వజనీనత ఉంటుంది. మన స్థానీ యతను కాపాడుకోవాలి. మన బాల్యాన్నీ గడిచిన జీవి తాన్నీ జ్ఞాపకంలో ఉంచుకోవాలి. ప్రతి మనిషీ తన చరిత్రను రాసుకోవాలి. అలా రాసుకుంటే మనకి మరే చరిత్ర పుస్తకాల అవసరమూ ఉండదు. ప్రతి మనిషీ జీవితంలో కనీసం ఒక్క పుస్తకమైనా రాయాలి.


జ్ఞానపీఠ్ అవార్డుపై స్పందన

ఈ అవార్డు ఒక తియ్యని కబురు అని మాత్రం అనను. ఎందుకంటే నేను డయాబెటిక్! జీవితంలో చాలా చూశాను, విన్నాను, అనుభవించాను. కానీ చాలా తక్కువే రాయగలిగాను. రాసింది చూసుకుంటే రాయాల్సింది చాలా మిగిలే ఉందనిపిస్తోంది. మిగిలిన రచనలన్నీ త్వరగా పూర్తి చేయాలని ఉంది. కానీ పూర్తి చేయలేకపోవచ్చు. నా జీవితం వేగంగా ముగింపు వైపు దూసుకుపోతోంది. అంత వేగంగా ఎలా రాయాలో నాకు తెలీదు. ■

A Monologue of a Stone

(హంపీ కవితలు)

రణగొణ ధ్వనుల నగరం నుండి
మౌనంగా తపస్సు చేసుకునే
రాళ్ళ మధ్య వచ్చి పడ్డాను.



చిరుగాలి ఒక్కతే
వాకబు చేస్తూ పోతోంది.

ఎండావానా దోబూచులాడుకుంటూ
వాదించుకుంటున్నాయి.

హంపీ మీద ఆకాశం
కదలని కొండలా చూస్తోంది.

ఎక్కడెక్కడో ఎగిరి, ఇప్పుడే
రాయి మీద దాహంగా
పిట్ట ఒకటి వాలింది, నాలాగే



దిగంతాల అంచుల దాకా
చేతులు చాచిన ఆకాశాన్ని
చేతులు చాచి అందుకుంటున్న
కొండరాళ్ళు

బహుశా
ఏనాటిదో వాటి
పురాతన సంభాషణ.

భాష తెలీదనే బాధ లేదు.

హృదయం రిక్కించాను.

ఆడుకుంటూ ఆడుకుంటూ పిల్లలు
లక్కపిడతలు వదిలేసిపోయినట్టు
కొండల మీద నిలబడి బండలు.



చేతిలో ఐస్‌క్రీమ్‌లా
కళ్ళలోనుంచి ఆశ్చర్యం కారిపోతూ
నోరెళ్ళబెట్టి చూస్తున్నారు పిల్లలు.

పెద్దల కళ్ళల్లో నిండి పొంగిపోతూ
ఇంకా పెద్ద అచ్చెరువుచెరువులు.



నేను పోల్చుకోగలను
కళ్ళల్లో బెంగచెట్టు వేర్లు దిగేసినవాళ్ళను
చూపుల పూలు ఎక్కడో రాలిపడి
మనిషిలో మనిషి ఎక్కడో తప్పిపడి

రాతి రథాన్ని చూస్తూ
వేర్లు భూమిలో పాతేసుకున్న
రాతిచెట్టులా
స్థాణువై నిలబడిన నన్నూ
ఎవరో పోల్చుకుంటున్నట్టున్నారు.

తనివితీరని ఆత్మల్ని ఒలిచి
ఈ బండరాళ్ళ మీద ఆరేసి పోయేది
ఎందరో కదా



కవితలో ఇమడని పదబంధలా
సగం చెక్కి వదిలేసిన
రాతిస్తంభం మీద
సగం రాసేసిన కవితని మడతేసి
నిరామయంగా కూర్చున్నా.

ఊహల లోపలలోపలే
పూర్తిగా చెక్కిన కవితాకట్టడంలో
చెక్కీచెక్కని రాతిస్తంభాన్ని కూడా
కవితని నిలబెట్టే పదబంధంగా
కూర్చి వెళుతున్నా.



గాలి అంబారీ ఎక్కి
మదపుటేనుగులతో నడిచి

ఊహలఉలి పట్టుకొని
ఆ మహాశిల్పుల వెనుక
ఆశ్చర్యార్థకమై నిలబడుకొని

ధాన్యాగారంలో ఒక ధాన్యం మూటనై
నాట్యమండపాల్లో మార్మోగిన పాటనై
నర్తకీమణుల నడుమొంపునై
రాశులు పోసిన రత్నాల సొంపునై

స్నానాల మందిరాన
రాణిగారు పూసుకునే పరిమళ ద్రవ్యమై
రాయల వీరగాథల గేయాల శ్రావ్యమై

హంపీ వనక్షేత్రంలో
పచ్చదనపు పక్షినై

■ పి. శ్రీనివాస్ గౌడ్
✆ 99494 29449

గత వారం వివిధలో (24.03.2025) ప్రచురితమైన 'దళిత కవితకు తార్కిక పదును' అన్న వ్యాసానికి సాంకేతిక కారణం వల్ల రచయిత పేరు అచ్చు కాలేదు. ఆ వ్యాస రచయిత శీలం భద్రయ్య (98858 38288). పొరపాటుకు చింతిస్తున్నాం.

– వివిధ

'అసంకల్పిత పద్యం' కవితా సంపుటి

కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శేషభట్టర్ రఘు కవితా సంపుటి 'అసంకల్పిత పద్యం' ఆవిష్కరణ ఏప్రిల్ 6 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షుడు శిఖామణి; ఆవిష్కర్త వాడ్రేవు చినవీరభద్రుడు; వక్తలు కొప్పర్తి, తూముచర్ల రాజారామ్, నాళేశ్వరం శంకర్, పి. శ్రీనివాస్ గౌడ్.

కవిసంధ్య

'నేల తడుముతూనే' కవితా సంపుటి

తెరసం జంట నగరాలు – తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గుండెల్లి ఇస్తారి 'నేల తడుముతూనే' కవితా సంపుటి ఆవిష్కరణ ఏప్రిల్ 6 ఉ.10 గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త నందిని సిధారెడ్డి; అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు; విశిష్ట అతిథి నాళేశ్వరం శంకరం. రూప్ కుమార్ డబ్బీకార్, కొండపల్లి నీహారిణి తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు

జయమిత్ర పురస్కారం

జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు జి. చెన్నకేశవరెడ్డి జన్మదినం సందర్భంగా నందిని సిధారెడ్డికి పురస్కారం సగౌరవ సమర్పణ కార్యక్రమం ఏప్రిల్ 7 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షులు అమ్మంగి వేణుగోపాల్, ముఖ్య అతిథి వెలుదండ నిత్యానందరావు; విశిష్ట అతిథులు ఏనుగు నరసింహారెడ్డి, నాళేశ్వరం శంకరం; ఆత్మీయ అతిథులు ఎం.కె. రాము, ఎం. శంకర్ రెడ్డి తదితరులు పాల్గొంటారు.

రాయారావు సూర్య ప్రకాశరావు

హాస్య, వ్యంగ్య కథల పోటీ

కీ.శే. ఎ.వి. చయనులు స్మృతిలో కథలను ఆహ్వానిస్తున్నాం. 45 ఏళ్ళ లోపు వాళ్ళు మాత్రమే పంపాలి. పేజీల పరిమితి లేదు. హాస్య, వ్యంగ్య రచనలకి ప్రాధాన్యం. ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి. ఎంపికైన కథకు రూ.10వేల బహుమతి. కథలు జూన్ 25లోగా యూనికోడ్/ పిడిఎఫ్‌లో ఈమెయిల్: vidyasagarsriadibhatla@gmail.com కు పంపాలి. వివరాలకు ఫోన్: 94923 40651.

ఎస్. ఎ. విద్యాసాగర్

సోమవారం 31 మార్చి 2025
వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

మెరుపు వచనకారుడు

ఒక కవిని ఎలా పరిచయం చేయాలి? ఒక కథ మీద ఎలా కామెంట్ చేయాలి? ఒక సినిమాని ఎలా సమీక్షించాలి? సాహిత్యంలోనో, సంగీతంలోనో, వ్యాపారంలోనో ప్రసిద్ధుడయిన ఒకరి గురించి చెప్పడం ఎలా?

ఇందులో విశేషం ఏమీ లేదు. ఏళ్ల తరబడి సమీక్షలు, వ్యాఖ్యానాలు, వ్యాసాలూ చూస్తూనే వున్నాం. అవి ఎక్కువగా ఒక మూసలో వుంటాయి. పాత సంప్రదాయాన్ని పట్టుకు వేలాడుతుంటాయి. కొన్ని అకడెమిక్‌గా, కొన్ని పడికట్టు పదాలతో, మరికొన్ని మొక్కుబడిగా వుంటాయి. ఆ mould ని విజయవంతంగా బ్రేక్ చేసినవాడు తాడి ప్రకాష్.

జర్నలిస్టుగా అనుభవం, సాహిత్యాభిలాష, ఆధునికమైన చూపు – సంప్రదాయాన్ని బద్దలు చేయగల శక్తిని ప్రకాష్‌కి యిచ్చాయి. తెలుగులో బాగా రాయగలిగేవాళ్లు చాలామంది వున్నారు. సమర్థవంతంగా రాయగలిగేవాళ్లూ అనేకమంది వున్నారు. కానీ తాడి ప్రకాష్‌లా ఒక బ్రేక్ త్రూ సాధించినవాళ్లు అతికొద్దిమంది. ప్రకాష్ వాక్యాలు చాలా తేలిగ్గా రాసినట్టు పైకి కనిపించినా, ఆ నిర్మాణం సౌమ్యంగా, హుందాగా సాగుతూనే, చటుక్కున దూకుడుగా ఒక మాట అనడం వెనక ఒక కచ్చితమైన వ్యూహం వుంటుంది. పాజిటివ్‌గా రాసినా, నెగెటివ్‌గా రాసినా, కొన్నిచోట్ల కొంత 'అతి'గా అనిపించినా, ఆయన నిజాయితీ అక్షరాల్లో మెరుస్తూనే వుంటుంది.

"పొగడ పూల పరిమళమే వగరు జ్ఞాపకాల నవ్వు" అంటూ విమల కవిత్వం గురించిన ప్రకాష్ సమీక్ష విలువైనది. శ్రీశ్రీ అంతిమయాత్రపై ప్రకాష్ ఆర్టికల్ ఎప్పటికీ మరిచిపోలేం. ఐస్ బ్లాక్ మీద అచేతనంగా వున్న మహాకవి గురించి రాస్తూ, "హిమాలయాన్ని తలకింద దిండుగా పెట్టుకుని నిద్రపోతున్న అగ్నిపర్వతంలా వున్నాడు శ్రీశ్రీ" అన్నాడు ప్రకాష్. మహాకవి అంతిమ వీడ్కోలు ఆర్టికల్‌కి ప్రకాష్ పెట్టిన హెడ్డింగ్: 'శ్రీశ్రీకి అశ్రుదీపాల అల్విదా'.

'మాండలికంలో మొగలాయి' నామిని అన్నా, 'సట్లెజ్ కెరటాలు పిలిచాయా బంగోరే!' అన్నా, 'ఒక బెల్జియం అద్దం' రాంభట్ల కృష్ణమూర్తి అన్నా – అది ప్రకాష్ మార్క్ రచన. కమ్యూనిస్టు భావజాలం వున్నవాడే అయినా, "కమ్యూనిస్టు పార్టీలకు భవనాలు మాత్రమే మిగిలి, జనాలు దూరం అవుతున్న కాలం ఇది" అని రాస్తాడు. నండూరి రామ్మోహన్ రావు, ఎ.బి.కె. ప్రసాద్, కె.ఎన్.వై పతంజలి లాంటి గొప్పవాళ్లతో కలిసి పనిచేసిన అనుభవాలు రాసినా, తనని తాను ప్రొజెక్ట్ చేసుకోడు.

గోరటి వెంకన్న గురించి రాస్తూ, "హృదయాన్ని పాటతో నింపేవాడి గ్లాసు మాత్రం నింపగల నిమిత్తమాత్రుణ్ణి నేను" అంటాడు. ప్రొఫెసర్ సాయిబాబా గురించి రాస్తూ, "చదువూసంధ్యా లేని చవట సన్నాసులు రాజ్యమేలుతున్నపుడు, జ్ఞానకాంతులీనే ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ జైల్లో వుండటమే న్యాయం కదా" అంటాడు. జర్నలిజం, కవిత్వం, సాహిత్యం, సంగీతం, సినిమా, రాజకీయాలు, చరిత్ర.. దేని గురించి అయినా హృదయాన్ని హత్తుకునేలా చివరి వాక్యం దాకా చదివించేలా రాయగలగడం సామాన్య విషయం కాదు. సున్నితమైన, కవితాత్మకమైన ప్రకాష్ వచనం చదువుకోవడం ఒక మంచి అనుభవం. అందులోని వ్యంగ్యమూ, ఎకసెక్కమూ గిలిగింతలు పెడతాయి.

జర్నలిజం, కవిత్వం, సాహిత్యం, సంగీతం, సినిమా, రాజకీయాలు, చరిత్ర.. దేని గురించి అయినా హృదయాన్ని హత్తుకునేలా చివరి వాక్యం దాకా చదివించేలా రాయగలగడం సామాన్య విషయం కాదు. సున్నితమైన, కవితాత్మకమైన ప్రకాష్ వచనం చదువుకోవడం ఒక మంచి అనుభవం. అందులోని వ్యంగ్యమూ, ఎకసెక్కమూ గిలిగింతలు పెడతాయి.

'ఉదాత్తమైన అక్రమ ప్రేమ' అనే శీర్షికతో జాతీయ, అంతర్జాతీయ సినిమాల గురించి ఒక సిరీస్ రాశాడు. భూమిక, పరోమా, ఆస్త్రా, సమ్మర్ ఆఫ్ 42, శోభ– బాలూ మహేంద్ర ఎఫైర్ గురించిన వ్యాసాలు చదివి తీరవలసినవి. పెళ్లయిన స్త్రీ మరొకతనితో ప్రేమలో పడడం అనేది వీటి థీమ్. ఇందులో భాగంగానే నటి ఇంగ్రిడ్ బెర్గ్‌మన్ భర్త, గ్రేట్ ఇటాలియన్ డైరెక్టర్ రోబర్టో రోసాలిని, బెంగాలీ బ్యూటీ సోనాలి ప్రేమకథ తెలుగులో మొదటిసారి రాసింది ప్రకాష్ మాత్రమే. అలాగే, చేగువేరాని పాతిపెట్టిన ప్రాంతాన్ని 30ఏళ్ల తర్వాత డిస్కవర్ చేసిన ప్రఖ్యాత అమెరికన్ జర్నలిస్టు జాన్ లీ ఆండర్సన్ గురించి మొదటిసారి మనకి తెలియజేసిన వాడూ ఈ ఉత్తమ జర్నలిస్టే.

తెలుగు సాహిత్యంలో కె.ఎన్.వై పతంజలి ప్రాధాన్యం గురించీ, తెలుగు కళకి ఆర్టిస్ట్ మోహన్ కాంట్రిబ్యూషన్ గురించీ, తెలుగు సాహిత్య విమర్శని పదును పెట్టిన రాచమల్లు రామచంద్రారెడ్డి కృషి గురించీ ప్రకాష్ వ్యాసాలు మళ్లీ మళ్లీ చదువుకునేలా వుంటాయి. సొలోమోన్ విజయ్ కుమార్ 'మునికాంత పల్లె కథలు' చదివి, "ఏం రాశావ్ రా నా కొడకా" అని ప్రకాష్ దురుసుగా అనడం సంప్రదాయ పద్ధతిని బద్దలుకొట్టడానికే. 'నల్ల వంతెన' కథలు రాసిన నాగేంద్ర కాశీని, 'మైరావణ' రాసిన యువ రచయిత ప్రసాద్ సూరినీ భుజం తట్టి ప్రోత్సహించడం ప్రకాష్ ఎంతో బాధ్యతతో చేసిన పని. 'సాహిత్యంలో స్త్రీ సాహసం' అంటూ ఇప్పటి రచయిత్రుల గురించిన వ్యాసం – ప్రకాష్ ఇప్పటికీ విస్తృతంగా చదువుతున్నాడనడానికి ఒక నిదర్శనం.



'అనుభూతి గీతమై విరబూసిన వెన్నెల' అంటూ ఖదీర్ బాబు జ్ఞాపకాలకు ప్రకాష్ రాసిన ముందుమాట దాదాపు కవిత్వమే. చేరా, మద్దుకూరి చంద్రం, వేగుంట మోహన్ ప్రసాద్ గురించి రాసినా, అరుణ్ సాగర్, కలేకూరి ప్రసాద్, పైడి తెరేష్ బాబు గురించి రాసినా ఆప్యాయత నిండిన ఆ అక్షరాల్లో ఒక ప్రత్యేక ఆకర్షణ వుంటుంది. విశ్వనాథ, పెద్దిబొట్ల, బంగోరె, కేశవరెడ్డి, గుడిహాళం రఘునాథం లాంటి మహానుభావుల గురించి ప్రకాష్ గాఢమైన అనుభూతితో, ఒక ఉద్వేగంతో రాసే మాటలు కంటతడి పెట్టిస్తాయి.

జర్నలిస్టుగా ప్రకాష్ 40 ఏళ్ల అనుభవాలూ, జ్ఞాపకాలతో మూడేళ్ల క్రితం వచ్చిన 'ఏలూరురోడ్ ఆత్మగీతం' పుస్తకం జనాదరణ పొందింది. ప్రకాష్ వ్యాసాలతో రెండో పుస్తకం 'ఖైరతాబాద్ చౌరస్తా' త్వరలోనే రాబోతోంది. సొంత గొంతు వున్న గొప్ప రచయిత కె.ఎన్.వై పతంజలి లిటరరీ అవార్డును ఇటీవల ప్రకాష్ స్వీకరించిన సందర్భంగా "ప్రకాష్ ఈ కాలపు పతంజలి" అన్నారొక సాహితీవేత్త. నిజమేనేమో!

■ కూనపరాజు కుమార్
✆ 99899 99599

ఈ కవి యుద్ధభూమిలో సంచరించే పిల్లాడు

ప్రపంచంలోని ఎన్నో చారిత్రక యుద్ధాలు మొదలు నేటి కశ్మీర్ అంతర్యుద్ధం, మణిపూర్ అల్లర్లు, కగార్ అణచివేతలని చూసినప్పుడు రాజ్యం అధికార దుర్వినియోగం, సైనిక ప్రాబల్యం వంటివి స్పష్టంగా తెలిసివస్తాయి. ఈ కవిత కూడా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాష్టీకాల్ని తీవ్రంగా నిరసిస్తూ రాసినది. శైశవంలోనే ముగిసిపోతున్న జీవితాలకు గాజాలో దొరికే పిల్లల అస్థిపంజరాలే సాక్ష్యం అంటాడు కవి. వాటినన్నా కౌగిలించుకోండని అసహన పడతాడు. అందులో అధిక్షేపంతో కూడిన గొప్ప వాస్తవిక సంయమనం కనిపిస్తుంది.



యుద్ధ ప్రాంతంలో అమ్మలు పెట్టే తీయటి ముద్దుల ఆనవాళ్ళు లేవని, పిల్లల నోటి దగ్గరి రొట్టెలను బాంబులు లాక్కుంటున్నాయనీ కవి ఒక హృదయవిదారకతను మనకి సాదృశ్యం చేస్తాడు. తీవ్రమైన వేదన, భరింపరాని క్షోభల స్థిర రూపం ఎవ్వరినైనా కలచి వేస్తుంది. కానీ ఆ కలవరం వెనుక గల నిస్సహాయత, దుఃఖం, దైన్యత కవిత్వపాదాల్లోకి జొరబడినప్పుడు వాటి పదును చాలా కాలం మనని ఛిద్రం చేస్తుంది. ఆ రకంగా ఒక విసురు ఉన్న కవిత. విల్ఫ్రెడ్ ఓవెన్, డబ్ల్యూ.బి. యీట్స్ వంటి పాశ్చాత్యులతో బాటు తిలక్, శివసాగర్, వరవరరావు, ఎండ్లూరి సుధాకర్ లాంటి తెలుగు కవుల కవితల్లో కూడా అవకాశవాద యుద్ధాలలో ఉండే స్వార్థం, క్రౌర్యం, విధ్వంసాల గురించి మనం చదివి ఉన్నాం. చరణ్ కవిత్వ నిర్మాణంలో కాల్పనిక అతిరేకత లేదు. స్మృతుల తలపోత, ప్రతిఫలం కోరని మాతృ త్యాగం, ఉపమానాలుగా ఉన్నాయి. తల్లి స్పర్శ, లాలనలతో ముడిపడి ఉన్న పిల్లల భావోద్వేగాలతోనే యుద్ధాన్ని వ్యతిరేకించడం ఈ కవితలోని అంతర్ధ్వని. తల్లీబిడ్డల వాచక వ్యక్తీకరణల వెనుక దేశం, ఆ దేశ ప్రజల అస్థిరత, అనేక విషాద శకలాలుగా ప్రతిబింబిస్తుంది. అపరాధ భావనే లేని ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాల కపట, దోపిడీ మనస్తత్వాలు బోధపడతాయి. అందుకే ఈ కవితలో అంతర్లీనంగా ఒక చారిత్రక ఎరుక ఉంది. అది రాజకీయంగా కాల పరీక్షకు నిలబడుతుంది. మెత్తదనం, అమాయకత్వం, సంవేదనలతోనే శత్రువులపై చరణ్ తిరగబడుతున్నాడు. అతని ప్రతిఘటనలో ఒక లేలేత పసిదనంతో కూడిన హేతువు కందని మానవ ప్రేమ ఉంది. దాని సహజమైన మెరుపు వలనే నా ఇది ప్రియపద్యం.


■ శ్రీరామ్ పుప్పాల
✆ 99634 82597

ప్రియ పద్యం

సాక్ష్యాన్ని కౌగిలించుకోండి

అమ్మను పిలవడానికి, పాలు తాగడానికీ
పెదవులు లేవు
నవ్వులనూ లాలిపాటలనూ వినడానికి
చెవులు లేవు
కాసింత ప్రేమ శ్వాసను పీల్చడానికి
దేహంలో జీవం లేదు

బాంబు పొగలో చర్మం ఆవిరై
దేహం ఛిన్నాభిన్నమై నేను దొరికితే
మా అమ్మ పెట్టిన ముద్దుల ఆనవాళ్ళు
కనిపించడం లేదని గుర్తు చేయకండి
అమ్మ వొడిలో వాల్చిన తల
ఇప్పుడు నా దేహానికి లేదని
గుర్తు చేయకండి



+++

మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి
చూడ్డానికి కళ్ళు లేవు
స్పర్శించడానికి చేతుల్లేవు
ఆమె అడుగుల్లో అడుగేసి నడవటానికి
కాళ్ళు లేవు
మా అమ్మింకా బతికే ఉందని గుర్తు చేయకండి
నా కోసం పరిగెత్తుకుంటూ వస్తుందని నాతో చెప్పకండి
దోగాడుతూ ఎదురెళ్ళటానికి
నేనిప్పుడు పసిపాపను కాదు
మాంసం ముద్దనూ కాదు
ఒట్టి బొక్కల చూరను

మా అమ్మింకా బ్రతికే ఉందని గుర్తు చేయకండి
మళ్ళీ నా పేరును నాకే గుర్తు చేయకండి
చనిపోయిన నాతోటి పసిపిల్లల పేర్లను గుర్తు చేయకండి
ఇది బాల్యానికి చోటులేని దేశమని గుర్తు చేయకండి
రొట్టెముక్కలను బాంబులు లాక్కుంటాయని గుర్తు చేయకండి
అస్థిపంజరం అనే పేరుగాంచిన బొక్కలగూడు మాత్రమే నేను

+++

కూల్చబడ్డ ఆసుపత్రి గోడల కింద
నేను అస్థిపంజరమై దొరికితే
నన్ను కౌగిలించుకోవడానికి నిరాకరించకండి
మరణించిన మానవీయతకు
బాల్యాన్ని రుచి చూడని ఈ అస్థిపంజరాలే సాక్ష్యం
సాక్ష్యాన్ని కౌగిలించుకోండి!
మనసారా సాక్ష్యాన్ని కౌగిలించుకోండి!

■ దొంతం చరణ్



కవులను, కళాకారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, సిరిసిల్ల రాజయ్య



పంచాంగ శ్రవణం చేసిన ఐనవోలు రాధాకృష్ణశర్మను సత్కారం

శ్రీ విశ్వావసోత్సాహం

ఉగాది పర్వాన్ని ఇంటింటా ఆడంబరంగా జరుపుకున్నారు. ఉదయమే ఇండ్లను మామిడి తోరణాలు, అందమైన పూలతో ముస్తాబు చేసుకున్నారు. ఇండ్ల ముందు ప్రత్యేక రంగవల్లులను తీర్చిదిద్దారు. అభ్యంగన స్నానాలను అచరించి ఇష్ట దైవాలను పూజించారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించి భక్షాలను అరగించారు. సాయంత్రం వేళ అన్ని అలయాల్లో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణాలకు తరలివెళ్లి ఈ యేడు రాశిఫలాలను శుభ, అశుభ ఫలితాలను పంచాంగ రహస్యాలను పండితుల ద్వారా తెలుసుకున్నారు. సంప్రదాయ నూతన వస్త్రాలను ధరించి తెలుగువారి సంస్కృతిని చాటి చెప్పారు.

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- నోరూరించిన షడ్రుచుల పచ్చళ్లు
- ఘుమఘుమలాడిన బొబ్బట్లు
- అలరించిన కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణాలు



ఘనంగా ఉగాది వేడుకలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాదిని ప్రజలు ఆనందోత్సాహాలతో వైభవంగా జరుపుకున్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇళ్లను మామిడి తోరణాలు, బంతి పూల మా లలతో అలంకరించారు. నూతన వస్త్రా లు ధరించి కొత్త కుండలో షడ్రుచులతో ఉగాది పచ్చడిని తయారు చేశారు. ఘుమఘు మలాడే బొబ్బట్లను (భక్షాలను) తయారు చేసి దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. బంధుమి త్రులతో కలిసి ఇంటిల్లిపాది స్వీకరించారు. అ నంతరం ఆలయాలకు వెళ్లి దైవ దర్శనాలు చేసుకున్నారు.

వేయిస్తంభాల ఆలయంలో..

వేయిస్తంభాల ఆలయ ప్రాంగణం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం నిర్వహించిన పంచాంగ శ్రవణం, కవి సమ్మేళా న్ని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేతార్క మూల అలయ అర్చకుడు ఐనవోలు రాధాకృష్ణశర్మ సిద్ధాంతితో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. అలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రాధాకృష్ణశర్మ ద్వాదశ రాశుల ఆదాయ వ్యయాలను వివరించారు.

శ్రీవిశ్వావసు నామ సంవత్సరంలో అధిపతిగా రవి (సూర్యుడు) ఉండటం వల్ల సంపదలకు లోటుఉండదని, సకల శుభాలకు ఈ సంవత్సరం లోటు ఉండదని చెప్పారు. ప్రధానంగా చోరభయం, అగ్నిప్రమాదాలు అధికంగా సంభవిస్తాయని చెప్పారు.

అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం ఆద్యంతం అలరింపచేసింది. శ్రీ విశ్వావసు నామ సంవత్సరాన్ని కీర్తిస్తూ ఆలపించిన గజల్ గీతాలు, పద్యాలతో కవి సమ్మేళనం రెండు గంటల పాటు ఉల్లాసంగా కొనసాగింది. డాక్టర్ జయవీర్‌రాజు ప్రారంభించిన ఈ కవి సమ్మేళనంలో వల్స పైడి, రామా రత్నమాల, మెరు గు అనురాధ, డాక్టర్ అడ్లూరు వెంకటేశ్వ ర్లు, వకుల వాసు, ప్రవీణ్‌కుమార్, ముచ్చర్ల రమేశ్, ఎమ్డీ సిరాజుద్దీన్, అరుణ కీర్తి పతాక తదితర కవులు కవితగానం చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గట్టు మహేశ్‌బాబు, అలయ ఈవో అనిల్ కుమార్, ఆలయ ప్రధానఅర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ తదితరులు ముఖ్య అతిథులు చేతుల మీదుగా కవులను ఘనంగా సత్కరించారు. రుద్రేశ్వర సేవా సమితి పక్షాన చోల్లేటి కృష్ణమాచార్య స్వాగతం పలికారు. కార్యక్ర మంలో భాగంగా తాడూరి రేణుక శిష్యబృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతకుముందు రుద్రేశ్వరాలయంలో 10 రోజుల పాటు జరిగే శ్రీరామ నవరాత్రి వేడుకల పర్వాన్ని మణికంఠశర్మ, సందీప్‌శర్మ ఇతర అర్చకుల వైదిక కార్యక్రమాల మధ్య ఎమ్మెల్యే నాయిని, రాజయ్య, గట్టు మహేశ్ బాబులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

పంచాంగ శ్రవణాలు

భద్రకాళి అమ్మవారి దేవాలయంలో ఐనవోలు రాధాకృష్ణ శర్మ పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. జేపీఎన్‌రోడ్డులోని గీతా భవన్‌లో, బట్టల బజార్‌లోని శ్రీవేంకటేశ్వర దేవాలయం, ఎల్లం బజార్‌లోని శ్రీసీతా రామ చంద్రస్వామి దేవాలయం, కాశిబుగ్గలోని శివాలయం, కరీమాబాద్‌లోని బొమ్మల గుడితోపాటు శివ నగర్‌లోని రామాలయంలో, స్టేషన్‌రోడ్డులోని ఆకారపు వారి గుడిలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఇవే కాకుండా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాలను నిర్వహించారు. ప్రజలు ఈ ఏడాదిలో తమ రాశి ఫలాలు ఏవిధంగా ఉన్నాయని తెలుసుకున్నారు.

ఆలయాల్లో దర్శనాలు

ఉగాది పర్వదినం సందర్భంగా నగరంలో దేవాలయాలు కిటకిటలాడాయి. భద్రకాళి అమ్మవారిని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్‌తో పాటు పలువురు అధికారులు దర్శించుకున్నారు. ములుగు రోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ స్వామిని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య , సీఐ బాలాజీ, పలువురు అధికారులు దర్శించుకున్నారు.



వేయిస్తంభాల ఆలయంలో భక్తులు



భద్రకాళి ఆలయంలో పంచాంగ శ్రవణాన్ని తిలకిస్తున్న భక్తులు



చాంద్ నజర్ ఆగయా..

నేడు 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినం

- పూర్తయిన 29 రోజుల ఉపవాస దీక్షలు
- కనిపించిన నెలవంక.. పండుగ జరుపుకోనున్న ముస్లింలు
- నమాజ్‌కు సిద్ధమైన ఈద్గా మైదానాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన మసీద్‌లు



మహబూబాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు నియమ నిబంధనలతో చేపట్టిన ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 1న నెలవంక దర్శనంతో 2వ తేదీ నుంచి ప్రారంభమైన రంజాన్ ఉపవాసాలు ఈ నెల 30తో ముగిశాయి. చంద్ర దర్శనాన్ని బట్టి ఈ సారి 29రోజుల పాటు ఉపవాసాలు కొనసాగాయి. సౌదీ ఆరేబియాలో శనివారం సాయంత్రం నెలవంక కన్పించడంతో ఆదివారం అక్కడితో పాటు పశ్చిమ ఆసియా దేశాల్లో రంజాన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భారతదేశంలోనకూడా నెలవంక కనిపిచింది. దీంతో అన్ని ముస్లిం పెద్దల కమిటీలు సోమవారం రంజాన్ పండుగ జరుపుకునేందుకు నిర్ణయించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రధానపట్టణాల్లోని ఈద్గా మైదానాలను సామూహిక ఈదుల్ ఫిత్ర్ నమాజ్ నిర్వహించేందుకు శుభ్రం చేసి ఉంచారు. ఈద్గా కమిటీల నిర్వాహకులు ఎండకాలం కావడంతో సామూహిక ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా షామియానాలు వేసి, జానిమాజ్‌లు పరిచి ఏర్పాట్లు పూర్తి

మిగతా 7వ పేజీలో...



హనుమకొండలో ముస్తాబైన మసీద్



భద్రకాళి అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు







నేత్రపర్వంగా వసంత నవరాత్రోత్సవాలు

వరంగల్ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో ఉగాది పర్వదినం తొలి తెలుగు నూతన సంవత్సరం చైత్రమాసం ఆదివారం వసంత నవరాత్రోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి సన్నిధిలో ఈ ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం నిత్య పూజ అనంతరం మూల విరాట్ భద్రకాళి అమ్మవారికి అర్చకులు పూర్ణాభిషేకం నిర్వహించారు. అనంతరం అలంకరణ చేసిన తర్వాత వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్. నాగరాజుకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గులాబీ పూలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్ అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఐనవోలు రాధాకృష్ణ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు, ఆలయ సిబ్బంది, అర్చకులు పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో మెరిసిన విద్యాకుసుమాలు

- మందారిపేట అమ్మాయి తేజస్వినికి 4వ ర్యాంకు
- వరంగల్ యువకుడు రోహిత్‌కుమార్‌కు 77వ ర్యాంకు
- రాయపర్తి కుర్రాడు రాకేష్‌కు 78వ ర్యాంకు
- హర్షం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు



జిన్నా తేజస్వినిరెడ్డి





రోహిత్‌కుమార్, ఇల్లందుల రాకేష్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన పలువురు ప్రతిభ కనబరిచారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబం జిన్నా విజయ్‌పాల్‌రెడ్డి-హేమలత దంపతుల కూతురు జిన్నా తేజస్వినిరెడ్డి గ్రూప్-1 పరీక్షలో 532.5 మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యే అవకాశాన్ని చేజిక్కించుకున్నారు. చిన్ననాటి నుంచి చురుకుగా ఉండే తేజస్వినిరెడ్డి 2019లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో అర్హత సాధించి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో పంచాయతీ అధికారిగా పనిచేశారు. కాగా, ప్రస్తుతం గ్రూప్-1లో 4వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ అవకాశాన్ని సాధించారు. కాగా, జిన్నా తేజస్విని రెడ్డి హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసి హైదరాబాద్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ విభాగంలో పట్టభద్రురాలయ్యారు. టెన్త్‌లో 559 మార్కులు సాధించగా, ఇంటర్‌లో 966, ఇంజనీరింగ్‌లో 85.5 శాతం మార్కులు సాధించారు. ఈ సందర్భంగా తేజస్వినిరెడ్డి మాట్లాడుతూ.. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించానన్నారు. తల్లిదండ్రుల కలను నెరవేర్చినందుకు ఆనందంగా ఉందన్నారు.

రోహిత్‌కుమార్‌కు 77వ ర్యాంకు

వరంగల్ చౌరస్తా: గ్రూప్ -1 పరీక్ష ఫలితాల్లో వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన వి.రోహిత్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో 77వ ర్యాంకు సాధించారు. ఆయన ప్రస్తుతం రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో కూడా ఆయన గ్రూప్ -4 పరీక్ష రాసి జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా రోహిత్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షలపై ఆసక్తితో 2020 నుంచి ప్రిపేర్ అవుతున్నానని, 2022లో మరింత పట్టుదలతో చదివి ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ విజయం తన తల్లి ప్రేరణ ఉందని అన్నారు.

రాకేష్‌కు 78వ ర్యాంకు

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని బందన పెల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల నర్సయ్య - భాగ్య దంపతుల ఏకైక కుమారుడైన రాకేష్ గ్రూప్ -1 ఫలితాల్లో 78వ ర్యాంకు సాధించాడు. రాకేష్ స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే పదో తరగతి వరకు చదువుకున్నాడు. అనంతరం ఎస్సార్ కాలేజీలో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. గ్రూప్ -4 పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించి, కొన్ని నెలలుగా వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 78వ ర్యాంకు సాధించడంపై రాకేష్ కుటుంబం, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- ఏప్రిల్ రెండో వారం నుంచి సేకరణ
- ఒకే కేంద్రంలో సన్న, దొడ్డు రకాల కొనుగోళ్లు
- వెంటవెంటనే రూ. 500 బోనస్ చెల్లింపు

6

దేవాదుల ఫేస్-3 పైప్‌లైన్ లీకేజీ

- పైపులైన్ లీకేజీ సమీపాన నిలిచిన నీరు
- పంపింగ్ నిలిపివేసిన అధికారులు

రిజర్వాయర్ సమీపంలో పగుళ్లు



ధర్మసాగర్ రిజర్వాయర్ సమీపంలో ఫేస్-3 పైపులైన్ లీకేజీతో ప్రవహిస్తున్న నీళ్లు

ధర్మసాగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేస్-3 పైపులైన్ ఆదివారం లీకేజీ అయింది. ఈ నెల 27న భారీ నీటీ పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవన్నపేట పంప్‌హౌస్ మోటార్ ఆన్‌చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. ఆ తర్వాత మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు ధర్మసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించి నదీ జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. నీటిని విడుదల చేసి నాలుగు రోజులు గడవక ముందే ధర్మసాగర్ రిజర్వాయర్ వద్ద ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ సమీపాన ఫేస్-3 పైపులైన్‌కు రిజర్వాయర్ సమీపం నుంచి కొద్ది దూరం వరకు పగుళ్లు చూపింది. కొద్దిసేపటికే పైపులైన్ లీకేజీ అయింది. అయినప్పటికీ సుమారు అరగంట పాటు పంపింగ్ కొనసాగడంతో నీరు మొత్తం డంపింగ్‌యార్డు వరకు ప్రవహించింది. సమీపంలోని పంట పొలాల్లోకి నీళ్లు చేరాయి. దీంతో రిజర్వాయర్ సెక్యూరిటీ దేవన్నపేట పంప్‌హౌస్ ఇంజనీర్‌కు సమాచారం అందించడంతో ఇంజనీర్ వెంటనే పంపింగ్ నిలిపివేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 36.8 ఫీట్ల వరకు నీరు ఉంది. తాగునీటికి ఎలాంటి కొరత లేదు. ప్రస్తుతం మొదటి, రెండో ఫేస్ పైపులైన్ల ద్వారా రిజర్వాయర్‌లోకి నిరంతరంగా నీటి సరఫరా పైపులైన్ల ద్వారా కొనసాగుతోంది. కాగా, నాలుగు రోజుల కిందటే శాయిపేట్ గ్రామ సమీపాన రెండో ఫేస్ పైపులైన్ లీకేజీ అయిన విషయం విదితమే. వరుసగా పైపులైన్లు లీకేజీలు అవుతున్నా అధికారులు పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు వినపడుతున్నాయి.



శ్రీజ జాదవ్‌కు జ్ఞాపికను ఇస్తున్న ప్రొఫెసర్లు, అధికారులు

జాతీయ వికసిత్ భారత్ పోటీలకు శ్రీజ జాదవ్

కేయూ క్యాంపస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగానికి చెందిన శ్రీజ జాదవ్ జాతీయ వికసిత్ భారత్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యున్నత ప్రతిభ చూపి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌కు ఎంపికయ్యారు ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ లోని అనురాగ్ వర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయికి ఎంపికైనట్లు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీజ జాదవ్‌ను పలువురు అభినందించారు.

కొమ్మాల జాతరకు భక్తుల తాకిడి

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి దంపతులు



స్వామి వారికి మొక్కులు చెల్లించు కుంటున్న ఎమ్మెల్యే దొంతి దంపతులు

గీసుగొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరకు ఆదివారం భక్తుల పెద్దఎత్తున్న తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే జాతరకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో సాధారణ క్యూలైన్‌లతో పాటు ప్రత్యేక దర్శనాల క్యూలో భక్తులు రద్దీగా మారారు. గంటల తరబడి లైన్‌లలో నిలబడి భక్తులు ఉత్సవ మూర్తులను దర్శించుకొని తరించారు. కాగా, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి-శాలినిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికి సత్కరించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు సుభిక్షంగా చూడాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. ఆదివారం ఒక్కరోజే 15 వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. శ్రీరామ నవమి వరకు ఉత్సవమూర్తుల దర్శనాలు కొనసాగుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు కాందూరి రామాచార్యులు, విష్ణు, ఫణీంద్ర, నాయకులు వీరాటి లింగారెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగారపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్కుర్తి హవేలిలో గుట్కాలు పట్టివేత

వరంగల్ క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుగొండ మండల పరిధిలోని ఎల్కుర్తి హవేలిలో గుట్కాలను ఆదివారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఎల్కుర్తి హవేలిలోని కిరాణ వ్యాపారి కర్ణసాగర్ గుట్కాలు విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు సీఐ బాబులాల్ టీం సోదాలు చేసి రూ.72,100 విలువ చేసే గుట్కాలు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి



సాంబయ్య (ఫైల్)

చెన్నారావుపేట మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామ శివారు నెంబర్ - 2 కాలనీకి చెందిన అరకాల సాంబయ్య (35) విద్యుదాఘాతంతో ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సాంబయ్య రైసు మిల్లులో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సాంబయ్య ఉదయం స్నానం చేసి తన దుస్తులను దండెంపై ఆరవేస్తుండగా వైరుకు విద్యుత్ సర ఫరా అయి షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృ తి చెందాడు. ఉగాది పండుగ రోజున ఇంటి పెద్ద విద్యుదాఘాతంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించాయి. కాగా, మృతుడికి భార్య భవాని, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టానికి తరలించినట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- ఒక్కో కేంద్రానికి రూ. 2 లక్షల నిధులు
- ఉమ్మడి జిల్లాకు రూ.32 లక్షలు విడుదల
- పరికరాల కొనుగోలుకు ప్రత్యేక కమిటీలు

హనుమకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకవసరాల పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలీన విద్యా వనరుల కేంద్రాలను (భవిత) పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ముందు కొచ్చింది. ఈ కేంద్రాల్లో విద్యాబుద్ధులతో పాటు మాటలు నేర్పించడం, నడిపించడం, ప్రత్యేకంగా వారికి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ సేవలను అందించడం, వారి ఇళ్లకు వెళ్లి బోధిండం వంటి సేవలను అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 భవిత కేంద్రాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో 2, ములుగు జిల్లాలో 3, జనగామ జిల్లాలో 3, వరంగల్‌లో 2, మహబూబాబాద్ జిల్లాలో 3, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు మండలానికి ఒకటి చొప్పున ఇంక్లుజివ్ ఎడ్యుకేషన్ సెంటర్లు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో సుమారు వెయ్యి మందికిపైగా ప్రత్యేకావసరాల పిల్లలు ఇంక్లూజివ్ సేవలను పొందుతున్నారు. పాఠశాలల్లో కూడా ప్రత్యేక ఉపాధ్యాయులను గతేడాది డీఎస్సీ ద్వారా నియమించారు.

కాగా, తాజాగా సొంత భవనాలు కలిగి ఉన్న ఉమ్మడి జిల్లాలోని భవిత కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు పరికరాల కొనుగోలుకు సమగ్ర శిక్ష అభియాన్ కింద నిధులు మంజూరు అయ్యాయి. ఒక్కో భవిత కేంద్రానికి రూ.2లక్షల చొప్పున ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.34లక్షలు నిధులు విడదలయ్యాయి. గతంలో ఇన్ని నిధులు మంజూరయ్యేవి కావు. ప్రతీ సంవత్సరం రూ 50వేలకు మించి విడదలయ్యేది కావు. కానీ ఈ సారే రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలపై



హనుమకొండలోని భవిత కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో వాసంతి, ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా భవిత కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధన చేయడానికి కొత్తగా ఆరుగురు ఇంక్లూజివ్ రిసోర్స్ పర్సన్లను (ఐఆర్‌పీ) నియమించింది. దీనితో వీరి సంఖ్య పద్దెనిమిదికి పెరిగింది. అయితే ఐఆర్‌పీలకు ట్రావెలింగ్ అలవెన్స్ సౌకర్యం కలిగిస్తే వారు మరింత ఎక్కువ మంది ప్రత్యేకావసరాల పిల్లలకు సేవలు అందించేందుకు వీలు కలుగుతుంది.

కొనుగోళ్ల కమిటీలు

భవిత కేంద్రాల్లోని ప్రత్యేకావసరాల బాలలకు అవసరమైన సామగ్రి కొనుగోళ్లకు ఈ నిధులను వెచ్చించనున్నారు. సామానుల కొనుగోలుకు ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేశారు. ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, భవిత కేంద్రానికి అనుసంధానంగా ఉన్న ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈ కమిటీలో ఉంటారు. ప్రత్యేకావసరాల పిల్లలకు బోధనకు అవసరమైన పరికరాలు, విలీన విద్యాబోధకులకు కుర్చీలు, మసాజ్ బాల్, అల్మారాలు వంటి 115 రకాల సామాగ్రి సమకూర్చనున్నారు. చాలా రోజులుగా బోధనోపకరణాలు, ఇతర వస్తు సమాగ్రిని అందించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో అవి తొలగి పోయే అవకాశముంది.

భవిత కేంద్రాల్లో..

మానసిక, శారీరక వైకల్యం గల పిల్లలకు అర్థమయ్యే విధంగా బోధన చేపట్టేందుకు ఏర్పాటైన ఈ భవిత కేంద్రాల్లో 21 రకాల వైకల్యాలు కలిగిన పిల్లలకు విద్యతో పాటు సత్పహాగా ఎదిగేందుకు అవసరమైన సేవలనే అందిస్తారు. 5-15 ఏళ్లలోపు పిల్లలను అంశాలను వీఆర్‌పీలు నేర్పిస్తారు. వీరు ప్రత్యేక అవసరాల పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తూ బోధన చేపట్టడంతో పాటు కదలలేని బాలల ఇళ్లకు వెళ్లి బోధిస్తారు. కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలను అందిస్తారు.

21 నుంచి కేయూ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 21 నుంచి కేయూ వర్సిటీ దూరవిద్య కేంద్రం ఇయర్‌వైజ్ ప్రీవియస్ ఏడాది, ఫైనల్ ఇయర్ ఎక్స్ అభ్యర్థులకు సైకాలజీ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణా ధికారి రాజేందర్ కట్ల, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు షెడ్యూల్‌ను వెలువరించారు. మొదటి, రెండో ఏడాది అభ్యర్థులకు ఏప్రిల్ 21, 23, 25, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గగంటల వరకు ఫైనల్ ఇయర్ పరీక్షలు జరుగుతా యని తెలిపారు. ఏప్రిల్ 30, మే 1 తేదీల్లో ప్రాక్టికల్స్ పరీక్షలు 1, 2 బ్యాచ్‌ల వారిగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగతాయని వెల్లడించాయి. ఫైనల్ ఇయర్ పరీక్షలు 29, 30, మే 1, 2, 3, 5వ తేదీల్లో బ్యాచ్‌ల వారీగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

ఏప్రిల్ రెండో వారం నుంచి షురూ ›› ఒకే కేంద్రంలో సన్న, దొడ్డు రకాల కొనుగోళ్లు ›› వెంటనే రూ. 500 బోనస్ చెల్లింపు



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

హనుమకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత రబీ (యాసంగి) సీజన్‌లో రైతలు పండించిన ధాన్యంలో 1.60 లక్షల మెట్రిక్ టన్నులను పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారు. హనుమకొండ జిల్లాలో 2.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తంలో పౌరసరఫరాల సంస్థ వాస్తవంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది ప్రాథమిక నిర్ణయం. సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకొని 1.60 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గకుండా కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. గత యాసంగి సీజన్ కన్నా ఈ సారి 20వేల మెట్రిక్ టన్నులను ఎక్కువగా కొనుగోలు చేయనున్నారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ధాన్యం కొనుగోలుకు ఈసారి జిల్లాలో 146 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇందులో 44 ఐకేపీ కేంద్రాలు కాగా, మిగతావి పీఏసీఎస్, డ్వాక్రా మహిళ సంఘాల కేంద్రాలు. గత యాసంగి సీజన్‌లో కూడా దాదాపు ఇన్నే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో ఒక పక్క సన్నరకం, మరో పక్క దొడ్డురకం ధాన్యాలను కొనుగోలు చేస్తారు. రెండు చోట్ల తూకాలు ఏకకాలంలో జరుగుతాయి. కొనుగోలు చేసిన ఈ రెండు రకాల ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించడానికి అవసరమైన రవాణా వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కూడా ప్రాథమికంగా ఒక కార్యప్రణాళికను రూపొందించారు.

రూ. 500 బోనస్

గత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్న రకం వడ్లు ప్రభుత్వం కొనుగోలు చేసి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించింది. జిల్లాలో 90 శాతం మంది రైతులకు ఈ బోనస్ అందింది. మిగతావారికి వారం రోజుల్లో చెల్లింపులు జరుగనున్నాయి. జిల్లాలో మరో 15 రోజుల్లో వరికోతలు మొదలై ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ సారి రబీలో సన్నరకం ధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

2.97 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం రబీ సీజన్‌లో హనుమకొండ జిల్లాలో 1.19 లక్షల హెక్టార్లలో వరి పంట సాగులో ఉంది. ఇందులో 23,800 ఎకరాల్లో సన్నరకం వడ్లు, 95,200 ఎకరాల్లో దొడ్డు రకం సాగు చేస్తున్నారు. సన్న రకం ధాన్యానికి రూ.500చొప్పున బోనస్ ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దృష్ట్యా గత రబీలో కన్నా సన్నరకం సాగు 10 శాతం పెరిగినట్టు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ రబీ సీజన్‌లో 2,97,500 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ మొత్తంలో సన్నరకం ధాన్యం 59,500 మెట్రిక్ టన్నులు, దొడ్డురకం 2,38,000 మెట్రిక్ టన్నుల మేరకు దిగుబడి కావచ్చునని భావిస్తున్నారు. బహిరంగ మార్కెట్, రైతుల సొంత అవసరాలకు పోను 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయాలని నిర్ణయించినప్పటికీ సాధ్యాసాధ్యాలను బట్టి 1.60 మెట్రిక్ టన్నుల సేకరణను లక్ష్యంగా నిర్ణయించింది.

ఏప్రిల్ రెండో వారం నుంచి..

ఏప్రిల్ రెండోవారం నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్నది. కొనుగోలు కేంద్రాలకు కావల్సిన టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, డ్రయర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం పరీక్షించే తూర్పార యంత్రాలు సహా అవసరమైన పరికరాలు సమకూర్చుకోనున్నారు. ధాన్యం కొనుగోలు జూన్ 15వ తేదీ వరకు కొనసాగనున్నది. మే చివరి వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుస్తు ఏర్పాట్లు కూడా ఇప్పటి నుంచే చేయనున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై సమీక్షించడానికి కలెక్టర్ త్వరలోనే పౌరసరఫరాలు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రణాళికకు తుది రూపం ఇవ్వనున్నారు.

సమస్యల వలయంలో గ్రంథాలయం

- రీడింగ్ హాల్ లేక విద్యార్థుల ఇబ్బందులు
- నిధులు లేక వదిలేసిన నూతన భవనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నూతన గ్రంథాలయ భవనం

హనుమకొండ టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా గ్రంథాలయం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఏళ్ల తరబడి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రంథాలయంలో సమస్యలు తిష్ట వేస్తున్నాయని గ్రంథాలయ నిర్వాహకులు, విద్యార్థులు పేర్కొంటున్నారు. జిల్లాలోని వందల సంఖ్యలో నిరుద్యోగులు, విద్యార్థులు రోజుకు సుమారు 500 నుంచి 1000 మంది వరకు వివిధ పోటీ పరీక్షల కోసం గ్రంథాలయానికి వస్తుంటారు. సరైన సౌకర్యాలు లేక రీడింగ్ హాల్ సరిపోక చెట్ల కింద, రోడ్లపై నిలబడి చదువుకొనే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

2021లో నూతన భవనం పనులు ప్రారంభం

2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రంథాలయంలో నూతన భవన నిర్మాణానికి రూ.80లక్షల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. ఈ నూతన భవనంలో ఆడిటోరియంతో పాటు రీడింగ్‌హాల్, సమావేశాల కోసం ప్రత్యేక గదుల నిర్మాణం చేపట్టారు. అనంతరం అప్పటి కాంట్రాక్టర్ నిధులు చాలడం లేదని పనులు మధ్యలోనే వదిలేశారు. మరో రూ.13 లక్షల 70వేల వరకు పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కావడంలేదని వాపోతున్నారు.

రీడింగ్ హాల్ లేక ఇబ్బందులు

గ్రంథాలయంలో వందల సంఖ్యలో వస్తున్న నిరుద్యోగులు, విద్యార్థులకు కేటాయించిన రీడింగ్ హాల్‌లోనే న్యూస్ పేపర్ సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వందలాదిమంది బాటసారులు రీడింగ్ హాల్‌లోకి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి ఇబ్బందులు కలుగుతున్నట్లు వాపోతున్నారు.

పోటీ పరీక్షలకు పుస్తకాలు లేవు

గ్రంథాలయంలో ఎంతో మంది నిరుపేదలు వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే గ్రంథాలయంలో ఉన్న రీడింగ్ బుక్స్ సరిపోవడం లేదని వాపోతున్నారు. కొత్త బుక్స్ లేక పాత వాటినే అందిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని రకాల బుక్స్ గ్రంథాలయంలో ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

అనేక సమస్యలతో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి సమస్యతో పాటు మరుగుదొడ్లు, రీడింగ్ హాల్, అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులోకి తీసుకు రావాలని, నూతన భవనానికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో మంది పేద విద్యార్థులకు గ్రంథాలయం భరోసాగా ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలని కోరుతున్నారు.



హనుమకొండలోని గ్రంథాలయం

పండుగపూట విషాదం

- చెట్టును ఢీకొన్న బైక్
- ఇద్దరు యువకుల మృతి



దిలీప్, క్రాంతికుమార్ మృతదేహాలు

చిలుపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పండు గపూట విషాదం నెలకొం ది. బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమా దంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ విషాదకరఘటన ఆదివారం రాత్రి జనగా మ జిల్లా చిలుపూర్ మండలం చిన్నపెండ్యాలలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండ లంలోని తాటికాయలకు చెందిన ఎర్ర దిలీప్ (25), జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెం దిన స్నేహితుడు చింత క్రాంతికుమార్ (24) తో కలిసి బైక్‌పై తాటి కాయల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు వెళ్తున్నారు. చిన్నపెండ్యాల సమీ పంలో మసీదు ఎదురుగా ఉన్న మలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారమం దుకున్న ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ మేరకు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆదాయ పన్ను లెక్కల్లో గోల్‌మాల్

- ఇంటి అద్దె అక్షరాల రూ. 52 వేలంట..!
- భార్యాభర్తలిద్దరు ఇంటి అద్దె చెల్లిస్తున్నట్లు దాఖలు
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- ముడుపులతో ఆడిట్ మరిచిన ఖజానా శాఖ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు సమర్పిస్తున్న ఆదాయపు పన్నుల లెక్కల్లో అనేక గోల్‌మాల్ చిత్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. యేటా ఫిబ్రవరిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి వేతనాలకు సంబంధించిన ఆదాయపు పన్ను లెక్కలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే ట్రెజరీ శాఖ ఉద్యోగులు మడుపులకు అలవాటుపడి ఉద్యోగ, ఉపాధ్యాయులు సమర్పించిన ఆదాయ, వ్యయాలకు సంబంధించిన లెక్కలను ఆడిట్ చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారు సమర్పిస్తున్న ఆదాయపు పన్ను లెక్కల్లో అనేక చిత్రాలు చోటు చేసుకోవడంతోపాటు వారు సమర్పిస్తున్న గోల్‌మాల్ లెక్కలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతున్నట్లు స్పష్టమవుతోంది.

తప్పుడు పత్రాలు సృష్టి

కొంతమంది ఉపాధ్యాయ, ఉద్యోగులు తప్పుడు పత్రాలు, రశీదులు సృష్టిస్తూ ఆదాయపు పన్ను దాఖలులో తప్పులు లెక్కలు చూపిస్తూ గోల్‌మాల్ చేస్తున్నట్లు ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలే చెబుతున్నాయి. కొంత మంది ఉపాధ్యాయ ఉద్యోగులు హౌసింగ్ లోన్ తీసుకోకున్నా తప్పుడు పత్రాలు సృష్టిస్తూ ఆదాయపు పన్ను నుంచి మినహాయిపు పొందుతున్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో రూ.15వేల కంటే ఇంటి అద్దె ఎక్కువగా లేదు. అయితే కొంత మంది మాత్రం ఇంటి అద్దెలు రూ.40 వేల నుంచి రూ.50 వేలు చెల్లిస్తున్నట్లు చూపిస్తున్నారు. కొంతమంది ఉద్యోగులు తల్లిదండ్రులకు బీమా పాలసీలు కట్టకుండానే కడుతున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టిస్తూ తప్పుడు ఆదాయపు పన్ను లెక్కలు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొంత మంది డొనేషన్లు ఇస్తున్నట్లు నకిలీ రశీదులు పొందు పరుస్తూ ఆదాయపు పన్ను వినహాయింపు పొందుతూ తప్పుడు లెక్కలు చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి

ఉపాధ్యాయ, ఉద్యోగులు సమర్పిస్తున్న ఆదాయపు పన్ను లెక్కల్లో తప్పులను ఆడిట్ చేసి గుర్తించాల్సిన బాధ్యత ట్రెజరీ శాఖది. అయితే ట్రెజరీలో కొంతమంది ఉద్యోగులు, అధికారులు మామూళ్లకు అలవాటు పడుతుండటంతో ఉపాధ్యాయ, ఉద్యోగులు సమర్పిస్తున్న గోల్‌మాల్ లెక్కలను చూడకుండా కళ్లు మూసుకుంటున్నట్లు తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదాయపు పన్ను లెక్కలు వారి సెల్ఫ్ డిక్లరేషన్‌తో ఇస్తున్నారనే సాకుతో ట్రెజరీశాఖ ఉద్యోగులు ఆడిట్ చేయకుండా



వదిలేస్తున్నారు. అయితే ఒక్కో స్కూల్, కాలేజీ, కార్యాలయం నుంచి ఆయా సిబ్బంది సంఖ్యను బట్టి ట్రెజరీ అధికారులు ముడుపులు స్వీకరిస్తున్నట్లు బాహాటంగానే ప్రచారం ఉంది. కాగా, అధికారులు దృష్టి సారిస్తే ఆదాయపు పన్ను లెక్కల దాఖలులో జరుగుతున్న గోల్‌మాళ్లు బయటకు వస్తాయనే అభిప్రాయాలను కొంతమంది ఉపాధ్యాయ, ఉద్యోగులే వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా ట్రెజరీ కార్యాలయంపై దృష్టి సారిస్తే అక్కడ జరిగే అవినీతి తతంగమంతా బయటకు వస్తుందనే అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు.

లెక్కలు ఇవే..

- ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వరంగల్ పట్టణంలో రూ.42వేల ఇంటి అద్దె చెల్లిస్తున్నట్లు లెక్కలు చూపించారు.
- హనుమకొండలో సొంత ఇంటిలో ఉంటూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇద్దరు భార్యాభర్తలు తాము వేర్వేరుగా ఇంటి అద్దె చెల్లిస్తున్నట్లు లెక్కలు చూపించారు.
- హనుమకొండలో నివాసం ఉంటున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి తాను హెచ్ఆర్‌ఏ తీసుకుంటూ తప్పుడు లెక్కలు చూపించారు.
- హనుమకొండలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయురాలు తన పిల్లల చదువులు పూర్తి చేసి ఉద్యోగం చేస్తుంటే వారు ఇంకా చదువుకుంటున్నట్లు తప్పుడు ఫీజు రశీదులు సృష్టించి తప్పుడు లెక్కలు చూపించారు.

స్వయం ఉపాధిలో ఉషారాణి

- సొంత ఆలోచనతో కుటీర పరిశ్రమ ఏర్పాటు
- భర్త సహకారంతో ప్లాస్టిక్ వినియోగంపై యుద్ధం
- ఓ వైపు పర్యావరణ పరిరక్షణ.. మరోవైపు పది మందికి ఉపాధి
- జ్యూట్, కాటన్ బ్యాగ్ తయారీతో గుర్తింపు
- ఆన్‌లైన్ ఆర్డర్లపై బ్యాగులపై శుభపత్రికల ముద్రణ


జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన సంచులు, పూలకుండీ కవర్లు, శుభపత్రిక

హసన్‌పర్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారు. చదువుకు తగిన ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో డీలా పడిపోతున్నారు. ఈ క్రమంలో ఏ మాత్రం ధైర్యాన్ని కోల్పోకుండా స్వయం ఉపాధిని నమ్ముకుంటున్న వారు కొందరే ఉంటున్నారు. అలాంటి వారలో ఉషారాణి ఒకరు. తన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంతో పాటు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తే పది మందికి ఉపాధి కూడా కల్పించవచ్చని నిరూపించారు పసునూరి ఉషారాణి. తన భర్త రమేష్ సహకారంతో పర్యావరణ ఓ వైపు ప్లాస్టిక్ నిషేధం కోసం పోరాడుతూనే.. జ్యూట్, కాటన్ వస్తువుల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాయపర్తి మండల కేంద్రానికి చెందిన పసునూరి ఉషారాణి, రమేష్ దంపతులు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నారు. 2017లో వివాహం కాగా.. భర్త ప్రోత్సాహంతో ఎంపీబీఈడీ పూర్తి చేశారు. ఇక భర్త రమేష్ కూడా ఎంఎస్సీ బీఈడీ పూర్తి చేశారు. వివాహానికి ముందే రమేష్ 2007లో బతుకుదెరువు కోసం హనుమకొండలో పలు కోచింగ్ సెంటర్లలో పనిచేశారు. కొంతకాలానికి సొంతంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయగా.. నష్టాలు వచ్చాయి. అయినా నిరాశకు గురికాకుండా తన భార్యతో ఒక కుటీర పరిశ్రమ ప్రారంభింపజేయాలని నిర్ణయించుకున్నారు.



ప్రభుత్వం సహకరించాలి
పి. ఉషారాణి, నిర్వాహకురాలు

నా భర్త సహకారంతోనే ఏడు సంవత్సరాలుగా జ్యూట్, కాటన్ వస్తువుల కుటీర పరిశ్రమను నిర్వహిస్తున్నా. పది మందికి ఉపాధి అవకాశం కల్పిస్తున్నా. మార్కెట్‌లో ఈ వస్తువులకు ఆదరణ పెరుగుతోంది. పర్యావరణహిత జ్యూట్, కాటన్ వస్తువులను రాష్ట్ర వ్యాప్తంగా పరిచయం చేసేందుకు ప్రతీ జిల్లా కేంద్రంలో ఒక ఉచిత స్టాల్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలి. సమాజహితం కోసం పనిచేసే వారికి ప్రభుత్వ చేయూత లేకపోవడంతో కుటీర పరిశ్రమలు వృద్ధి చెందడం లేదు.

అదికూడా పర్యావరణహితమైన జ్యూట్, కాటన్ బ్యాగుల తయారీ కేంద్రమైతే బాగుంటుందని ఆలోచనకు వచ్చారు. అనుకున్నదే తడువుగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టులో తాము నిర్మించుకున్న ఇంటి డాబాపై ఒక రేకుల షెడ్డు ఏర్పాటు చేసి 2017 జనవరి 1న కాటన్, జ్యూట్ బ్యాగ్ తయారీ పరిశ్రమను ప్రారంభించారు. ఈ క్రమంలో జ్యూట్, కాటన్ బ్యాగులకు గిరాకీ పెరగ్గా.. ఉషారాణి తన చుట్టు పక్కన ఉన్న మహిళలను కూడగట్టి వారికి శిక్షణ నిచ్చారు. వారికి శిక్షణ ఇస్తూనే నెలనెలా వేతనం ఇచ్చి ఉపాధి రంగంవైపు మళ్లించారు. తొలుత ఐదుగురితో ప్రారంభమైన ఆ కుటీర పరిశ్రమలో ప్రస్తుతం 12మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

జ్యూట్ బ్యాగులపై పెళ్లి పత్రికలు

వివాహ వేడుకలను వీలైనంత వినూత్నంగా జరుపుకోవాలన్న భావన అందరిలో కలుగుతుంది. అందులో మరీ ముఖ్యంగా పెళ్లి పత్రికల డిజైన్ల విషయంలో కొందరు ఎంత ఖర్చుకైనా వెనకడుగువేయరు. మరికొందరు పర్యావరణహితమైన పెళ్లిపత్రికల డిజైన్లకు ప్రాధాన్యమిస్తారు. దీంతో ఉషారాణి రమేష్ దంపతులు ఎస్ఎన్ జ్యూట్, కాటన్ బ్యాగ్ పెళ్లి పత్రికలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడి నుంచే సమాజంలో నూతన ఒరవడికి నాంది పలికారు. జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన పెళ్లి పత్రికలు మార్కెట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పత్రికలు వృథా కాకుండా వాటిని తమ నైపుణ్యంతో ఇతర వాడకానికి ఉపయోగించేలా రూపకల్పన చేసి.. జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన పెళ్లి పత్రికలను బంధువులకు పంచేలా సమాజానికి పరిచయం చేశారు. వాటిని కూడా ఆకర్షనీయంగా వివిధ రకాల మోడళ్లలో తయారు చేయడం వీరి ప్రత్యేకత. ఇక మమప్లాస్టిక్ నిషేధంపై యుద్ధం ప్రకటిస్తూనే పర్యావరణ హితమైన వివిధ రకాల జ్యూట్, కాటన్ బ్యాగుల తయారీ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. లంచ్, ల్యాప్‌టాప్, స్కూల్, హ్యాండ్, ట్రావెల్ బ్యాగులు, ఫ్రిడ్జ్ షీట్స్, వాల్ కవర్లు, ఫైల్స్, పౌచెస్ లాంటి వివిధ వస్తువులు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లోకి తెస్తున్నారు.

జ్యూట్, కాటన్ వస్తు ప్రదర్శనకు వినియోగం
పసునూరి రమేష్



ఎస్ఎన్ జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన వస్తువులను మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా, వ్యాపార సంస్థలు తమ ప్రదర్శనకు వినియోగించడం చాలా సంతోషంగా ఉంది. శుభకార్యానికి అవసరమైన వారు మా సంస్థ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ కానీ తమకు ఫోన్ చేసి ఆర్డర్ చేస్తే వారికి కావాల్సిన డిజైన్లలో సంచులను తయారు చేసి అందిస్తాం. ప్రభుత్వం పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి పూర్తి తోడ్పాటునందిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

ఆన్‌లైన్ సేవలు

కాటన్, జ్యూట్ వస్తువుల తయారీలో ఉషారాణికి కొత్త ఆలోచన వచ్చింది. ఆమె నైపుణ్యంతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను తన భర్త రమేష్ సహకారంతో ఆన్‌లైన్ ఎస్ఎన్ జ్యూట్, కాటన్ ద్వారా తయారు చేసిన వస్తువులను పరిచయం చేశారు. ఆన్‌లైన్ ఆర్డర్లపైనే వీరికి గిరాకీ పెరిగింది. నిట్, బాలవికాస, యూనివర్సిటీలు, మెడికల్ మెట్రో, కెనాడా, కాడాయి, లేపాక్షి నుంచి వీరికి ఆర్డర్లు వచ్చాయి. అంతేకాకుండా ఈ సంస్థలతో పాటు స్థానికంగా పెళ్లిళ్లకు, ఇతర శుభకార్యాలకు, సెమినార్‌లకు, స్వచ్ఛంద సంస్థలకు గిఫ్ట్ ప్యాక్‌ల ఆర్డర్లు వస్తుండటంతో వారికి కావాల్సిన డిజైన్‌లలో వారికి నచ్చిన పేర్లతో ప్రింట్ చేసి విక్రయిస్తున్నారు. ఈ బ్యాగుల తయారీకి కావాల్సిన ముడి సరుకు ఏలూరు, హైదరాబాద్ నుంచి కొనుగోలు చేస్తారు. 20రకాల రంగుల జ్యూట్, కాటన్‌ను దిగుమతి చేసుకుంటారు.


తయారు చేసిన జ్యూట్ బ్యాగులను చూపిస్తున్న నిర్వాహకురాలు, ఉద్యోగులు (ఎడమ నుంచి)

కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు
ఆకుబత్తిని రమ, ఉద్యోగి



జ్యూట్, కాటన్ వస్తువుల తయారీని ఇక్కడే నేర్చుకున్న, ఇప్పుడు ఇక్కడే ఉద్యోగిగా పనిచేస్తున్నా. నాకు నెలకు రూ.5వేలు వస్తున్నాయి. ఇది మా కుటుంబానికి ఆర్థిక ఆదుకుంటుంది.

ఉపాధి పొందుతున్నాం..
జి. శబరి, కుటీర పరిశ్రమ ఉద్యోగి



మార్కెటింగ్ చేస్తా. జ్యూట్, కాటన్ సంచుల తయారీతో తమకు ఉపాధి. మేం తయారు చేసిన వివిధ రకాల డిజైన్ల సంచులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఇప్పుడు వివిధ రకాల శుభకార్యాలకు కూడా ఆర్డర్ ఇస్తున్నారు. నెలకు రూ.9 వేల జీతం సంపాదిస్తున్నా.

ఆమ్‌పై ఆశలు

- మామిడి దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం సమకూరేనా ?
- మామిడి తోటల్లో చెట్లకు విరగబూసిన పూత, కాత
- గాలిదుమారాలు రాకుంటే మామిడి రైతులకు లాభాలు

నర్సంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో పూత పెరిగి కాతదశకు చేరుకోవడంతో రైతుల్లో మాడిగి దిగుబడిపై ఆశలు చిగురిస్తున్నాయి. అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో రెండు, మూడేళ్లుగా మామిడి తోటల్లో పూత, కాత లేదు. కాసిన కొద్దిపాటి మామిడి కాయలు కూడా గాలి దుమారాలకు నేలరాలి నష్టాల పాలయ్యారు. ఈ క్రమంలో ఈ ఏడాది కాలం కలిసి వచ్చి మంచి రోజులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. తోటల్లోని చెట్లకంటే ఇండ్లలో ప్రజలు పెంచుకున్న మామిడి చెట్లకు కాయలు అధికంగా కాశాయి. నీటి వసతి ఎక్కువగా ఉండడం వల్లే ఇండ్లలోని చెట్లకు కాత ఎక్కుగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో వివిధ రకాల పండ్లు లభిస్తున్నా మామిడి ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రతీ ఏటా వేసవికాలంలో మామిడి కాయలు, పండ్లు దిగుబడి వచ్చి మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా సీజన్ కంటే ముందే మామిడి తోటలు పూతదశకు చేరుకున్నాయి. కొన్ని తోటలు పూతదశలో ఉండగా, మరికొన్ని తోటలు పిందె దశలో, ఇంకొన్ని తోటల్లో మామిడి కాయలు విరగ కాశాయి. మూడేళ్లగా కోల్పోయిన ఆదాయం ఈ ఏడాది చేకూరుతుందన్న ఆశలు మామిడి రైతుల్లో చిగురిస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నెలలోనే మామిడి తోటలు పూత దశకు చేరుకున్నాయి. ఏ గ్రామంలో చూసినా మామిడి తోటల్లో పూత కాత కనిపిస్తుంది. ఏప్రిల్, మే నెల వరకు మామిడి చెట్లకున్న పిందెలు కాయలుగా మారి దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. కొన్ని తోటల్లో మామిడి కాయలు బాగా కాయగా మరికొన్ని తోటల్లో పలుచగా కాయలు కాశాయంటున్నారు. తోటల్లో ఎదిగిన కాయలను కోసి మార్కెట్‌లో రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. ఉగాది పండగ రోజు తయారు చేసే ఉగాది పచ్చడికి ప్రజలకు మామిడి కాయలు అందుబాటులోకి వచ్చాయి. ఇంకా రెండు నెలలో పిందెలు కాయలుగా మారి దిగుబడి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.


నర్సంపేట శివారు లక్నేపల్లిలో మామిడి తోట

గాలి దుమారాలు రాకుంటే ఆదాయం

ప్రతీ ఏటా మామిడి తోటలు పూత దశకు చేరుకున్న సమయంలో గాలి దుమారాలతో కూడిన వర్షాలు పడడంతో తోటల్లోని చెట్లకున్న పూత రాలి రైతులు నష్టాల పాలయ్యేవారు. గత ఏడాది నూటికి 75 శాతం తోటల్లో పూత, కాత లేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది గాలి దుమాలు లేకుంటే పూత, కాసిన కాయలు నేలపాలు కాకుండా ఉంటే రైతులకు ఆదాయం చేకూరుతుంది.

మామిడి దిగుబడిపై ఆశలు

ఈ ఏడాది మామిడి తోటల్లోని చెట్లకు విపరీతంగా పూతపూసి పిందె, కాయ దశకు చేరడంతో తోటలపై ఆధారపడిన రైతులు దిగుబడిపై ఆశలు పెంచుకున్నారు. మూడేళ్లుగా మామిడి రైతులు నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురియడం, చెట్లకు పూత బాగా పూసి కాత దశకు రావడంతో దిగుబడి పెరుగుతుందని ఆశిస్తున్నారు. గాలిదుమారాలు రాకుంటే ఎకరం మామిడి తోటల ద్వారా 10 నుంచి 20 టన్నుల మామిడి కాయల దిగుబడి వస్తుంది. దిగుబడి ఆశించిన మేరకు వస్తే ఎకరంలోని మామిడి తోటల ద్వారా పెట్టుబడులు పోను రూ.లక్ష నుంచి రూ.2లక్షల ఆదాయం సమకూరుతుందని

వరంగల్ జిల్లాలో మామిడి సాగు

వరంగల్ జిల్లాలో 5,960 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఇందులో నర్సంపేట డివిజన్‌లోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ, చెన్నారావుపేటలో 360 ఎకరాలు, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, ఖిలావరంగల్, సంగెం, గీసుగొండ, వరంగల్ మండలాల్లో 5,600 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి.

ఈ ఏడాది అందరికీ మంచి జరగాలి

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


ఎడ్లబండిపై పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి సురేఖ

ఖిలా వరంగల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ అన్నారు. విశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా తూర్పుకోటలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని మంత్రి సందర్శించారు. తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని తల్లిని వేడుకున్నానన్నారు. అంతకుముందు మంత్రి ఎడ్లబండిపై పెద్దమ్మతల్లి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ముదిరాజ్‌లు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి పెద్దమ్మతల్లికి సమర్పించారు. అంతేగాకుండా ఖిలావరంగల్, స్థంభంపెల్లి, వంచనగిరి, దూపకుంట, తదితర గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండ్లతో ఊరేగింపుగా వచ్చారు. ఈ కార్యక్రమంలో 37,38 డివిజన్ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమా- దామోదర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కత్తెరశాల వేణు, ఏనుమాముల మార్కెట్ చైర్మన్ బండి జనార్దన్, డైరెక్టర్లు గజ్జెల శ్యామ్, గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, అర్చకులు హంస వెంకన్న, కుమార్, శ్రీను, శివ, రాజు, నాగరాజు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి..

వరంగల్ కల్చరల్: భద్రకాళి అమ్మవారిని మంత్రి కొండా సురేఖ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు అర్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. మంత్రి వెంట కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చాంద్ నజర్ ఆగయా..


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నమాజ్‌కు సిద్ధం చేసిన ఈద్గా మైదానం

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఈ విషయాన్ని ధృవీకరిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లిం పెద్దలు మస్జీద్‌లలో సైరన్ మోగించి పండుగకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పండుగలు తెస్తున్న అనుభూతులు

పోటీ ప్రపంచంలో ఒకరినొకరు మనస్ఫూర్తిగా పలకరించుకోవడానికి సమయమే చిక్కడం లేదు. దీనికి తోడు కుటుంబాలతో కలిసి మెలిసి ఆనందంగా ప్రేమానుబంధాలను పంచుకునే రోజులు కరువవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సంప్రదాయంగా వస్తున్న పండుగలు ఎంతో కొంత వెసులుబాటుతో అనుభూతులు, ఆనందం, ఆహ్లాదం, అనుభవాలను పంచుకునేలా చేస్తున్నాయి. ఈ కోవలోనే వచ్చిన రంజాన్ పర్వదినం ఈద్-ఉల్-ఫితర్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. రంజాన్ నెల మొత్తం నియమనిష్టలతో ఉపవాస వ్రతం పాటిస్తూ రోజూ ఐదుసార్లు దైవారాధన (నమాజ్) చేశారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు.

పండుగ నాడు గుసుల్ స్నానంతో..

పండుగనాడు ముస్లింలందరూ వేకువజామునే లేచి ఫజర్ నమాజ్‌కు వెళ్లి వస్తారు. ఆపై గుసుల్ స్నానం ఆచరించి, పరిశుభ్రమైన వస్త్రాలు ధరిస్తారు. సుగంధ ద్రవ్యాలు పూసుకుంటారు. పండుగ సందర్భంగా ఇంట్లో తయారు చేసిన సేవియా పాయసాన్ని స్వీకరిస్తారు. పండుగకు ముందే ఫిత్రాదానం చెల్లించినప్పటికీ పండుగ రోజు కూడా పేదలకు దానధర్మాలు చేస్తారు. అందరూ సామూహికంగా తక్బీర్ పఠిస్తూ ఈద్గా మైదానాలకు చేరుకుంటారు. ఆపై ముస్లింల పెద్దను అనుసరిస్తూ నమాజ్ పూర్తి చేసుకుంటారు. ఈద్గా మైదానానికి ఒకదారి వెంట వెళ్లి మరో దారి వెంట ఇంటికి చేరుకుంటారు. తర్వాత ఖబరస్తాన్‌లకు వెళ్లి పూర్వీకుల సమాధులపై పుష్పాలు ఉంచి నివాళులర్పిస్తారు. పండుగకు తయారు చేసిన సేమ్యా, షీర్ ఖుర్మా లాంటి వంటకాలను స్నేహితులు, బంధువులకు ఆప్యాయంగా తినిపిస్తారు.

చిన్నారులకు 'ఈదీ'

రంజాన్ పండుగ రోజున చిన్నారులకు 'ఈదీ' పేరిట ఎంతో కొంత నగదు సంతోషంగా ఇవ్వడం ఒక సంప్రదాయం. ఇది పిల్లలకు పెద్దలు ఇచ్చే విశిష్ట బహుమానం అన్నమాట. ఇందుకోసం చిన్నారులు పెద్దలను గౌరవిస్తూ... వారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అలా లభించిన సొమ్ముతో తమకిష్టమైన వస్తువుల్ని పెద్దల ప్రమేయం లేకుండా కొనుగోలు చేస్తారు. మరికొందరు దానాలు కూడా చేస్తారు.

జనరల్ టికెట్ చాలా సులభం

- డిజిటల్ చెల్లింపులతో క్షణాల్లో పొందవచ్చు
- అందుబాటులో ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్
- యూటీఎస్ యాప్ ద్వారా కూడా తీసుకోవచ్చు


కౌంటర్ వద్ద టికెట్‌లు తీసుకుంటున్న ప్రయాణికులు

గిర్మాజిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణానికి జనరల్ టికెట్ తీసుకోవాలంటే ఇదివరకు అష్టకష్టాలు పడాల్సివచ్చేది. గంట ముందుగా స్టేషన్‌కు వెళ్లడం.. చాంతాడంత క్యూలైన్‌లో నిలబడటం... టికెట్ కోసం చిల్లర డబ్బులు ఇవ్వడం.. ఇదంతా పెద్ద టాస్క్. కానీ ఇపుడు పద్ధతి మారింది. జస్ట్ స్మార్ట్ ఫోన్.. మన బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులుంటే చాలు. ప్రయాణికుడు టికెట్ కౌంటర్‌కు వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వారా పేమెంట్ చేసి కౌంటర్‌లో టికెట్ పొందవచ్చు. కౌంటర్‌కు వెళ్లడం ఎందుకు టైమ్ దండగ అనుకుంటే.. ఆటోమెటెడ్ టికెట్ వెండింగ్ మిషన్(ఏటీవీఎం) దగ్గరకు వెళ్లి యూటీఎస్ యాప్ ద్వారా డబ్బులు చెల్లించి టికెట్ పొందవచ్చు.. ఏటీవీఎం ఆపరేటింగ్ తెలియదు అనుకుంటే అక్కడే ఉండే రైల్వే సిబ్బంది సహకారం తీసుకోవచ్చు. లేదూ.. డిజిటల్ చెల్లింపులు మాకు తెలియదు అనుకుంటే నగదు చెల్లించి కూడా జనరల్ టికెట్ తీసుకొని రైలు ప్రయాణం చేయవచ్చు. ఈ సదుపాయం ప్రస్తుతం అన్ని పెద్ద రైల్వే స్టేషన్‌లలో అందుబాటులో ఉంది.

క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ కొనుగోలు

వరంగల్ రైల్వేస్టేషన్‌లో 5 జనరల్ టికెట్ కౌంటర్లున్నాయి. ఇక్కడ నగదు చెల్లించి కూడా టికెట్ కొనుగోలు చేయవచ్చు. డిజిటల్ చెల్లింపుల ద్వారా టికెట్ తీసుకోవాలనుకుంటే కౌంటర్‌కు వెళ్లి మనం వెళ్లాల్సిన రైల్వేస్టేషన్ పేరు, కావాల్సిన టికెట్‌లను సిబ్బందికి చెప్పగానే వారు టికెట్ జనరేట్ చేస్తారు. పేమెంట్ కోసం కౌంటర్‌లోని రైల్వే క్యూఆర్ కోడ్‌కు ప్రయాణికుడు తన స్మార్ట్ ఫోన్‌లోని గూగుల్, ఫోన్ పే, యూపీఏ ద్వారా గాని డబ్బులు చెల్లించగానే సిస్టమ్ నుంచి టికెట్ వస్తుంది. అంతే కాకుండా క్యూ ఆర్ కోడ్ స్కాన్‌కు బదులుగా మొబైల్ నెంబర్ ద్వారా కూడా డబ్బులు చెల్లించవచ్చు. వెళ్లాల్సిన రైల్వేస్టేషన్, కావాల్సిన టికెట్‌లతో పాటుగా మొబైల్ నెంబర్‌ను కౌంటర్‌లోని సిబ్బందికి చెప్పగానే ప్రయాణికుడి దగ్గర ఉన్న స్మార్ట్‌ఫోన్‌కు పేమెంట్ లింక్ వస్తుంది. డబ్బులు చెల్లించగానే కౌంటర్‌లోని సిబ్బంది టికెట్ ప్రింట్ తీసి ఇస్తారు. ఇదంతా కూడా టికెట్ కౌంటర్ బయట ఉన్న పెద్ద తెరపై మనకు కనిపిస్తుంది.

యూటీఎస్ యాప్ ద్వారా..

రైల్వేశాఖ యూటీఎస్ (అన్ రిజర్వ్‌డ్ టికెట్ సిస్టం)యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా జనరల్ టికెట్ పొందవచ్చు. అండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్ నుంచి, ఐఫోన్ వినియోగదారులు యాప్ స్టోర్, విండోస్ ఫోన్ వినియోగదారులు విండోస్ యాప్ స్టోర్‌ల నుంచి రైల్వే యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత యాప్ ఓపెన్ చేసి మొబైల్ నెంబర్, పేరు, పాస్‌వర్డు, పుట్టిన తేదీ నమోదు చేస్తే మొబైల్‌కు వన్‌టైంపాస్‌వర్డు (ఓటీపీ) వస్తుంది. దాన్ని నమోదు చేయడం ద్వారా రైల్వే యూటీఎస్ యాప్ మన మొబైల్‌లో అందుబాటులోకి వస్తుంది. మొబైల్ నెంబర్, పాస్‌వర్డుతో రైల్వే యూటీఎస్ అకౌంట్‌లోకి లాగిన్ కాగానే యూటీఎస్ అన్ రిజర్వ్‌డ్ (యూటీఎస్‌ఐఆర్) టికెట్ కనిపిస్తుంది. ఇందులో మనం వెళ్లాల్సిన స్టేషన్, కావాల్సిన టికెట్లు, పేపర్ లెస్ టికెట్ అని యాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో డెబిట్/క్రెడిట్ కార్డులు/ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ పేమెంట్ చేయగానే స్మార్ట్ ఫోన్‌లో జనరల్ స్మార్ట్(పేపర్ లెస్) టికెట్లు డౌన్‌లోడ్ అవుతాయి. ఒక వేళ పేపర్ టికెట్ కావాలనుకుంటే యాప్‌లో ఆన్‌లైన్ పేమెంట్ చేశాక రైల్వే స్టేషన్‌లోని ఆటోమొటెడ్ టికెట్ వెండింగ్ మిషన్‌లో మొబైల్ నెంబర్, బుకింగ్ ఐడి నమోదు చేసి టికెట్లు పొందవచ్చు. అయితే రైల్వేస్టేషన్ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నపుడు మాత్రమే యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్ తీసుకునే అవకాశం ఉంటుంది.

ఆటోమోటెడ్ టికెట్ వెండింగ్ మిషన్ ద్వారా..

టికెట్ కౌంటర్‌కు వెళ్లకుండా నేరుగా టికెట్ తీసుకునేందుకు రైల్వేశాఖ 6 ఆటోమెటెడ్ టికెట్ వెండింగ్ మిషన్ (ఏటీవీఎం)లు వరంగల్ రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయి. ఏటీవీఎం దగ్గరకు వెళ్లి టచ్ స్క్రీన్‌పై ప్రింట్ మొబైల్ టికెట్, ప్లాట్‌ఫామ్ టికెట్, బుక్ జర్నీ టికెట్, వెళ్లాల్సిన రైల్వేస్టేషన్, ఎక్స్‌ప్రెస్/సూపర్ ఫాస్ట్ రైలు తదితర వివరాలు నమోదు చేయాలి. కావాల్సిన టికెట్‌ల డబ్బులను టచ్‌స్క్రీన్‌పై కనిపించే క్యూఆర్ కోడ్‌కు గూగుల్ పే/ఫోన్ పే తదితర డిజిటల్ పేమెంట్ యాప్‌లతో స్కాన్ చేయగానే టికెట్ ప్రింట్ అయి బయటకు వస్తుంది. ఈ విషయంలో ప్రయాణికుడికి సహకరించేందుకు సిబ్బంది ఉంటారు. ఇలా కాకుండా ఏటీవీఎం దగ్గరకు వెళ్లి నగదు చెల్లించి కూడా జనరల్ టికెట్ పొందవచ్చు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం క్యూ ఆర్ కోడ్ స్కానర్, మొబైల్ నెంబర్ ద్వారా టికెట్ కౌంటర్‌లో తీసుకునే వెసులుబాటు, యూటీఎస్ యాప్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ టికెట్.., క్యూఆర్ కోడ్‌తో ఏటీవీఎం మిషన్ చెల్లింపు ఇలా మూడు రకాల డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉంది. వీటిలో ప్రయాణికులకు అనువైన పద్ధతిలో జనరల్ టికెట్‌ను కొనుగోలు చేసి ప్రయాణం చేయవచ్చు.


ఏటీవీఎం ద్వారా టికెట్ తీసుకుంటున్న ప్రయాణికులు





యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్



సీతంపేటలో క్యూరింగ్ లేక ఎండిపోతున్న సీసీరోడ్డు

నాసిరకం రోడ్లతో ప్రభుత్వ ఖజానాకు గండి

హసన్‌పర్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో రూ.20 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో వేసిన సీసీ రోడ్డు నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 10 రోజుల కిందట వేసిన సీసీ రోడ్డు క్యూరింగ్ లేక పగుళ్లు ఏర్పడ్డాయని సంబంధిత క్వాలిటీ కంట్రోల్ అధికారులు తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి బిల్లులు నిలిపివేయాని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ గ్రామస్తుల అవసరాల కోసం వేయాల్సిన సీసీరోడ్డును తనకు అనుకూలమైన వారికి కమీషన్‌కు కక్కుర్తి పడి రోడ్డు నిర్మాణం చేసినట్లు పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ మంది ప్రజల అవసరాల కోసం మాత్రమే సీసీరోడ్లు వేసే విధంగా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, బెల్లయ్య నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వడ్డెపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గోర్ బోలి లంబాడీ, బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ శాసనసభలో చర్చించి ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతాపూర్వకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాట ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్, టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్, తెలంగాణ ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుగులోతు రవీందర్‌నాయక్, అధికార ప్రతినిధి వినోద్ లోక్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోడా కిషన్ నాయక్, భూక్య తిరుపతి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సునీల్‌నాయక్, రాథోడ్ పండు, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు అభినందనల వెల్లువ



జిన్నా తేజస్వినిరెడ్డిని సత్కరిస్తున్న నాయిని నీలిమారెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, బంక సరళ యాదవ్, చెరుకు వెంకటరాజిరెడ్డి

వడ్డెపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గాంధీ నగర్ కాలనీకి చెందిన జిన్నా విజయపాల్‌రెడ్డి - హేమలత దంపతుల కూతురు జిన్నా తేజస్వీని రెడ్డి గ్రూప్ -1 ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకును కైవసం చేసుకుంది. గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్‌లోని గాంధీనగర్‌లో జిన్నా తేజస్వీనిరెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత, మాజీ కార్పొరేటర్ పసునూరి స్వర్ణలత తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలనీలో గల మహిళా డాక్టర్లను, ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సట్ల సత్తయ్య, కమలాకర్‌రావు, చిట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, కొండ యాదగిరి, నెల్లుట్ల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకల శుభాలనిచ్చేది శ్రీవిశ్వావసు

- టీటీడీ పంచాగ శ్రవణంలో సముద్రాల శఠగోపాచార్య

హనుమకొండ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మొత్తంగా 60 తెలుగు సంవత్సరాల్లో అతిముఖ్యమైనది ఈ శ్రీవిశ్వావసు సంవత్సరమని, ఈ సంవత్సరం ప్రజలకు సకల శుభాలు కలుగుతాయని ప్రముఖ సంస్కృత పండితుడు, ఆధ్మాత్మిక ప్రవచకులు సముద్రాల శఠగోపాచార్యులు అన్నారు. టీటీడీ, హిందుధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పంచాగ పఠనం చేశారు. ప్రతి ఒక్కరూ అధ్మాత్మికను అలవర్చుకోవాలని, ఆనందమాయ జీవనం గడపటానికి అధ్మాత్మికత ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. రాశిఫలాలను తెలుసుకుని అందుకు అనుగుణంగా మసలుకుంటే అశుభాలు దరికిరాకుండా ఉంటాయని, అన్నింటికీ దైవనామస్మరణే ప్రధాన భూమిక అని అన్నారు. ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి రామిరెడ్డి కృష్ణమూర్తి స్వాగతం కలికిన ఈ కార్యక్రమంలో టీటీడీ కల్యాణమండపం మేనేజర్ కనపర్తి రఘువీర్, తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గడ్డం వెంకన్న, వసుంధర మురళీమనోహర్, శ్రీకాంత్, సూర్యనారాయణ పాల్గొన్నారు.



హనుమకొండలో ఉగాది పచ్చడి తాగుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండలోని జీఎంఆర్ అపార్టుమెంట్ నేత్రపర్వంగా జరిగిన ఉగాది వేడుకల్లో శ్వేతార్కమూల అలయ అర్చకుడు, చండీ ఉపాసకుడు సాయికృష్ణ శర్మ పంచాగ శ్రవణం చేశారు. వడ్డెపల్లిలోని బీఆర్ఆర్ భవన్‌లో జరిగిన సహృదయ సాహిత్య వేడుకల్లో నమిలిగొండ విశ్వేశ్వర శర్మ పంచాగ పఠనం చేశారు. ఈ సందర్భంగా ఏవీ నరసింహరావు శబ్దచిత్రాలు రచన కవితాల సంపుటిని మండాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అవిష్కరించారు. స్వర విపంచి పేరిట సిద్ధిపేటకు చెందిన శశిధర శర్మ బృందంచే వీణులవిందుగా అలపించిన లలిత సంగీతం అలరింపచేసింది. సహృదయ అధ్యక్షుడు డాక్టర్ గిరిజా మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుంఝవజ్ఝల కృష్ణమూర్తి, సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహర్‌రావు, వనం లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది జీవితాల్లో వెలుగులు నింపాలి

హనుమకొండ టౌన్: శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం హనుమకొండలోని వారి నివాసంలో ఉగాది పర్వదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉగాది పచ్చడిని తాగి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో తెలుగు నూతన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులతో పంచాంగ శ్రావణం, ఆశీర్వచనం, ఉగాది పచ్చడి, భక్షాలు, ప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలందించినవారికి ఉగాది పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

వడ్డెపల్లి: హనుమకొండలోని వివిధ డివిజన్లలో ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో రుత్వికులు పంచాంగ శ్రవణాన్ని పఠించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో, హనుమకొండ గోపాల్‌పూర్ క్రాస్ రోడ్డులోని హన్మంతరావు నగర్‌లో గల శ్రీవేంకటగణేశ సాయి సువర్చల అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధానార్చకుడు ఆరుట్ల కిరణ్‌కుమారాచార్యులు పంచాంగ శ్రవణాన్ని పఠించారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలుగు ఉగాది విశ్వావసు నామ సంవత్సర వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర, జిల్లా నేతలు పొన్నం రాజు, దండు చిరంజీవి, సింగారపు రామకృష్ణ, నీరటి రాజు, తాళ్ల రవీందర్, పులి రాజేష్, పులి సదానంద తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ కల్యాణ మండపంలో పంచాగ శ్రవణం చేస్తున్న సముద్రాల శఠగోపాచార్య




బీఆర్ఎస్ కార్యాలయంలో విశిష్ట సేవలందించిన వారిని పురస్కారాలతో సత్కరిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్



మెప్మా కార్యాలయంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్

మంత్రపురి కాలనీలో అస్తవ్యస్తంగా సీసీరోడ్లు



సైడ్ బర్మ్స్ లేక ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్లు

హసన్‌పర్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ఎర్రగట్టుగుట్ట మంత్రపురి కాలనీలో నూతనంగా నిర్మిరించిన సీసీ రోడ్లు కాలనీవాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు గాలికివదిలి ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసరమైన చోట కాకుండా తమకు అనుకూలమైన చోట సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టింపులేని తనంగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలున్నాయి. ముందుగా ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తి చేసిన తరువాత కాలనీలలో రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కాంట్రాక్టర్ పలుకు బడి కలిగిన వారి కాలనీలలో మాత్రమే రోడ్లు వేస్తున్నారని స్థానికు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైడ్ బర్మ్స్ లేకుంటే ప్రమాదమే..

ఎర్రగట్టుగుట్ట మంత్రపురి కాలనీలో వేసిన సీసీ రోడ్ల ప్రమాదక రంగా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి అయిన వెంటనే సైడ్ బర్మ్స్ నాణ్యమైన మట్టితో నింపాల్సి ఉం డగా వదిలే యడం వల్ల వాహనదారులకు ప్రాణసంకటంగా మారిం దని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు తక్షణమే స్పందించి సీసీరోడ్లకు సైడ్ బర్మ్‌ను నాణ్యమైన మట్టితో నింపే విధంగా చూసి ప్రజల ప్రాణాలు కాపాడాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

పన్నెండేళ్లుగా

ప్రహరీ లేకపాయే..

- కాజీపేట ఐటీఐకి కాంపౌండ్‌వాల్ లేక ఇబ్బందులు
- స్థలం లేక ఏటీసీ సెంటర్ తరలింపు



కాజీపేటలో కాంపౌండ్‌వాల్, గేట్ లేని ఐటీఐ

కాజీపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట ఐటీఐలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఐటీఐని ప్రారంభించి పన్నెండు సంవత్సరాలైనా కాంపౌండ్ వాల్, నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో ఐటీఐ సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ప్రతీ రోజు ఉదయం ఐటీఐకి వచ్చే సిబ్బందికి ఖాళీ మద్యం సీసాలు, సమీపంలోని మార్కెట్‌లోని కుళ్లిపోయిన కూరగాయలతో ఐటీఐ ప్రాంగణం దర్శనమిస్తోంది. గతంలో ఈ కాంపౌండ్‌వాల్ నిర్మించడానికి రూ.5 లక్షల నిధులు మంజూరైనప్పటికీ స్థానికులు చిన్న, చిన్న కారణాలతో అడ్డుకోవడంతో నిధులు వెనక్కివెళ్లిపోయాయి. ఐటీఐలో విలువైన సామగ్రితో పాటు ఇతరత్రా వస్తువులు ఉండడంతో కాంపౌండ్ వాల్, గేట్, నైట్ వాచ్ మెన్ లేకపోవడంతో భద్రతలేదని ఐటీఐ సిబ్బంది వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి చొరవ తీసుకుని కాంపౌండ్‌వాల్ నిర్మించి, గేట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరంగల్‌కు తరలిపోయిన ఏటీసీ సెంటర్

టెక్నికల్ విద్యతోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లు (ఏటీసీ)గా నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. కాజీపేట ఐటీఐని అప్‌గ్రేడ్ చేస్తూ ఐటీఐ స్థలం సమీపంలోనే ఏటీసీ సెంటర్ నిర్మించాల్సి ఉంది. అయితే ఇక్కడ స్థలం లేదన్న కారణంతో ఏటీసీ సెంటర్‌ను వరంగల్ ములుగు రోడ్‌కు తరలించారు. కాజీపేటలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతోనే ఏటీసీ సెంటర్‌ను ములుగు రోడ్‌కు తరలించి అక్కడ నిర్మాణాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.. రోబోటిక్, డిజిటల్ మ్యానిఫ్యాక్చరింగ్ లాంటి అడ్వాన్స్‌డ్ కోర్సులతో నిర్మించే ఏటీసీ సెంటర్ వరంగల్‌కు తరలిపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాజీపేటలో ఉన్న ఐటీఐ అయినా కనీస సౌకర్యాలు కల్పించి ఇక్కడి నుంచి తరలిపోకుండా చూడాలని స్థానికుల కోరుతున్నారు.



ములుగురోడ్‌లో నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్ షెడ్డు

కాలువలు లేక దుర్గంధం

- శిథిలావస్థ డ్రెయినేజీలకు నామమాత్రంగా మరమ్మతులు
- తాగునీటి పైప్‌లైన్ ధ్వంసంతో మురుగునీరు సరఫరా
- ఇబ్బందుల్లో హనుమకొండ 9వ డివిజన్ వాసులు
- పట్టించుకోని జీడబ్ల్యూఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు



9వ డివిజన్ ఓంసాయికాలనీ ప్రధాన రోడ్డుపై వృథాగా పారుతున్న తాగునీరు

హనుమకొండ చౌరస్తా, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 9వ డివిజన్ రాయపుర, సుధానగర్ ప్రాంతాల్లో సైడ్ డ్రెయినేజీలు పటిష్టంగా లేక మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో ముక్కుపుటాలు అదిరే దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండ చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న 9వ డివిజన్‌లో ప్రధానంగా సైడ్ డ్రెయినేజీల వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం, కొన్ని సైడ్ డ్రైన్‌లు శిథిలావస్థలోకి కూరుకపోవడంతో అక్కడి ప్రజలు అనేక ఇబ్బందులను చవిచూస్తున్నారు. సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకోవడం లేదని డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లోని రోడ్ల నిర్మాణం చేపట్టిన సమయంలో సైడ్‌డ్రైన్‌ల నిర్మాణం చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. అధికారుల పర్యవేక్షణ చేయకపోవడం వల్ల మురుగునీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధంతో పాటు ఈగలు, దోమలు, వృద్ధి చెంది రోగాల బారిన పడాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి, నల్లా బిల్లులు ముక్కుపిండి మరీ వసూలు చేసే జీడబ్ల్యూఎంసీ అధికారులకు తమ కష్టాలు కనబడకపోవడం దురదృష్టకరమని స్థానిక డివిజన్‌కు చెందిన ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రాయపుర, సుధానగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో సైడ్ డ్రైనేజీలు నిర్మాణాలను చేపట్టాలని కోరుకుంటున్నారు.

రోడ్లపై వృథాగా తాగునీరు

గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీ, ఓంసాయి కాలనీ, రాయపురా ప్రాంతాలలో కొన్నినెలలుగా పైపులైన్లు లీకు కావడం, పక్కనే సైడ్ డ్రైనేజీలు ఉండటంతో మురుగు నీరు తాగునీటిలో కలిసి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. గుడిబండల్ నుంచి యాదవనగర్ జంక్షన్‌కు వెళ్లే ప్రధాన మార్గం ఇందిరానగర్ రోడ్డు వద్ద పైపులైన్లు దెబ్బతినడం కారణంగా తాగునీరు ఏళ్ల తరబడి వృథాగా పోతున్నా.. పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గతంలో ఇదే ప్రాంతంలో పైపులైన్లు ధ్వంసం కారణంగా తాగునీరు పెద్ద ఎత్తున కాలువల్లో ప్రవహిస్తుంటే స్థానికులు ఆందోళన చేపట్టగా సంబంధిత అధికారులు, సిబ్బంది తూతూమంత్రంగా మరమ్మతు పనులు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇదే ప్రాంతంలో మళ్లీ తాగునీరు లీకై రోడ్డుపై పెద్ద ఎత్తున వరద పారడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు అంతరాయం కలిగి నానా ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ల లీకుల కారణంగా తాగునీరు వచ్చే గంట సమయం కూడా సరిగా రాకపోవడంతో పాటు, కలుషిత మురుగు నీరు రావడంతో తాగి జబ్బుల బారిన పడి ఆస్పత్రుల పాలు కావాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లీకేజీలను అరికట్టాల్సిన జీడబ్ల్యూఎంసీ అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



9వ డివిజన్‌లో డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం..

పెద్ది వెంకటేశ్వర్లు, రాయపుర హనుమకొండ



9వ డివిజన్ రాయపురా మైసమ్మ ఆలయం ముందు ఏళ్లుగా సైడ్ డ్రైన్ శిథిలావస్థకు చేరుకుంది. రోజుల తరబడి మురుగు నీరు పారక నిలువ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లటంతో ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నిలువ ఉండటంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడాల్సి వస్తోంది. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

మురుగు నీళ్లతో ఇబ్బందులు

గుండ సుధాకర్, ఓంసాయికాలనీ



ఓంసాయికాలనీ, గణేష్‌నగర్, రాయపురా ప్రాంతాల్లో మంచినీటి పైపులు దెబ్బతినడంతో ఏళ్ల తరబడి తాగునీరు వృథాగా పోవడమే కాకుండా మురుగు నీరు సరఫరా కావడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అసలే వేసవి కాలం.. రోజు విడిచి రోజు వస్తున్న తాగునీరు కలుషితం అవ్వడంతో ఆ నీటిని తాగడం వలన అనారోగ్యంపాలు కావాల్సి వస్తోంది. జీడబ్ల్యూఎంసీ అధికారులు, సిబ్బంది స్పందించి పైపు నీళ్ల లీకులను అరికట్టి మురుగునీరు నుంచి ఉపశమనం కల్పించాలి.

సర్వర్ బిజీతో అధికారుల ఇబ్బందులు

హసన్‌పర్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు విద్య, ఉద్యోగ అవకాశాలతోపాటు అటు సంక్షేమ పథకాల దరఖాస్తుల కోసం లబ్ధిదారులు సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో రోజు రోజుకు సర్టిఫికెట్ల దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. ప్రతీరోజు వందల సంఖ్యలో సర్టిఫికెట్ల కోసం వస్తున్న లబ్ధిదారులు సర్టిఫికెట్లు అందక కార్యాలయంలో సిబ్బందితో గొడవ పడుతున్నారు. అయితే సర్టిఫికెట్ల కోసం అధికారులు సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడినప్పటికీ సర్వర్ పనిచేయకపోవడంతో ఇటు అధికారులు, సిబ్బందితో పాటు అటు లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. దీంతో పరిస్థితి రోజు రోజుకు విషమంగా మారడంతో ప్రజల్లో అసహనం పెరిగి తమ అక్కసును సిబ్బందిపై వెల్లగక్కుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వెబ్‌సైట్ సర్వర్ సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయంలో పేరుకుపోతున్న సర్టిఫికెట్లు

మరో ఆరు రోజులు



ఉపవాసాలు, దానధర్మాలు, ప్రత్యేక నమాజ్‌లు, ఆరాధనలతో రంజాన్ మాసం ముగిసింది. తనపట్ల భక్తిని, నమ్మకాన్ని మరింత పటిష్టపరచుకొనే అవకాశాన్ని విశ్వాసులకు అల్లాహ్ అనుగ్రహించాడు. దీనికి కొనసాగింపుగా... రంజాన్ మాస ఉపవాసాలను పూర్తి చేసిన తరువాత... తదుపరి మాసమైన షవ్వాల్‌లో ఆరు రోజులు ఉపవాసాలు చేసే సంప్రదాయం ఉంది. సాధారణంగా... 'ఈద్-ఉల్-ఫితర్' జరుపుకొన్నాక... రెండో రోజు నుంచి ఈ ఉపవాసాలను పాటిస్తారు. ఎవరైతే రంజాన్ ఉపవాసాలు చేసి, ఆ తరువాత షవ్వాల్ మాసంలో ఆరు రోజులు ఉపవాసాలు ఉంటారో... వారు ఏడాదంతా ఉపవాసాలు చేసినట్టేనని దైవ ప్రవక్త మహమ్మద్ తెలిపారు. రంజాన్ ఉపవాసాలను, షవ్వాల్ ఉపవాసాలను పాటించిన వారు తల్లి గర్భంలోంచి అప్పుడే పుట్టినంత పవిత్రులవుతారని, వారు ఎప్పుడూ ఉపవాసాలు పాటిస్తున్నవారిగా పరిగణన పొందుతారని హదీస్ గ్రంథం చెబుతోంది. ఎల్లప్పుడూ ఉపవాసం పాటించడం గురించి తనకు ఎదురైన ఒక వ్యక్తి అడిగిన ప్రశ్నకు దైవ ప్రవక్త సమాధానం ఇస్తూ "రంజాన్ ఉపవాసాలతో పాటు తరువాతి నెలలోని (ఆరు రోజుల) ఉపవాసాలను కూడా పాటించు. అలాగే బుధ, గురువారాల్లో ఉపవాసం ఉండు. దీనివల్ల నువ్వు ఎల్లప్పుడూ ఉపవాసాలు పాటించేవాడిగా పరిగణన పొందుతావు" అని చెప్పారు. "ఎవరైనా రంజాన్ మాసమంతా ఉపవాసాలు ఉంటే... అతనికి పది నెలల పుణ్యం వస్తుంది. షవ్వాల్‌లోని ఆరు రోజుల ఉపవాసాల వల్ల అరవై రోజుల పుణ్యం లభిస్తుంది. ఈ విధంగా పన్నెండు నెలలు... అంటే ఏడాది కాలం ఉపవాసాలు చేసినంత పుణ్యం వారికి దక్కుతుంది" అని దివ్య గ్రంథాలు పేర్కొంటున్నాయి. కాగా, "రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే... షవ్వాల్ ఉపవాసాల ద్వారా ఆ పొరపాట్లను అల్లాహ్ మన్నిస్తాడు. నమాజ్‌లలో ఏర్పడిన లోపాలను తొలగిస్తాడు" అని పూర్వ ఉలేమాలు (ఇస్లాం గురువులు) స్పష్టం చేశారు.

– మహమ్మద్ వహీదుద్దీన్



ఉపవాస దీక్ష తరవాత

ముస్లింలు రంజాన్ మాసమంతా కఠిన ఉపవాస దీక్ష కొనసాగించారు. నేటి నుంచి వీరు సాధారణ విధానాన్ని అనుసరించాలి. నెల రోజులు ఉపవాసం చేయడం వల్ల జీర్ణక్రియలో మార్పులు వస్తాయి. కాబట్టి శరీరం సాధారణ ఆహారపు అలవాట్లకు సర్దుబాటు కావడానికి కొంత సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. జీవక్రియలు యథావిధిగా కొనసాగేందుకు పాటించాల్సిన కొన్ని చిట్కాలను ఇలా సూచిస్తున్నారు.

- తాజా కూరగాయలు, పళ్లు, తృణధాన్యాలతో కూడిన సమతులాహారాన్ని తీసుకోవాలి. ఇందులో మితంగా ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలి. మసాలాలతో కూడిన నూనె పదార్థాలను తినకూడదు. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని మాత్రమే తినాలి.
- శరీరం నిర్జలీకరణ స్థితిలోకి వెళ్లకుండా కొద్దికొద్దిగా నీరు తాగుతూ ఉండాలి. పలుచని మజ్జిగ, నీళ్ల కలిపిన పాలు తాగడం వల్ల శరీరంలో క్రమంగా నీటి శాతం పెరగడంతోపాటు తక్షణ శక్తి కూడా లభిస్తుంది. దాహంగా ఉందంటూ శీతల పానీయాలు తాగకూడదు. దీనివల్ల శరీరంలో అదనంగా చక్కెర చేరి దాహార్తి పెరుగుతుంది.
- ఈ నెల రోజులూ తక్కువగా తింటూ ఎక్కువ సమయం మేలుకొని ఉండే విధానాన్ని శరీరం అలవాటు చేసుకుని ఉంటుంది కాబట్టి సాధారణ విధానాన్ని ఒకేసారిగా కాకుండా మెల్లగా అనుసరించే ప్రయత్నం చేయాలి. ఆలస్యంగా పడుకోవడం, ఎక్కువ సేపు నిద్రపోవడం కాకుండా సాధారణ దినచర్యను పాటించాలి.
- ఒకేసారి ఎక్కువగా తినకుండా కొద్దికొద్దిగా పలుమార్లు తింటే జీర్ణ సమస్యలను నివారించవచ్చు. భోజనం తరవాత కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ వేగం పుంజుకుంటుంది. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో తేలికపాటి వ్యాయామం చేయడం వల్ల శరీరానికి చురుకుదనం లభిస్తుంది.
- ఆకలి అనిపించినప్పుడు అధిక క్యాలరీలు ఉన్న ఆహార పదార్థాలు కాకుండా తేలికగా జీర్ణమయ్యే పోషకారాన్ని తినాలి. మొలకలు, క్యారెట్, కీరా, గింజలు తినడం మంచిది. దీనివల్ల శరీరం అలసిపోకుండా ఉంటుంది.
- శరీర బరువులో వస్తున్న మార్పులు, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి తదితరాలను పరీక్షించుకుంటూ ఉండాలి. వాటికి అనుగుణంగా ఆహారపదార్థాలు తీసుకోవాలి.

డైనింగ్ టేబుల్ అందంగా ఇలా...

సాధారణంగా డైనింగ్ టేబుల్ మీద మంచినీళ్ల గ్లాసులు, వాటర్ బాటిల్స్, పళ్లేలు ఇలా ఎన్నెన్నో పెట్టేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల డైనింగ్ రూమ్ అందం పాడవుతుందని నిపుణులు చెబుతున్నారు. డైనింగ్ టేబుల్‌ను ఆకర్షణీయంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- డైనింగ్ టేబుల్ మీద తప్పనిసరిగా టేబుల్ క్లాత్ వేయాలి. కాటన్, సిల్క్, రేయాన్, జూట్, పాలిస్టర్ క్లాత్‌లను ఎంచుకోవచ్చు. ఎంబ్రాయిడరీ వర్క్ చేసినవి, పెద్ద ప్రింట్లు ఉన్నవి అయితే టేబుల్‌కు రిచ్ లుక్ వస్తుంది.
- డైనింగ్ టేబుల్ చుట్టూ అమర్చిన కుర్చీల ముందు టేబుల్‌పై మ్యాట్‌లు వేయాలి. వీటి వల్ల టేబుల్ క్లాసీగా కనిపిస్తుంది. కాటన్ లేదా నారతో తయారు చేసిన మ్యాట్‌లు..... టేబుల్‌పై



చక్కగా అమరుతాయి. రకరకాల రంగుల్లో పలు డిజైన్లతో ఉన్న మ్యాట్‌లు ఎంచుకుంటే టేబుల్ అందంగా కనిపిస్తుంది.
- డైనింగ్ టేబుల్‌కు క్యాండిల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. టేబుల్ ముందు కుర్చీలో కూర్చున్నప్పుడు కంటి ఎత్తు కంటే కిందుగా క్యాండిల్స్ అమర్చాలి. టేబుల్ మధ్యలో ఓ పెద్ద క్యాండిల్ పెడితే చూడడానికి బాగుంటుంది. టేబుల్ మధ్యలో ఫ్లవర్ వాజ్‌ను ఉంచి దాని చుట్టూ రంగురంగుల క్యాండిల్స్ పెడితే ఆకర్షణీయంగా ఉంటుంది.
- డైనింగ్ టేబుల్ గుండ్రంగా ఉన్నట్లయితే రూఫ్ నుంచి ఓ పెద్ద పెండాంట్ లైట్ వేలాడేలా అమర్చుకుంటే బాగుంటుంది దీర్ఘచతురస్రాకారపు టేబుల్ అయితే రెండు లేదా మూడు వరుసల్లో పెండాంట్ లైట్లను అమర్చుకోవచ్చు. అందమైన షాండ్లియర్ ఏర్పాటు చేసుకుంటే డైనింగ్ టేబుల్ రిచ్‌గా కనిపిస్తుంది.
- డైనింగ్ టేబుల్ మీద ఓ పక్కగా చిన్న మొక్క ఉన్న పింగాణీ కుండీని పెడితే చూడడానికి బాగుంటుంది.

అభిరుచి

డిజిటల్ తెరపై తిరుగులేని తార

నీతూ బిష్ట్... ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఒక సంచలనం. ఆమె పేరిట ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కు సబ్‌స్క్రైబర్ల సంఖ్య మూడు కోట్లు దాటింది. ప్రతి వీడియోకూ వీక్షకుల సంఖ్య లక్షల్లో ఉంటోంది. దానికి తగినట్టే ఆదాయం కూడా వచ్చి పడుతోంది. డిజిటల్ తెరపై తిరుగులేని తారగా అభిమానులను సంపాదించుకుంది. ఇంతకీ ఎవరీ అమ్మాయి? ఆమె కంటెంట్‌లో అంత ప్రత్యేకత ఏముంది?



నీతూది మధ్యతరగతి కుటుంబం. తల్లి మోహిని బిష్ట్. తండ్రి ప్రతాప్ బిష్ట్... రాష్ట్రపతి భవన్‌లో ఉద్యోగి. నీతూకి ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు. పుట్టింది ఉత్తరాఖండ్‌లోని కర్చులి అయినప్పటికీ... తండ్రి ఉద్యోగరీత్యా అంతా కలసి ఢిల్లీలో ఉండేవాళ్లు. పిల్లలంతా 'డాక్టర్ రాజేంద్రప్రసాద్ సర్వోదయ స్కూల్'లో చదువుకొనేవాళ్లు. నీతూకి పదకొండేళ్లప్పుడు సెరిబ్రల్ హెమరేజ్‌తో తండ్రి మరణించారు. దీంతో కుటుంబ బాధ్యతను తలకెత్తుకున్న తల్లికి చేదోడు వాదోడుగా ఉండాలని డిగ్రీ పూర్తికాగానే చిన్న ఉద్యోగంలో చేరింది నీతూ.

మొదటి అడుగు వేసింది ఇలా...

2016లో షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్ 'టిక్ టాక్' ఓ ప్రభంజనంలా వచ్చింది. అందులో వచ్చే వీడియోలు చూసి నచ్చడంతో తను కూడా కొత్తగా ప్రయత్నించాలనుకుంది 27 ఏళ్ల నీతూ. టిక్‌టాక్‌లో చిన్న చిన్న వీడియోలు చేయడం మొదలుపెట్టింది. ఇదే ఆమె వేసిన మొదటి అడుగు. తరవాత ఆమె వెనుదిరిగి చూడలేదు. కొన్ని రోజుల్లోనే నీతూకి ఫాలోవర్స్ బాగా పెరిగిపోయారు. క్రమంగా మోడలింగ్, కమర్షియల్ యాడ్స్ అవకాశాలు ఆమె తలుపుతట్టాయి. వచ్చిన ప్రతీ అవకాశాన్ని గెలుపు బాటగా మార్చుకుంటూ నీతూ ముందుకు సాగింది.

సోషల్ మీడియానే కెరీర్‌గా...

2018లో ప్రభుత్వం టిక్‌టాక్‌ని నిషేధించింది. అయినా నీతూ నిరాశ పడలేదు. ఆమె 2011లోనే యూట్యూబ్ ఛానెల్‌ని ప్రారంభించింది. అడపా దడపా వీడియోలు అప్‌లోడ్ చేస్తూ ఉండేది. టిక్‌టాక్ బ్యాన్ అయిన తరవాత యూట్యూబ్ మీద దృష్టి నిలిపింది నీతూ. టిక్‌టాక్ తరహాలోనే చిన్న చిన్న వీడియోలు, రీల్స్ చేసి అప్‌లోడ్ చేయడం ప్రారంభించింది. చూస్తుండగానే యూట్యూబ్‌లో కూడా సబ్‌స్క్రయిబర్స్ పెరిగిపోయారు. బయటికి వెళితే చాలు అందరూ గుర్తుపట్టి సెల్ఫీలు తీసుకునేవాళ్లు. దీంతో సోషల్ మీడియానే కెరీర్‌గా మార్చుకోవాలనే ఆలోచన వచ్చింది నీతూకి. వెంటనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కూడా యాక్టివ్ రోల్ పోషించడం మొదలుపెట్టింది. క్రమంగా వ్లాగర్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, కంటెంట్ క్రియేటర్‌గా, వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకోవడంతో పాటు కోట్లు ఆర్జించే స్థాయికి ఎదిగింది.

ప్రేమ... పెళ్లి...

మోడలింగ్‌లో రాణిస్తున్న సమయంలో నీతూకి ప్రొఫెషనల్ క్రికెటర్ లఖన్ అర్జున్ రావత్‌తో పరిచయమైంది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారడంతో.... 2021 జనవరిలో వీరి నిశ్చితార్థం జరిగింది. రెండేళ్ల తరవాత 2023 ఫిబ్రవరిలో వీరిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు. వివాహానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా పేజీల్లో షేర్ చేసింది నీతూ.

ఇవి కూడా...

నీతూ... ఒకవైపు మోడలింగ్, మరోవైపు కమర్షియల్ యాడ్స్ చేస్తూ బిజీగా మారిపోయింది. బింగో, లివ్ ప్యూర్, అమెజాన్, కోస్టా, పాంటలూన్స్ ప్రకటనలు ఆమెకు మంచిపేరు తెచ్చాయి. ఎన్నో బ్యూటీ ప్రొడక్ట్‌కి ప్రమోషన్స్ చేసింది. పంజాబీ సాంగ్ 'బద్నావి'లో కూడా కనిపించి మురిపించింది.

కంటెంట్‌కీ ఫ్యాన్స్ ఉన్నారు...!

నీతూ పోస్ట్ చేసే వీడియోల్లోని కంటెంట్‌కి ప్రత్యేకమైన అభిమానులు ఉన్నారు. హాస్యం మేళవించిన సంభాషణలతో ఈ వీడియోలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయి. వీటి వ్యవధి కొన్ని సెకన్లు మాత్రమే ఉండడంతో అవి బాగా పాపులర్ అయ్యాయి. నీతూ ఎక్కువగా ట్రావెల్, ఫ్యాషన్, కామెడీ వీడియోలు పోస్ట్ చేస్తూ ఉంటుంది. అప్పుడప్పుడూ బ్యూటీ టిప్స్ చెబుతుంది. నీతూ ఇప్పటి వరకు సుమారు 3,000ల షార్ట్ వీడియోలు అప్‌లోడ్ చేసింది. వీటిలో పెద్ద వీడియోలు 8 మాత్రమే ఉన్నాయి. టిక్‌టాక్ అయినా, యూట్యూబ్ అయినా ఆమె అనుసరించిన పంథా షార్ట్ వీడియోలే. ఇవే ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టాయి.



మిలియన్ మార్క్...

నీతూ బిష్ట్ నిర్వహిస్తున్న యూట్యూబ్ చానెల్‌ను ఇప్పటి వరకు 3.2 కోట్ల మంది సబ్‌స్క్రైబ్ చేశారు. ఆమె వీడియోలకు కూడా లక్షల కొద్దీ వ్యూస్ వస్తూ ఉంటాయి. కోటి మంది వీక్షించిన వీడియోలు ఆమె చానెల్‌లో చాలానే ఉన్నాయి. ఇటీవల ఆమె పోస్ట్ చేసిన ఓ షార్ట్ వీడియోను దాదాపు ఆరు కోట్ల మంది చూశారు. నీతూకి ఫేస్‌బుక్‌లో నలభై లక్షల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 50 లక్షలమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇప్పుడు బాలీవుడ్ స్టార్లకు ఏమాత్రం తీసిపోనంతగా క్రేజ్ సంపాదించుకుంది నీతూ.

స్వచ్ఛమైన పరిష్కారం

పరిసరాలను అసహ్యంగా మార్చడంతోపాటు పౌరుల ఆరోగ్యానికి కూడా పెనుముప్పు కలిగిస్తున్న వ్యర్థాల సమస్యకు వినూత్నమైన పరిష్కారంతో ముందుకొచ్చారు ముంబయి మహిళ మానా షా. ఆమె చొరవతో యాభైకి పైగా హౌసింగ్ సొసైటీలు, అనేక కార్పొరేట్ సంస్థలు చెత్త ఇబ్బందుల నుంచి విముక్తి పొందాయి. అంతేకాదు... ప్రతినెలా 500 టన్నులకు పైగా సేకరిస్తున్న వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చి, ఉచితంగా అందిస్తున్నారు.



ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు, నగరం శివార్లలో పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు. దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరంలో నానాటికీ తీవ్రమవుతున్న 'ఈ సమస్యకు పరిష్కారం లేదా?' అనే ఆలోచన చాలాకాలం మానా షాను వెంటాడింది. 2006లో 'యాన్ ఇన్‌కన్వీనియెంట్ ట్రూత్' అనే డాక్యుమెంటరీ చూశాక... సమస్య తీవ్రత ఆమెకు మరింత బాగా అర్థమయింది. "మన దేశంలోని తీరప్రాంతాల్లో నివసిస్తున్నవారు సముద్ర మట్టాలు పెరగడం వల్ల ముప్పును ఎదుర్కొనే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంది. భారీ పరిమాణాల్లో వ్యర్థాలను తీర ప్రాంతాల్లో పారేస్తూ ఉండడంతో ఆ ప్రమాదం చాలా వేగంగా పెరుగుతోంది. అలాంటి టాప్ 10 నగరాల్లో ముంబయి ఒకటని తెలియగానే నేను దిగ్భ్రాంతి చెందాను. నేను పుట్టి పెరిగిన నగరానికి ఆ దుస్థితి రాకూడదనుకున్నాను" అంటారామె.



కుటుంబ వ్యాపారాన్ని వదిలేసి...

మానా షాది వ్యాపారుల కుటుంబం. ఆమె తండ్రి, కుటుంబ సభ్యులు పెట్రోల్ బంకులు నిర్వహిస్తారు. ఒక ఫ్యాక్టరీ కూడా ఉంది. తండ్రి మార్గదర్శకత్వంలో ఆమె కూడా ఆ మార్గంలోకే వచ్చారు. ఫ్యాక్టరీ కార్యకలాపాలు, వినియోగదారుల సేవల్ని ఆమె చూసేవారు. క్రమంగా ప్రెసిడెంట్ హోదాకు చేరుకున్నారు. ఉరుకుల పరుగుల జీవితం, వ్యాపారంలో ఒత్తిడులు ఒకవైపు... సొంత నగరానికి ఏదైనా మంచి చెయ్యాలనే కోరిక మరొకవైపు... చివరకు ఆమెలోని సేవా దృక్పథమే గెలిచింది. రెండేళ్ళపాటు అధ్యయనం చేసిన తరువాత... 2010లో 'గ్రీన్ ప్రాక్టీసెస్' అనే సంస్థను ఆమె ప్రారంభించారు. నగరంలో వివిధ కాలనీలను సందర్శించారు. హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో మాట్లాడారు. చెత్తను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ పారెయ్యడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. "మనం చెత్తను దూరంగా పారేస్తున్నామని అనుకుంటాం. కానీ 'దూరం' అనే మాటకు అర్థం లేదు. అది మన ఊరు దాటి వెళ్ళదు. తన దుష్ఫలితాలను మన మీదకు పంపిస్తుంది. ఏ సమాజంలోనైనా వ్యర్థాల నిర్వహణ చాలా కీలకం" అని చెబుతారు మానా. ఇంటికే వచ్చి చెత్త తీసుకువెళ్తామని చెబితే ఎవరు కాదంటారు? మొదట ఒక ప్రాంతంతో మొదలైన ఈ కార్యక్రమం... ప్రస్తుతం 50కిపైగా హౌసింగ్ సొసైటీలకు విస్తరించింది. అంతేకాదు... రిలయన్స్, స్విగ్గీ లాంటి ప్రముఖ సంస్థలకు కూడా గ్రీన్ ప్రాక్టీసెస్ సేవలు అందిస్తోంది.

చైతన్యం పెరుగుతోంది...

ఆచరణాత్మకమైన ప్రణాళిక, అమలులో కచ్చితత్వమే తమ ప్రయత్నం విజయవంతం కావడానికి దోహదం చేశాయంటారు మానా. "రోజూ ట్రక్కులు కాలనీలకు, సంబంధిత సంస్థల కార్యాలయాల దగ్గరకు వస్తాయి. చెత్తను సేకరించిన తరువాత... దాన్ని నిర్ణీత ప్రదేశాలకు మా సిబ్బంది తీసుకువస్తారు. అక్కడ ఆహార, ఆహారేతర పదార్థాలను విడదీస్తారు. ఆహారేతర పదార్థాల్లో లోహాలు, కాగితాలు, ప్లాస్టిక్, గాజు... ఇలా వివిధ పదార్థాలను వేరు చేస్తారు. వాటిని రీసైక్లింగ్ కేంద్రాలకు పంపిస్తారు. ఆహార వ్యర్థాలను వేరే కేంద్రానికి తెచ్చి కంపోస్ట్ తయారు చేస్తారు. కంపోస్టింగ్‌కు సాధారణంగా ఆరు నెలలు పడుతుంది. కానీ మేం నిర్దిష్టమైన మైక్రోబ్స్ వినియోగంతో దాన్ని నెల రోజులకు కుదించాం. అలా ఆహార వ్యర్థాలను పోషకాలతో నిండిన కంపోస్ట్‌గా మార్చి... కాలనీలకు, సంస్థలకు ఉచితంగా అందజేస్తాం. దాన్ని ఆరుబయట ఉండే తోటలకు, ఇళ్ళలో పెంచే మొక్కలకు ఎరువుగా దాన్ని వినియోగిస్తున్నారు. వ్యర్థాల రవాణా, సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చుల కోసం ఇంటికి రూ. వంద చొప్పున వసూలు చేస్తున్నాం. దానికి బదులుగా కంపోస్ట్ అందజేస్తున్నాం. మరోవైపు వీధుల్లో, నగర శివార్లలో ఉన్న చెత్త కుప్పలను రీసైకిల్ చేసే బాధ్యత కూడా తీసుకున్నాం" అంటున్నారు మానా. ఆమె కృషితో ప్రస్తుతం నెలకు 500 టన్నుల చెత్త సేకరణ, రీసైక్లింగ్ జరుగుతోంది. కొన్ని పదుల మందికి ఉపాధి లభిస్తోంది. "కుటుంబ వ్యాపారాలను వదిలేసినందుకు ఎన్నడూ చింతించలేదు. నేను చేస్తున్న పనికి గర్వపడుతున్నాను. గతంలోకన్నా ఇప్పుడు ప్రజలలో ప్రకృతి పట్ల, పర్యావరణం పట్ల, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత పట్ల చైతన్యం పెరుగుతోంది. ఇది మంచి పరిణామం. ఇళ్ళలోని వ్యర్థాలు చెత్త కుప్పల మీదకు వెళ్ళకూడదనేదే నా లక్ష్యం. మరిన్ని హౌసింగ్ సొసైటీలతో, వ్యక్తులతో భాగస్వామ్యం కావడం ద్వారా... నా ప్రయత్నాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నాను. ఆ దిశగా పని చేస్తున్నాను" అని చెబుతున్నారు మానా.



స్నానం ఎలా చేయాలి?



శరీరం పరిశుభ్రంగా ఉండాలంటే స్నానం తప్పనిసరి. ప్రతిరోజూ సరైన పద్ధతిలో స్నానం చేయని పక్షంలో అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. స్నానం చేయాల్సిన విధానం గురించి ఇలా తెలియజేస్తున్నారు.

- స్నానానికి మరీ చల్లటి నీళ్ల, మరీ వేడి నీళ్ల ఉపయోగించకూడదు. నీళ్ల ఒంటిపై పోసుకోగానే హాయి కలిగే విధంగా ఉండాలి. ఏ కాలంలో నైనా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.
- ముందుగా ముఖం, కాళ్ల, చేతులను నీటితో తడపాలి. తరవాత మిగిలిన శరీర భాగాలు తడిసేలా నీరు పోసుకోవాలి.
- స్నానానికి సబ్బు తప్పనిసరి. అయినప్పటికీ శరీరాన్ని ఎక్కువగా సబ్బుతో రుద్దకూడదు. అలా చేస్తే చర్మం పొడిబారుతుంది. ముందుగా చేతులతో సబ్బు నురుగు తీసుకుని దాంతో ముఖాన్ని రుద్దుకొని వెంటనే నీటితో శుభ్రం చేసుకోవాలి. తరవాత మెడ, భుజాలు, చేతులు, ఛాతీ, వీపు, పొట్టను సబ్బుతో రుద్దుకోవాలి. ముఖం మీదనుంచి నీళ్ల పోసుకుంటూ సబ్బు పూర్తిగా వదిలేలా శరీర భాగాలను తోముకోవాలి. చివరగా కాళ్ల, పాదాలు, వేళ్లను సబ్బుతో రుద్ది అది పూర్తిగా వదిలేవరకు నీళ్ల పోసుకుంటూ తోముకోవాలి.
- తలస్నానం చేసేటప్పుడు ముందుగా శరీర భాగాలను నీళ్లతో తడిపి ఆ తరవాతనే తలపై నీళ్ల పోసుకోవాలి. అలా కాకుండా ఒక్కసారిగా తలపై నీళ్ల కుమ్మరించుకుంటే తలనొప్పి వస్తుంది. ముందుగా తలకు షాంపూ పట్టించి రెండు నిమిషాలు ఆగాలి. తరవాత తలపై నీళ్ల చిలకరించుకుంటూ శిరోజాలకు అంటిన షాంపూను వదిలించాలి. తల మొత్తాన్ని నీళ్లతో శుభ్రం చేసుకున్న తరవాతనే శరీర భాగాలకు సబ్బు పట్టించాలి. ప్రతిరోజూ తలస్నానం చేయడం మంచిది కాదు. వారానికి రెండుసార్లు చేస్తే చాలు.
- వేసవికాలంలో ఉదయం నిద్ర లేవగానే చల్లటి నీళ్లతో స్నానం చేయాలి. పగలంతా బయట పనులతో అలసిపోయి ఇంటికి రాగానే గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.

దిక్సూచి
DIKSUCHI

జీపాట్ 2025

గ్రాడ్యుయేట్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్ (జీపాట్) 2025కి సంబంధించిన నోటిఫికేషన్‌ను 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎమ్ఎస్) విడుదల చేసింది. ఎంఫార్మసీ అడ్మిషన్స్ కోసం ఉద్దేశించిన ఈ కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ 2025 మే 25న జరుగుతుంది. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ విండో ఓపెన్ అవుతుంది. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు natboard.edu లింక్ యాక్టివేట్ అయిన తరవాత దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత, నాలుగు సంవత్సరాల ఫార్మసీ విద్య పూర్తిచేసుకున్న అభ్యర్థులు దరఖాస్తునకు అర్హులు. అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి లేదు. మే 21న హాల్ టికెట్లు విడుదల చేస్తారు. మే 25న పరీక్ష కాగా, ఫలితాలను జూన్ 25న వెల్లడించే అవకాశం ఉంది. జీపాట్ అడ్మిషన్ ప్రొసీజర్ ప్రారంభం కంటే ముందే ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంటే బీఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.3500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.2500. పూర్తి వివరాలకు ఎన్‌బీఈఎమ్ఎస్ వెబ్‌సైట్ చూడవచ్చు.

30 రోజుల్లో నీట్
ఇలా ప్లాన్ చేయండి



నీట్ పరీక్షకు దాదాపుగా ముప్పై రోజుల వ్యవధి ఉంది. ఈ సమయంలో విద్యార్థులకు ప్రణాళికాబద్ధమైన వ్యూహం అవసరం. మొత్తం 180 ప్రశ్నలతో నీట్ యూజీ ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ 45, కెమిస్ట్రీ 45, బయాలజీ 90 ఉంటాయనే విషయం తెలిసిందే. ఇందులో సరైన సమాధానానికి 4 నాలుగు మార్కులు లభిస్తాయి. తప్పుగా రాసిన సమాధానానికి ఒక మార్కు మైనస్ చేస్తారు. పరీక్షకు సంబంధించి ఇలా మీదైన సొంత వ్యూహం రూపొందించుకోండి.

- 30 రోజులకు సంబంధించిన షెడ్యూల్‌ను మొదట ప్రిపేర్ చేసుకోండి. మూడు గంటలు ఫిజిక్స్, మూడు గంటలు కెమిస్ట్రీ, మూడు గంటలు బయాలజీకి కేటాయించండి.
- గత పరీక్షల ఆధారంగా అధ్యాయాల వెయిటేజీని విశ్లేషించండి. 2021 నుంచి 2024 వరకు పేపర్ల ట్రెండ్‌ను గమనించండి.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ సహా అన్ని సబ్జెక్టుల కాన్సెప్టులను ఎన్‌సీఆర్‌టీ పుస్తకాల ఆధారంగా నేర్చుకోండి. ప్రతీ చాప్టర్‌కు షార్ట్ నోట్స్ ప్రిపేర్ చేసుకోండి.
- ప్రతీ సబ్జెక్టులోనూ ఎక్కువ వెయిటేజీ ఉన్న చాప్టర్లపై దృష్టి పెట్టండి. అలాగే ప్రతీ విద్యార్థి కొన్ని చాప్టర్లను సులభం అని భావిస్తారు. వాటిపై కూడా తప్పనిసరి దృష్టి సారించాలి.

> సొంతంగా చదువుకునే సమయంలో సందేహం వస్తే టెక్నాలజీపై ఆధారపడండి. అంతేతప్ప సందేహాన్ని తీర్చుకునే విషయంలో వాయిదా అనే మాటే వద్దు. యూట్యూబ్స్, సబ్జెక్ట్ వెబ్‌సైట్స్ ఉపయోగించుకోండి.

- రోజూ ఫిజిక్స్ ఫార్ములాలు రివిజన్ చేయండి. దీనితోపాటు 2021 నుంచి 2024 సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయండి. రోజుకు ఒక గంట అయినా ఈ పనిచేయాలి.
- ఫిజిక్స్ ప్రాబ్లమ్ సాధించే సమయంలో టైమ్ మేనేజ్‌మెంట్ పాటించండి. ఒక ప్రశ్నను ఒక నిమిషంలో పూర్తి చేసేలా ఉండాలి.
- ఫిజిక్స్‌లో రోజుకు కనీసం 30-40 ప్రశ్నలు పూర్తి చేసేలా చూసుకోండి.
- రోజులో మొదట ఫిజిక్స్ సబ్జెక్టు చదవడానికి ప్రాధాన్యం ఇవ్వండి. ఫ్రెష్ మైండ్‌తో ఎక్కువగా అర్థం అవుతుంది.
- కెమిస్ట్రీ విషయానికి వస్తే ఆర్గానిక్ కెమిస్ట్రీపై పట్టు సాధించండి. మెకానిజమ్స్ ప్రాక్టీస్ చేయండి. ఫ్లోచార్ట్స్ గుర్తుంచుకోండి.
- కెమిస్ట్రీ ఫార్ములా రివిజన్‌తోపాటు 2019 నుంచి 2024 వరకు ప్రశ్న పత్రాలపై పట్టుసాధించాలి.
- ఫిజికల్ కెమిస్ట్రీలలో బలమైన అంశాలపై దృష్టి సారించండి. ఉదాహరణకు ఇన్‌ఆర్గానిక్ కెమిస్ట్రీలో బలహీనంగా ఉంటే పీ-బ్లాక్ ఎలిమెంట్స్‌కో ఆర్డినేట్ కాంపౌండ్స్‌పై ఎక్కువ సమయం కేటాయించండి.
- బయాలజీ విషయానికి వస్తే ఎన్‌సీఆర్‌టీ పుస్తకాలు చదవండి. జన్యుశాస్త్రం, మానవ శరీర నిర్మాణ శాస్త్రం, బయోటెక్నాలజీ, పర్యావరణ శాస్త్రం మొదలైన వాటికి ఎక్కువ వెయిటేజీ ఉంటుంది.
- మెటీరియల్ చదివే సమయంలో రాసుకున్న షార్ట్‌నోట్స్ రివిజన్ సమయంలో బాగా ఉపయోగపడుతుంది. తరుచూ ఎంట్రెన్స్‌లో వచ్చే చాప్టర్లు ఎక్కువగా రివిజన్ చేయడాలి.
- ముఖ్యమైన డయాగ్రామ్ చదవండి. ప్రతీ డయాగ్రామ్ లేబుల్స్ క్షుణ్ణంగా పరిశీలించండి.
- బయాలజీ స్కోరింగ్ సబ్జెక్టు. అందుకే డిటైల్డ్‌గా చదవడానికి ప్రయత్నించండి.
- వీలయినన్ని మాక్ టెస్టులు రాయండి. దీంతో ఏయే చాప్టర్లపై పట్టు ఉందో అర్థం అవుతుంది. అలాగే టైమ్ మేనేజ్‌మెంట్ టెక్నిక్ తెలుస్తుంది.
- నా ప్రిపరేషన్ సరిగా లేదేమో లేదా సరిపోలేదేమో అనే భావనకు లోనుకావద్దు. ఆత్మవిశ్వాంతో ఉండండి.



- డా. కిషన్ రావు టంకశాల
సంజీవని మెడికల్ అకాడమి

SCHOLARSHIP ALERT

The Cadence Program



The Cadence Scholarship Program 2025-26 provides financial assistance to Indian nationals pursuing undergraduate and professional courses in select regions (Delhi NCR, Bangalore, Pune, Ahmedabad, or Hyderabad).

Eligibility: Must be an Indian national residing and studying in one of the eligible regions. For undergraduate courses, applicants should have passed Class 12 with a minimum overall score of 60% (current Class 12 students may apply based on previous records). Must come from a lower-income group. Preference will be given to STEM students, female students, and eligible specially-abled or transgender candidates.

Prizes & Rewards: Financial support for covering key educational expenses.

Last Date to Apply : 31-05-2025

Application mode : Online applications only

Short Url: www.b4s.in/aj/TCSP5

The Doon School Scholarship

The Doon School Scholarship Examination (DSSE) is an annual entrance exam conducted by the Doon School, Dehradun, Uttarakhand. The scholarship exam is open to male students entering Class 7 or 8, whose families may find it difficult to pay the school fees.

Eligibility: This is open to Indian male students. Applicants must be between 11 to 13 years old as of 30th September 2025. Students must be promoted to Class 7 or 8 in the upcoming academic year.

Prizes & Rewards : An opportunity to pursue studies at the Doon School with financial assistance in the form of scholarship.

Last Date to Apply : 15-04-2025

Application mode: Online and offline via email at (admissions@doonschool.com)

Short Url: www.b4s.in/aj/DSSE2

buddy4study.com

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్స్

జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలంటే మేనేజ్‌మెంట్ కోర్సులు చేయాలనే భావం స్థిరపడి పోయింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ ఇలా ఏ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చిన వారికైనా మేనేజ్‌మెంట్ కోర్సులు చేసే అవకాశం ఉంది. అలాగే ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటున్నవారు కూడా ఈ కోర్సులు చేసి కెరీర్‌లో మరింత ముందుకు వెళ్లగలుగుతున్నారు. కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థల మేనేజ్‌మెంట్ కోర్సుల నోటిఫికేషన్ వెలువడింది. ఒకసారి పరిశీలించండి.



ఐపీఈ హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ 2025-27 విద్యా సంవత్సరానికి పీజీడీఎం ప్రోగ్రామ్‌లో ప్రవేశాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు https://www.ipeindia.org/ వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రోగ్రామ్‌లు

పీజీడీఎం - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - మార్కెటింగ్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
పీజీడీఎం - ఇంటర్నేషనల్ బిజినెస్
పీజీడీఎం - హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్
పీజీడీఎం - బిజినెస్ అనాలిసిస్

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, క్యాట్/గ్మాట్/జీమ్యాట్/ మ్యాట్/ సీమ్యాట్/ ఏటీఎంఏ టెస్ట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
ఇంటర్వ్యూ తేదీ: 2025 ఏప్రిల్ 12

'నిట్' కురుక్షేత్ర

హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 2025-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మే 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://nitkkr.ac.in వెబ్‌సైట్ చూడవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్‌తోపాటు, క్యాట్/ సీమ్యాట్/ మ్యాట్ స్కోరు ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
చివరి తేదీ: 2025 మే 5
గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేదీ ప్రకటన: 2025 మే 8

ఐఐఎం బోధ్‌గయ

ఐఐఎం బోద్‌గయ, టీంలీజ్ ఎడ్యుటెక్‌తో కలిసి ఆన్‌లైన్ 'ఎగ్జిక్యూటీవ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్'(ఈఎంబీఏ)ని డిజైన్ చేసింది. ఈ రెండు సంవత్సరాల ఆన్‌లైన్ కోర్సు మధ్య స్థాయి నుంచి సీనియర్ స్థాయిలో ఉన్న ఎగ్జిక్యూటీవ్‌లకు ఉపయోగపడుతుంది. ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ స్ట్రాటజీ తదితర సబ్జెక్టులు ఇందులో ఉంటాయి. వివరాల కోసం https://iimbgonline.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

JOBS

ఇండియన్ నేవీలో అగ్నివీర్

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియమకానికి నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన వారికి 'ఐఎన్ఎస్ చిల్కా'లో శిక్షణ ఉంటుంది. 2025, 2026 బ్యాచ్‌లకు సంబంధించిన నోటిఫికేషన్ ఇది.

ప్రకటన పేరు: అగ్నివీర్(మెట్రిక్ రిక్రూట్-ఎంఆర్) ఖాళీలు

అర్హత: పదో తరగతి పాసైన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

వయస్సు: 02/2025 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2004 సెప్టెంబరు 1 నుంచి 2008 ఫిబ్రవరి 29 మధ్యలో జన్మించి ఉండాలి. 01/2026 బ్యాచ్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 ఫిబ్రవరి 1 నుంచి 2008 జూలై 31 లోపు జన్మించి ఉండాలి. 02/2026 బ్యాంక్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 2005 సెప్టెంబరు 1 నుంచి 2008 డిసెంబర్ 31లోపు జన్మించి ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: నేవీ ఎంట్రెన్స్ ద్వారా షార్ట్ లిస్ట్ చేస్తారు. రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష, వైద్య పరీక్ష ఉంటాయి.

పరీక్ష: ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లీష్ భాషల్లో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 50 మల్టిపుల్ ఆన్సర్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్, సైన్స్, మేథ్స్, జనరల్ అవేర్‌నెస్ నాలుగు విభాగాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 10
ఎంట్రెన్స్ టెస్ట్: 2025 మే 25న
వెబ్‌సైట్ : https://www.joinindiannavy.gov.in/

ఐపీఎల్‌లో నేడు

వేదిక ముంబై

ముంబై x కోల్‌కతా రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	2	2	0	0	4	2.266
ఢిల్లీ	2	2	0	0	4	1.320
లఖ్‌నవూ	2	1	1	0	2	0.963
గుజరాత్	2	1	1	0	2	0.625
పంజాబ్	1	1	0	0	2	0.550
కోల్‌కతా	2	1	1	0	2	-0.308
చెన్నై	3	1	2	0	2	-0.771
హైదరాబాద్	3	1	2	0	2	-0.871
రాజస్థాన్	3	1	2	0	2	-1.112
ముంబై	2	0	2	0	0	-1.163

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఈసారి అలవోకగా మూడు వందల పరుగులు చేసే జట్టుగా క్రికెట్ పండితుల అంచనాల మధ్య ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ భీకరంగా ఆడింది..కానీ తర్వాత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ సన్‌'రైజింగ్'ను అడ్డుకున్నాయి..ఆరంభ మ్యాచ్‌లో హద్దులు లేకుండా చెలరేగిన హైదరాబాద్ బ్యాటర్లకు లఖ్‌నవూ, ఢిల్లీ బౌలర్లు ముకుతాడు వేశారు..దాంతో రెండు వరుస పరాజయాలతో హైదరాబాద్ బ్యాటింగ్ డొల్లతనం బయటపడింది.

వణికించిన స్టార్క్

రైజర్స్ బేజార్!

డుప్లెసి మెరుపు హాఫ్ సెంచరీ ● ఏడు వికెట్లతో ఢిల్లీ ఘన విజయం


స్టార్క్ (5/35)

1 టీ20ల్లో ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం స్టార్క్‌కు ఇదే తొలిసారి.

విశాఖపట్నం: రెండో సొంత మైదానం వైజాగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుతంగా ఆడింది. తొలి మ్యాచ్‌లో ఓటమి అంచులనుంచి విజయం అందుకొని భళా అనిపించిన ఢిల్లీ, అదే జోరులో..అరవీర భయంకర బ్యాటింగ్ లైనప్‌తో ప్రత్యర్థి జట్ల గుండెల్లో గుబులు రేపుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను నేలకు దించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్లతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. వరుసగా రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో క్యాపిటల్స్ రెండో స్థానానికి దూసుకొచ్చింది. తొలుత సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకే కుప్పకూలింది. అనికేత్ వర్మ (41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 74) హాఫ్ సెంచరీతో చెలరేగగా, క్లాసెన్ (32), హెడ్ (22) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టార్క్ (5/35) టీ20 కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్‌తో హైదరాబాద్ వెన్ను విరిచాడు. స్వల్ప ఛేదనను ఢిల్లీ 16 ఓవర్లలో 166/3 స్కోరుతో ముగించింది. డుప్లెసి (27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50) మెరుపు అర్ధ శతకం చేయగా, మెక్‌గర్క్ (38), అభిషేక్ పోరెల్ (34 నాటౌట్) సత్తా చాటారు. లెగ్గీ జీషన్ అన్సారీ (3/42) మూడు వికెట్లు తీశాడు.

అనికేత్ తప్ప అంతా ఫ్లాప్..: క్రీజులో అడుగు పెట్టిందే తడవుగా భారీ షాట్లతో విరుచుకు పడాలనే ఆలోచన హైదరాబాద్ కొంపముంచింది. అదేసమయంలో..బ్యాటింగ్ అనుకూలించిన పిచ్‌పై తెలివిగా ఆడిన అనికేత్ వర్మ..ఢిల్లీ బౌలర్ల భరతం పట్టాడు. అనికేత్ పుణ్యాన సన్‌రైజర్స్‌కు ఆ స్కోరైనా సాధ్యమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్‌ను పేసర్ స్టార్క్ వణికించాడు. లేని సింగిల్ కోసం అభిషేక్‌ను పిలిచిన హెడ్ అతడి రనౌట్‌కు కారణమవడంతో మొదటి ఓవర్లోనే హైదరాబాద్ వికెట్ చేజార్చుకుంది. ఇక.. తన రెండో ఓవర్లో ఇషాన్ కిషన్ (2), నితీశ్ (0)లను పెవిలియన్ చేర్చిన స్టార్క్ సన్‌రైజర్స్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. కొద్దిసేపటికే హెడ్‌ను కూడా స్టార్క్ క్యాచవుట్ చేయడంతో పవర్ ప్లేలో హైదరాబాద్ 58/4తో తీవ్ర ఇక్కట్లలో పడింది. ఈ దశలో అనికేత్, క్లాసెన్ ఐదో వికెట్‌కు 42 బంతుల్లో 77 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. ముఖ్యంగా ఢిల్లీ స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకున్న అనికేత్ భారీ షాట్లతో అలరించాడు. క్లాసెన్ దూకుడుకు మోహిత్ చెక్ పెట్టగా, అభినవ్ (4), కమిన్స్ (2)లను పెవిలియన్ చేర్చిన కుల్దీప్ ఆపై అనికేత్‌నూ అవుట్ చేశాడు.


డుప్లెసి (50)

ఢిల్లీ అలవోకగా..: స్వల్ప లక్ష్యాన్ని ఢిల్లీ ఆడుతు..పాడుతు ఛేదించింది. ఓపెనర్లు డుప్లెసి, మెక్‌గర్క్ ఆరంభం నుంచే హైదరాబాద్ బౌలర్లపై ఎదురు దాడికి దిగారు. తొలి వికెట్‌కు 55 బంతుల్లోనే 81 పరుగులు జత చేశారు. స్పిన్నర్ జీషన్ ఒకే ఓవర్లో డుప్లెసి, మెక్‌గర్క్‌ను ఆపై కేఎల్ రాహుల్ (15)ను అవుట్ చేశాడు. కానీ స్టబ్స్ (21 నాటౌట్) జతగా అభిషేక్ పోరెల్ జట్టును విజయ తీరాలకు చేర్చాడు.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (రనౌట్) 1, హెడ్ (సి) రాహుల్ (బి) స్టార్క్ 22, ఇషాన్ (సి) స్టబ్స్ (బి) స్టార్క్ 2, నితీశ్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 0, అనికేత్ (సి) మెక్‌గర్క్ (బి) కుల్దీప్ 74, క్లాసెన్ (సి) నిగమ్ (బి) మోహిత్ 32, అభినవ్ (సి) డుప్లెసి (బి) కుల్దీప్ 4, కమిన్స్ (సి) మెక్‌గర్క్ (బి) కుల్దీప్ 2, ముల్డర్ (సి) డుప్లెసి (బి) స్టార్క్ 9, హర్షల్ (సి) అక్షర్ (బి) స్టార్క్ 5, షమి (నాటౌట్) 1; ***ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 18.4 ఓవర్లలో 163 ఆలౌట్; వికెట్ల పతనం:*** *1-11, 2-20, 3-25, 4-37, 5-114, 6-119, 7-123, 8-148, 9-162, 10-163;* ***బౌలింగ్:*** *స్టార్క్ 3.4-0-35-5, ముకేశ్ 2-0-17-0, అక్షర్ పటేల్ 4-0-43-0, విప్రాజ్ నిగమ్ 2-0-21-0, మోహిత్ 3-0-25-1, కుల్దీప్ 4-0-22-3.*

ఢిల్లీ: ఫ్రేజర్ మెక్‌గర్క్ (సి అండ్ బి) జీషన్ 38, డుప్లెసి (సి) ముల్డర్ (బి) జీషన్ 50, అభిషేక్ పోరెల్ (నాటౌట్) 34, కేఎల్ రాహుల్ (బి) జీషన్ 15, స్టబ్స్ (నాటౌట్) 21, ***ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 16 ఓవర్లలో 166/3; వికెట్ల పతనం:*** *1-81, 2-96, 3-115;* ***బౌలింగ్:*** *షమి 3-0-31-0, అభిషేక్ శర్మ 3-0-27-0, కమిన్స్ 2-0-27-0, హర్షల్ 3-0-17-0, జీషన్ అన్సారీ 4-0-42-3, ముల్డర్ 1-0-16-0.*

వార్న్ మృతిలో కొత్త కోణం!

ఘటనాస్థలంలో లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఔషధ బాటిల్ లభ్యం

అంతర్జాతీయ మీడియా కథనం



లండన్: ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ మృతిపై కొత్త కోణం వెలుగు చూసింది. వార్న్.. 2022, మార్చి 4న థాయ్‌లాండ్‌లోని ఓ ద్వీపంలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే వార్న్ చనిపోయాక అతడు బస చేసిన విల్లా నుంచి ఓ వస్తువును తొలగించినట్టుగా అంతర్జాతీయ పత్రిక 'డెయిలీ మెయిల్' సంచలన కథనం ప్రచురించింది. లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఓ ఔషధ బాటిల్ అక్కడ లభ్యమైందని, అయితే ఆసీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో బాటిల్‌ను అక్కడి నుంచి తీసేసినట్టుగా ఓ సీనియర్ పోలీస్ అధికారి ఒకరు చెప్పినట్టు ఆ పత్రిక పేర్కొంది. వాటిని వార్న్ ఎంత మోతాదులో తీసుకున్నాడో తమకు తెలియదని, కానీ ఆ సమయంలో సున్నితమైన అంశం కావడంతో ఇది బహిర్గతం కాలేదని ఆ పోలీస్ అధికారి అన్నాడని తెలిపింది.

చెన్నై మళ్లీ..

వరుసగా రెండో ఓటమి

రాజస్థాన్ బోణీ

గువాహటి: ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన పోరులో రాజస్థాన్ రాయల్స్ పట్టు వదల్లేదు. నితీశ్ రాణా (36 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 81) అదిరే ఆటకు.. స్పిన్నర్ వనిందు హసరంగ (4/35) మ్యాజిక్ బంతులు తోడవ్వడంతో ఆదివారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6 పరుగుల తేడాతో గట్టెక్కింది. దీంతో ఆడిన మూడో మ్యాచ్‌లో రాజస్థాన్ బోణీ చేయగా.. చెన్నైకిది వరుసగా రెండో ఓటమి. ముందుగా రాజస్థాన్ 20 ఓవర్లలో 182/9 స్కోరు చేసింది. రియాన్ పరాగ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) రాణించాడు. నూర్, పథిరన, ఖలీల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 176/6 స్కోరుకే పరిమితమైంది. ఫామ్‌లో ఉన్న రచిన్ డకౌట్ కాగా, కెప్టెన్ రుతురాజ్ (63) ఆదుకునే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ రాహుల్ త్రిపాఠి (23)తో కలిసి రుతురాజ్ రెండో వికెట్‌కు 46 రన్స్ జోడించాడు. శివమ్ దూబే (18), విజయ్ శంకర్ (9) విఫలంకాగా కీలక సమయంలో రుతురాజ్‌ను హసరంగ దెబ్బతీశాడు. ఈ దశలో జడేజా (32 నాటౌట్)-ధోనీ (16) గెలిపించే ప్రయత్నం చేశారు. అయితే ఆఖరి ఓవర్‌లో విజయానికి 20 రన్స్ అవసరమవగా.. తొలి బంతికే ధోనీ అవుటవడంతో చెన్నై ఆశలు వదులుకుంది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాణా నిలిచాడు.


నితీశ్ రాణా (81)

నితీశ్ రాణాదే జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో వన్‌డౌన్ బ్యాటర్ నితీశ్ రాణా తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. పేస్, స్పిన్ ఏదైనా బంతి బౌండరీ అవలే అన్నట్టుగా అతడి ఆటతీరు సాగింది. తను క్రీజులో ఉన్నంతసేపు 200 స్కోరు కూడా సులువే అనిపించింది. అయితే సరైన సమయంలో పుంజుకున్న చెన్నై బౌలర్లు డెత్ ఓవర్లలో కట్టడి చేశారు. కెప్టెన్ పరాగ్ సైతం వేగంగా ఆడే ప్రయత్నం చేయగా మిగతా బ్యాటర్లు పెద్దగా సహకరించలేదు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ జైస్వాల్ (4)ను పేసర్ ఖలీల్ అవుట్ చేశాడు. ఆ తర్వాత శాంసన్ (20)తో కలిసి రాణా రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 82 రన్స్ జత చేశాడు. ఒవర్టన్‌ను లక్ష్యంగా చేసుకుని నాలుగో ఓవర్‌లో 4,4,6తో 16 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే అశ్విన్‌ను బాదేస్తూ వరుసగా 6,6,4తో అదుర్స్ అనిపించాడు. ఇక ఖలీల్ ఓవర్‌లో 4,4,6 సాధించడంతో పవర్‌ప్లేలో జట్టు స్కోరు 79/1తో నిలిచింది. రాణా కూడా 21 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేశాడు. అయితే చెన్నై తరుపుముక్క స్పిన్నర్ నూర్ తన తొలి ఓవర్‌లోనే శాంసన్‌ను అవుట్ చేసి రిలీఫ్‌నిచ్చాడు. ఆర్ఆర్ స్కోరు 11వ ఓవర్‌లోనే వంద దాటింది. మరోవైపు రాణా అశ్విన్ ఓవర్‌లో వరుసగా 6,4 బాది వెంటనే అవుటవడంతో మూడో వికెట్‌కు పరాగ్‌తో 38 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత సీఎస్‌కే బౌలర్లు ఆధిపత్యం చూపి వరుస విరామాల్లో వికెట్లు తీస్తూ పరుగులను కట్టడి చేశారు. పరాగ్ ఉన్న కాసేపు బ్యాట్ ఝుళిపించినా పథిరన యార్కర్‌కు బౌల్డ్ కాగా, హెట్‌మయెర్ (19) భారీ షాట్లు ఆడలేకపోయాడు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) అశ్విన్ (బి) ఖలీల్ 4, శాంసన్ (సి) రచిన్ (బి) నూర్ 20, నితీశ్ రాణా (స్టంప్డ్) ధోనీ (బి) అశ్విన్ 81, పరాగ్ (బి) పథిరన 37, జురెల్ (సి) పథిరన (బి) నూర్ 3, హసరంగ (సి) శంకర్ (బి) జడేజా 4, హెట్‌మయెర్ (సి) అశ్విన్ (బి) పథిరన 19, ఆర్చర్ (సి) రుతురాజ్ (బి) ఖలీల్ 0, కార్తికేయ (రనౌట్) 1, తీక్షణ (నాటౌట్) 2, తుషార్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 182/9; వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-124, 4-134, 5-140, 6-166, 7-174, 8-175, 9-176; **బౌలింగ్:** ఖలీల్ 4-0-38-2, ఒవర్టన్ 2-0-30-0, అశ్విన్ 4-0-46-1, నూర్ అహ్మద్ 4-0-28-2, పథిరన 4-0-28-2, జడేజా 2-0-10-1.

చెన్నై: రచిన్ (సి) జురెల్ (బి) ఆర్చర్ 0, రాహుల్ త్రిపాఠి (సి) హెట్‌మయెర్ (బి) హసరంగ 23, రుతురాజ్ (సి) జైస్వాల్ (బి) హసరంగ 63, శివమ్ దూబే (సి) పరాగ్ (బి) హసరంగ 18, విజయ్ శంకర్ (బి) హసరంగ 9, జడేజా (నాటౌట్) 32, ధోనీ (సి) హెట్‌మయెర్ (బి) సందీప్ 16, ఒవర్టన్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-0, 2-46, 3-72, 4-92, 5-129, 6-164; **బౌలింగ్:** ఆర్చర్ 3-1-13-1, తుషార్ 4-0-45-0, సందీప్ 4-0-42-1, తీక్షణ 4-0-30-0, హసరంగ 4-0-35-4, కార్తికేయ 1-0-10-0.

బెదిరింపులు → ఒత్తిళ్లు ఎవరివి?



- సన్‌రైజర్స్, హెచ్‌సీఏ మధ్య ఈ-మెయిల్స్ వివాదం
- పాసుల కోసం హెచ్‌సీఏ బ్లాక్‌మెయిల్ చేస్తోందన్న రైజర్స్
- ఎస్ఆర్‌హెచ్ అభియోగాలను తోసిపుచ్చిన హెచ్‌సీఏ
- ఒక బాక్సులో 50 టిక్కెట్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్న

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అదనపు కాంప్లిమెంటరీ పాసుల కోసం తమను బెదిరిస్తోందని సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) యాజమాన్యం ఆరోపించడం దుమారం రేపుతోంది. హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యుల తీరు మారకపోతే తాము హైదరాబాద్ నుంచి వేదిక తరలిస్తామని హెచ్‌సీఏలోని ప్రధాన అధికారికి ఎస్ఆర్‌హెచ్ ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించినట్టు తెలుస్తోంది. అయితే తమకు ఎస్ఆర్‌హెచ్ నుంచి ఎలాంటి మెయిల్ రాలేదని హెచ్‌సీఏ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. ఎస్ఆర్‌హెచ్ అభియోగాలను కూడా తోసిపుచ్చింది. అసలు ఈ వివాదం ఎలా మొదలైందన్న దానిపై పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

కార్పొరేట్ బాక్స్ సామర్థ్యం ఎంత?

ఉప్పల్ స్టేడియంలో మొత్తం కార్పొరేట్ బాక్సుల సంఖ్య 58. ఇందులో ఒక్కో బాక్సులో అధికారికంగా 20 టిక్కెట్లు జారీ చేస్తారు. కొన్ని సందర్భాల్లో అనధికారికంగా మరో 5 నుంచి 10 టిక్కెట్లు కూడా ముద్రిస్తారని సమాచారం. ఒప్పందం ప్రకారం స్టేడియం మొత్తం సీటింగ్ సామర్థ్యంలో 10 శాతం (3,900) కాంప్లిమెంటరీ పాసులను హెచ్‌సీఏకు ఎస్ఆర్‌హెచ్ ఇవ్వాలి. ఇందులో నుంచి హెచ్‌సీఏ తమ క్లబ్‌లకు 2,832 టిక్కెట్లు ఇస్తుంది. మిగిలినవి వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, బందోబస్తు నిర్వహించే పోలీసులకు, సీఎంఓ, మంత్రులు, రాజకీయ ప్రముఖులకు హెచ్‌సీఏ ఇస్తుందని సమాచారం. భారత జట్టు ఆడే మ్యాచ్‌లకు స్టేడియంలోని మొత్తం టిక్కెట్లు హెచ్‌సీఏ ఆధీనంలోనే ఉంటాయి కాబట్టి కాంప్లిమెంటరీ పాసుల పంపకాలు సాఫీగానే జరుగుతాయి. ఐపీఎల్‌కొచ్చేసరికి స్టేడియాన్ని ఎస్ఆర్‌హెచ్‌కు అద్దెకు ఇస్తుంది కాబట్టి ఏర్పాట్లు మొదలు టిక్కెట్ల వ్యవహారం మొత్తం ఆ జట్టు యాజమాన్యం చేతిలోనే ఉంటుంది. అయితే, పదేళ్లుగా లేని సమస్య ఇప్పుడు ఉత్పన్నమవడానికి కారణం ఎఫ్12-ఎ బాక్సు టిక్కెట్ల వద్దే మొదలైందని తెలుస్తోంది.

ఇదీ.. సన్‌రైజర్స్ అభియోగం

అదనంగా కాంప్లిమెంటరీ పాసులు ఇవ్వాలని హెచ్‌సీఏ ఒత్తిడి చేస్తున్నదని ఎస్ఆర్‌హెచ్ ప్రధాన అభియోగం. గత మ్యాచ్‌కు ముందు స్టేడియంలోని ఎఫ్-3 బాక్సుకు హెచ్‌సీఏ తాళాలు వేసిందని, ఇలాంటి ధోరణిలో హైదరాబాద్‌లో మ్యాచ్‌లు నిర్వహించలేమని, హెచ్‌సీఏకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు ఇష్టం లేకపోతే ఆ విషయాన్ని రాతపూర్వకంగా తెలియజేయాలని హెచ్‌సీఏ అధికారికి పంపిన ఈ-మెయిల్‌లో ఎస్ఆర్‌హెచ్ పేర్కొన్నట్టు తెలుస్తోంది. ఈ విషయంలో బీసీసీఐ, ఐపీఎల్ పాలకమండలి జోక్యం చేసుకోవాలని కోరనున్నట్టు కూడా ఆ మెయిల్‌లో పేర్కొందట.

వివాదానికి కేంద్ర బిందువు ఎఫ్12-ఎ!

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్టేడియం దక్షిణ భాగంలోని మొదటి అంతస్తులో ఉన్న ఎఫ్12-ఎ బాక్సులో ఎస్ఆర్‌హెచ్ చాలాకాలంగా 50 టిక్కెట్లు (కాంప్లిమెంటరీ పాసుల) హెచ్‌సీఏకు ఇస్తోంది. ఒక బాక్సు సామర్థ్యం 20 టిక్కెట్లే కాబట్టి మహా అయితే మరో 10 కలిపి ఎఫ్12-ఏలో 30 టిక్కెట్లు ఇవ్వాలని, మిగిలిన 20 టిక్కెట్లు వేరే బాక్సుల్లో సర్దుబాటు చేయాల్సిందిగా హెచ్‌సీఏ సభ్యులు సీజన్ ఆరంభానికి ముందే ఎస్ఆర్‌హెచ్‌ను కోరారు. దానికి రైజర్స్ అంగీకరించింది. అయితే, ఈనెల 23న రాజస్థాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌కు సుమారు 15 బాక్సులు ఖాళీగా ఉన్నా ఎస్ఆర్‌హెచ్ మళ్లీ ఎఫ్12-ఏ బాక్సులో 50 టిక్కెట్లు కేటాయించడం హెచ్‌సీఏకు రుచించలేదు. దీంతో ఇదే విషయమై, ఈనెల 27న లఖ్‌నవూతో మ్యాచ్ సందర్భంగా హెచ్‌సీఏ నిరసన తెలపడంతో తదుపరి మ్యాచ్‌కు సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఆర్‌హెచ్ హామీ ఇచ్చింది.

రహస్యంగా 'కాంప్లిమెంటరీ'ల లెక్క...

అసలు హెచ్‌సీఏకి ఇచ్చేవి కాకుండా ఎస్ఆర్‌హెచ్ ఎన్ని కాంప్లిమెంటరీ పాసులు జారీ చేస్తోంది.. ఎన్ని టిక్కెట్లను అమ్మకానికి పెడుతుందనే దానికి లెక్కా పత్రం లేకపోవడం చర్చనీయాంశమైంది. ఎస్ఆర్‌హెచ్ సోషల్ మీడియా ఖాతాల్లో తప్ప టిక్కెట్ల విక్రయం గురించి ఆ జట్టు యాజమాన్యం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం అభిమానులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. మ్యాచ్ టిక్కెట్ల ధరలను కూడా డిమాండ్‌ను బట్టి ఒక్కో మ్యాచ్‌కు ఒక్కో విధంగా నిర్ణయిస్తున్నారని, టిక్కెట్ రేట్ల పట్ల ఆఖరికి ఎస్ఆర్‌హెచ్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కూడా సమాచారం ఇవ్వడం లేదని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కొత్త యాప్‌లో టిక్కెట్లు విక్రయించడం, వాటి అమ్మకాలపై సమాచారం ఇవ్వకపోవడంపై కూడా అభిమానులు విమర్శలు కురిపిస్తున్నారు. ఇకపోతే స్టేడియంలోని కొన్ని స్టాండ్లలో టిక్కెట్లు కొనుగోలు చేసి వెళ్లిన వారికి సీట్లు కూడా దొరకడం లేదని, సామర్థ్యానికి మించి టిక్కెట్లు విక్రయిస్తున్నారని, సదుపాయాలు కూడా బాగా లేవన్న ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంగా హెచ్‌సీఏ-ఎస్ఆర్‌హెచ్ మధ్య మొదలైన కాంప్లిమెంటరీ పాసుల వివాదం ఎటు దారి తీస్తుందో చూడాలి.

దీపక్, ఉదిత్‌కు రజతాలు

ఆసియా రెజ్లింగ్‌లో దినేశ్‌కు కాంస్యం


దీపక్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ మరో మూడు పతకాలు దక్కించుకుంది. పురుషుల 92 కిలోల విభాగంలో దీపక్ పూనియా, 61 కిలోల కేటగిరిలో ఉదిత్ రజత పతకాలతో మెరవగా, పురుషుల 125 కిలోల విభాగంలో దినేశ్ కంచు మోత మోగించాడు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో పూనియా 0-10తో ఇరాన్ రెజ్లర్ అమీర్‌హొసేని చేతిలో, ఉదిత్ 4-6తో టకారా (జపాన్) చేతిలో ఓడి రజతాలకు పరిమితమయ్యారు. ఇక కాంస్య పతక పోరులో దినేశ్ 14-12తో తుర్క్‌మెనిస్థాన్ రెజ్లర్ సపరోవ్‌ని ఓడించాడు.

అక్టోబరులో ఆసీస్ పర్యటనకు..

మెల్‌బోర్న్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం గతేడాది చివర్లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియా ఈ ఏడాది కూడా అక్కడ పర్యటించబోతోంది. అయితే ఈసారి టెస్టు సిరీస్ కోసం కాకుండా వన్డే, టీ20ల్లో తలపడేందుకు వెళ్లనుంది. అక్టోబరు 19 నుంచి నవంబరు 8 వరకు మూడు వన్డేలు, ఐదు టీ20ల కోసం భారత్ తమ దేశానికి రానుందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. పెర్త్, అడిలైడ్, సిడ్నీలలో వన్డేలు జరుగనుండగా.. అక్టోబరు 29 నుంచి కాన్‌బెర్రా, మెల్‌బోర్న్, హోబర్ట్, గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్‌లలో టీ20లు నిర్వహించనున్నారు. సెప్టెంబరులో జరిగే ఆసియాకప్ తర్వాత భారత జట్టు ఆసీస్ టూర్‌కు వెళ్లనుంది.

వచ్చే ఏడాది మహిళల జట్టు కూడా..: భారత మహిళల జట్టు కూడా వచ్చే ఏడాది మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం ఆసీస్ పర్యటనకు రానుందని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. భారత్-ఆసీస్ మహిళల జట్ల మధ్య ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు మూడు టీ20లు, 24 నుంచి మార్చి 1 వరకు మూడు వన్డేలతో పాటు మార్చి 6-9 మధ్య ఏకైక టెస్టు జరుగుతుందని వెల్లడించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

కళారత్న అవార్డుల ప్రదానం





ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాల ప్రముఖులకు కళారత్న (హంస) అవార్డులు, ఉగాది పురస్కారాలను ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు అందజేశారు. సినిమా విభాగంలో నటుడు పృథ్వీరాజ్, నృత్య విభాగంలో ప్రముఖ సినిమా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సాయి సౌజన్యకు కళారత్న అవార్డులు బహూకరించారు.

చిరంజీవి చిత్రానికి శ్రీకారం



అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం ('మెగా 157' - వర్కింగ్ టైటిల్) సెట్స్‌పైకి వెళ్లింది. ఉగాది సందర్భంగా ఆదివారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలు పెట్టారు. ముహూర్తపు షాట్‌కు వెంకటేశ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత దిల్‌రాజు, శిరీష్ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేశారు. 'విభిన్నమైన వినోదాత్మక చిత్రాలను రూపొందించి విజయాలు అందుకున్న అనిల్ రావిపూడి మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది. మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరిస్తుంది' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రాన్ని అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఘన విజయం సాధించిన నేపథ్యంలో 'మెగా 157'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి నటించిన 'విశ్వంభర' విడుదలకు సిద్ధమవుతోంది.

ధర్మం కోసం యుద్ధం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథగా తెరకెక్కుతోన్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఇందులో పవన్ కల్యాణ్ పోరాట యోధుడిగా అలరించనున్నారు. ఉగాది సందర్భంగా చిత్రబృందం పవన్ కల్యాణ్ కొత్త లుక్‌ను విడుదల చేసింది. ఎరుపు రంగు దుస్తులు ధరించి, ఓ చేతిలో పిడిబాకు, మరో చేతిలో చిన్న కడియం పట్టుకొని పవన్ కల్యాణ్ స్టైలిష్ లుక్‌లో కనిపించారు. 'ధర్మం కోసం యుద్ధం. హరిహర వీరమల్లు సాహస గాథను చూసేందుకు సిద్ధంగా ఉండండి' అని ఈ సందర్భంగా మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఎ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పిస్తున్నారు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. 'హరిహర వీరమల్లు' రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మే 9న తొలిభాగం ప్రేక్షకుల ముందుకు రానుంది.

కమర్షియల్ ట్రెండ్‌ను సెట్ చేసింది

- నందమూరి బాలకృష్ణ



'తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కమర్షియల్ ట్రెండ్‌ను సెట్ చేసిన చిత్రం 'ఆదిత్య 369'. ఒక కొత్త కాన్సెప్ట్‌తో ఆ చిత్రాన్ని చేయడం నాకు చాలా ఆనందం కలిగించింది. అందుకే ఇది ఈ సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమమే తప్ప రీ రిలీజ్ వేడుక అని భావించడం లేదు. త్వరలో ఈ చిత్రానికి సీక్వెల్ మొదలుపెట్టబోతున్నాం' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 4న రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'నాన్నగారి స్ఫూర్తితో ఈ చిత్రంలో శ్రీకృష్ణదేవరాయలు పాత్ర చేశాను. ఈ సినిమా వెనుకున్న మూలస్తంభం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. ఆయనతో పాటు శివలెంక కృష్ణప్రసాద్, సింగీతం గార్లకు రుణపడి ఉంటాను' అన్నారు. 'ఈ సినిమా విజయంలో సింహభాగం బాలకృష్ణకే దక్కుతుంది. శ్రీకృష్ణ దేవరాయల పాత్రను అంత అద్భుతంగా పోషించగల నటుడు అప్పుడూ, ఇప్పుడూ బాలకృష్ణ తప్ప మరొకరు లేరు' అని సింగీతం శ్రీనివాసరావు తన వీడియో సందేశంలో ప్రశంసించారు. ఈ సినిమాను నిర్మించడం తనకు దక్కిన అదృష్టం అని శివలెంక కృష్ణప్రసాద్ చెప్పారు.

బాధపెట్టాను... క్షమించండి



'ఎల్2: ఎంపురాన్' చిత్రంలోని కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన నేపథ్యంలో కథానాయకుడు మోహన్‌లాల్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా క్షమాపణలు చెప్పారు. 'రాజకీయం, సామాజిక అంశాలు కొన్ని 'ఎంపురాన్'లో భాగమయ్యాయి. అవి కొందరిని బాధించాయి. నా సినిమాలు ఏ రాజకీయ ఉద్యమాన్ని, భావజాలాన్ని, మతాన్ని కించపర్చకుండా చూడటం నటుడిగా నా బాధ్యత. అందుకే నా తరఫున, చిత్రబృందం తరఫున క్షమాపణలు చెబుతున్నా' అని అన్నారు. ఇదే అంశంపై చిత్ర నిర్మాత గోకులం గోపాలన్ మాట్లాడుతూ 'సినిమాలో చూపించిన ఏదైనా సన్నివేశం లేదా సంభాషణలు ప్రేక్షకుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంటే వాటిని వెంటనే తొలగించాలని దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు చెప్పా. ఇప్పటికే కొన్ని పదాలను మ్యూట్ చేశాం' అని అన్నారు. కాగా, కేరళ సీఎం పినరయి విజయన్ కుటుంబంతో కలసి 'ఎంపురాన్' చిత్రాన్ని చూశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రబృందానికి మద్దతు పలికారు.

బియ్యం ఖర్చంతా కేంద్రానిదే

- మేం రూ.40 చెల్లిస్తే.. రాష్ట్రానిది రూ.10లే
- బీఆర్‌ఎస్‌పై కేసుల్లో కాంగ్రెస్ యూటర్న్
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్, హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నామని, అయితే బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తుందని, కిలోకు కేంద్ర ప్రభుత్వం రూ.40లు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.10లు మాత్రమే భారం పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటీకి దూరంగా ఉంటూ మజ్లి‌స్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యాయన్నారు. బీజేపీకి సరిపడా బలం లేక పోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నదని తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలోనే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందుతుందన్నారు. బీఆర్‌ఎస్, కేసీఆర్‌లపై కేసుల విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందని విమర్శించారు. టెర్రరిస్టులకు అడ్డాగా దారుస్సలాం మారిందని ఆరోపించారు. ఒవైసీ కుటుంబ వ్యాపారాలు కాపాడుకునేందుకు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి అమ్ముడుపోయే పార్టీ మజ్లిస్ అని, దానికి తెలంగాణ అంతటా పోటీ చేసే దమ్ము లేదని బండి సంజయ్ విమర్శించారు. సెంట్రల్ వర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అమానుషమని బండి సంజయ్ అన్నారు. పోలీసు బలగాలను ఉపయోగించి విద్యార్థులను భయాందోళనలకు గురిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఉందని మండిపడ్డారు.

అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ బీజేపీ

- బండి సంజయ్‌కు గుర్తింపు సమస్య ఉంది: సీతక్క

సూర్యాపేట టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, పేదల సంపదను ప్రధాని మోదీ.. అంబానీలకు దోచిపెట్టి వాటాలు పంచుకుంటున్నారని రాష్ట్ర మంత్రి సీతక్క ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు సన్నబియ్యం అందించాలనే ఆలోచన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి 12 ఏళ్లుగా ఎందుకు రాలేదో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రధాని మోదీ ఫొటోను సంక్షేమ పథకాల సంచులపై ముద్రించాలని బండి సంజయ్ అన్నారని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడంలేదని ప్రశ్నించారు.

2న ఢిల్లీలో బీసీల పోరుగర్జన

- పాల్గొనాలని అఖిలపక్ష నేతలను కోరిన జాజుల బృందం

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి రాజ్యాంగ రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న ఢిల్లీలో తలపెట్టిన బీసీల పోరుగర్జనకు హాజరుకావాలని పలు రాజకీయ పార్టీల నేతలను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈమేరకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీలను ఆదివారం కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వేలాది మందితో బీసీల పోరుగర్జన మహాధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొంటారని చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించే వరకు బీసీల పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఆసక్తి.. ఆ 'శక్తి'.. తగ్గుతున్నాయ్!



(మొదటిపేజీ తరువాయి)

తపించే నవతరం వరకూ సంసార 'సౌఖ్యాన్ని' మాత్రం ఆస్వాదించలేకపోతున్నారు! భవిష్యత్తులో ఆనందంగా గడపాలనే ఆశతో వర్తమానాన్ని చీకటి చేసుకుంటున్నారు! శృంగారం అంటేనే ఆమడ దూరం ఉంటున్నారు!! రస స్పందనలు లేకుండా 'తిన్నామా.. పడుకున్నామా.. ఆఫీసుకెళ్లొచ్చామా..' అన్నట్లు యాంత్రికంగా బతికేస్తున్నారు!! భాగస్వామితో శృంగారం అంటేనే.. 'ప్చ్'.. అనేస్తున్నారు. తనివితీరా సంసార సుఖాన్ని అనుభవించకుండానే చాలామంది 'పిల్లలు పుట్టడం లేదంటూ' సంతాన సాఫల్య కేంద్రాల చుట్టూ తిరిగేస్తున్నారు!! నేటి తరం యువత ఎదుర్కొంటున్న ఈ ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

సంసారమే సరిగా చేయకుండా..

అసలు సంసారమే సరిగా చేయకుండా పిల్లలు కావాలనుకొని వస్తున్న జంటల సంఖ్య ఇటీవలి కాలంలో పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. హైపో యాక్టివ్ సెక్సువల్ డిజైర్ డిజార్డర్ (హెచ్‌ఎస్‌డీడీ)తో బాధపడుతున్న వారు ఎక్కువయ్యారని అంటున్నారు. హెచ్‌ఎస్‌డీడీ అంటే లైంగిక ఆసక్తి/వాంఛలు లేకపోవడమే. గతంలోనూ ఈ హెచ్‌ఎస్‌డీడీ కేసులు ఉన్నప్పటికీ ఇటీవలి కాలంలో బాగా పెరిగాయని చెబుతున్నారు. కొన్ని జంటలు పెళ్లయిన కొద్ది రోజులకే విడిపోతున్నాయి. కారణం.. భర్త 'పని'కి రాకపోవడమే! ఇటీవల ఇలాంటి కారణాలతో విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఒత్తిడి, మారిన జీవనశైలి సహా ఎన్నో అంశాలు దీనికి కారణమవుతున్నాయని వైద్యులు అంటున్నారు.. ప్రస్తుతం మనుషుల జీవనశైలిలో విపరీతమైన మార్పులు వచ్చాయి. కెరీర్ లక్ష్యాలు పెరిగాయి. అనారోగ్యకరమైన అలవాట్లు జీవితంలో భాగమవుతున్నాయి. ఉద్యోగాల్లో ఒత్తిడికి తోడు ఆందోళన, ఆత్మన్యూనత వంటి అంశాలు లైంగిక వాంఛలు సన్నగిల్లేలా చేస్తున్నాయి.నగరాల్లో చాలామంది తమకు సెక్స్‌లో పాల్గొనడానికి సమయమే చిక్కడం లేదంటున్నారని సీనియర్ ఫెర్టిలిటీ కన్సల్టెంట్ లక్ష్మి చెప్పారు. చాలా జంటలు బోర్డ్ రూమ్‌లో గడుపుతున్నంతగా బెడ్ రూమ్‌లో గడపడం లేదన్నారు. 'మహిళలు చాలా కష్టపడుతున్నారు. ఆఫీస్ నుంచి వచ్చిన తర్వాత ఇంటి పనితో అలసిపోతున్నారు. మగవారు ఎలాగూ లేట్‌గానే వస్తుంటారు. వీలైతే కాసేపు మాట్లాడుకోవడం, లేదంటే ఎవరి ఫోన్లలో వారు లీనమైపోవడం. తర్వాత నిద్ర పోవడం. చాలా ఇళ్లలో ఇదే పరిస్థితి' అని లక్ష్మి చెప్పారు. హెచ్‌ఎస్‌డీడీ అనేది ఇటీవల బాగా పెరిగిందని ఆండ్రాలజిస్ట్‌లు చెబుతున్నారు. మగవారిలోనే కాదు.. ఆడవారిలోనూ ఇది కనిపిస్తుందంటున్నారు. లైంగిక వాంఛలు ఒక్కోసారి తగ్గడం సాధారణమే.. కానీ, అది నిరంతరం కొనసాగితే మాత్రం ప్రమాద సంకేతమని వైద్యులు చెబుతున్నారు. కొత్తగా పెళ్లయిన జంటలు కూడా నెలకు ఒకటి లేదా రెండు సార్లు లైంగికంగా కలుస్తున్నామని చెబుతుంటే ఆశ్చర్యంగా ఉందని గైనకాలజిస్టులు అంటున్నారు. కొంతమంది అండం విడుదలయ్యే 9 లేదా 10వ రోజు సెక్స్‌లో పాల్గొంటే చాలనే భావనలో ఉంటున్నారు. కొంతమంది భార్యతో సెక్స్‌లో పాల్గొనడాన్ని కూడా ఓ పనిగా చూస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి సమస్యలు ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువగా ఉంటున్నాయంటున్నారు. అరచేతిలో అన్నీ అందుబాటులో ఉన్న ఈ కాలంలో కూడా సెక్స్‌పై అవగాహన కల్పించాల్సి రావడం ఇబ్బందికరమని గైనకాలజిస్ట్ శాంతి పేర్కొన్నారు. భార్యతో కలిస్తే చాలు.. పిల్లలు పుట్టేస్తారనే భ్రమలో ఉన్నారని చెప్పారు. సెక్స్ లైఫ్‌ను ఆస్వాదించడం లేదన్నారు.

వాంఛ తగ్గడానికీ.. గుండె జబ్బులకీ లింకు..?

నేటి తరం సంసార సుఖం ఎరగకపోవడానికి కారణాలెన్నో! పొగాకు, అతిగా మద్యం సేవించడం, ఊబకాయం, ఒత్తిడి, రాత్రిళ్లు సైతం పనిచేస్తుండడం వంటివి సంసార జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఒత్తిడి కారణంగా 'కోరికలు' నశిస్తుంటే.. ఊబకాయం, మద్యం, పొగతాగడం వంటివి వీర్యకణాలు, లైంగిక పటుత్వంపై ప్రభావాన్ని చూపుతాయి. వాస్తవానికి హెచ్‌ఎస్‌డీడీ వృద్ధి అనేది మనిషికో రకంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కొంతమందిలో లైంగిక వాంఛలు నెమ్మదిగా తగ్గితే, మరికొందరిలో అకస్మాత్తుగా తగ్గుతాయి. ఇటీవల జరిగిన కొన్ని అధ్యయనాల ప్రకారం కనీసం 15% మంది మగవారిలో జీవితంలో ఏదో ఒక దశలో లైంగిక వాంఛలు తగ్గిపోవడం జరుగుతుందని తేలింది. నిజానికి ఈ సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చు. కానీ, వైద్య సహాయం తీసుకోవడానికి చాలా మంది వెనుకడుగు వేయడం, వయసుతో పాటు శృంగారంపై ఆసక్తి తగ్గుతుందనే అపోహ కూడా సెక్స్ లైఫ్‌కు సమస్యగా మారుతుందని డాక్టర్లు అంటున్నారు. కామ వాంఛలకు, గుండె జబ్బులకు ఉన్న సంబంధాన్ని గుర్తించినట్లు సీనియర్ కన్సల్టెంట్ ఆండ్రాలజిస్ట్, యూరాలజిస్ట్ డాక్టర్ రవికుమార్ చెప్పారు. మగవారిలో హృదయ సంబంధ జబ్బులు రావడానికి ఒక ఏడాది ముందు నుంచే అంగస్తంభన సమస్యలు ప్రారంభమవుతాయన్నారు. గుండెకు వెళ్లే రక్తనాళాలతో పోలిస్తే అంగానికి వెళ్లే రక్తనాళాల పరిమాణం చాలా తక్కువగా ఉంటుందని, అందువల్ల అవి ముందుగా ప్రభావితమవుతాయని చెప్పారు. దురదృష్టవశాత్తు దీన్ని చాలామంది గుర్తించరని, అందరూ జాగ్రత్తపడాలని సూచించారు. హెచ్‌ఎస్‌డీడీకి కొన్ని ప్రవర్తనా పరమైన మార్పులు కూడా కారణమవుతాయని కన్సల్టెంట్ ఆండ్రాలజిస్ట్ విక్రమ్ చెప్పారు. తమ దగ్గరకు వచ్చే వారిలో 90 శాతం కేసులు కొద్దిపాటి జాగ్రత్తలతో పరిష్కరించే అవకాశం ఉన్నవేనన్నారు. నేటి యువత తీవ్రమైన ఒత్తిడిలో ఉందని, ఆహారపు అలవాట్లు, జీవనశైలి.. వారిలో శృంగార కోర్కెలను తగ్గిస్తున్నాయని చెప్పారు. ఇక మగవారిలో ఆ వాంఛలు లేకపోవడానికి శృంగార అనుభూతికి చెందిన ఊహలు లేకపోవడమూ ఓ కారణమేనని వెల్లడించారు.

చక్కటి శృంగార జీవితం కోసం..

హెచ్‌ఎస్‌డీడీ సమస్యను పరిష్కరించడానికి జీవనశైలి మార్పులతో పాటు కొన్నిసార్లు మందులు కూడా వాడాల్సి ఉంటుందని డాక్టర్ రవికుమార్ చెప్పారు. మగవారికి శృంగారం పట్ల ఆసక్తి పెరగాలంటే ఎన్ని సమస్యలున్నా పడకగది బయటనే వదిలేయాలని సూచించారు. ఒత్తిడిని జయించడానికి యోగా, ధ్యానం వంటివి తోడ్పడతాయని చెప్పారు. నిత్యం వ్యాయామం, సమతుల ఆహారం.. మనసుని, శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుతాయన్నారు. ధూమపానం, మద్యపానం శృంగార జీవితానికి శత్రువులని.. వాటికి వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు. సరిపడా నిద్ర లేకపోయినా హార్మోన్ల అసమతుల్యతతో ఇబ్బందులు వస్తాయన్నారు. సెక్స్‌కు సంబంధించిన అపోహలు శృంగార జీవితాన్ని నిస్తేజం చేస్తాయని.. వైద్యుల్ని సంప్రదించి సందేహాల్ని నివృత్తి చేసుకోవాలన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా భాగస్వామితో నిజాయితీగా ఉండాలని.. ఒకరికొకరు మనసు విప్పి, నిర్మొహమాటంగా మాట్లాడుకోవడం లైంగిక జీవితంలో తప్పనిసరి అని చెప్పారు.

మానసిక సమస్యలే కారణం..

లైంగిక వాంఛలు తగ్గడానికి పని ఒత్తిడి, ఆందోళనతో పాటు సైకలాజికల్ సమస్యలు కూడా ఓ కారణం. కొంతమంది ఆడవాళ్లు టచ్ చేయడాన్ని కూడా ఒప్పుకోలేరు. కెరీర్‌పై దృష్టి పెట్టిన అమ్మాయిలు మాత్రమే కాదు, గృహిణుల్లో కూడా ఈ తరహా సమస్యలు చూస్తున్నాం. ఏదో ఒక కారణం చెప్పి వాయిదా వేస్తుంటారు. దీనికి కారణం మానసిక సమస్యలే. ఇక శారీరకంగా.. అంటే హార్మోన్లు తగ్గిపోవడం, అంగస్తంభన అయిన తర్వాత వెంటనే స్ఖలనం అయిపోవడం వంటి కారణాలూ ఉంటాయి. 50 ఏళ్ల తర్వాత సాధారణంగా టెస్టోస్టెరాన్ తగ్గుతుంది. ఇటీవలి కాలంలో 20ల్లో ఉన్న వారికి కూడా ఈ సమస్యలు వస్తున్నాయి. పిట్యూటరీ ట్యూమర్ల వల్ల కూడా అంగస్తంభన సమస్య వస్తుంది.

- డాక్టర్ రవికుమార్, సీనియర్ కన్సల్టెంట్ ఆండ్రాలజిస్ట్, మెడికవర్ హాస్పిటల్

20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం



వేంసూరు మండలం కల్లూరుగూడెంలో ఆయిల్‌పామ్ కర్మాగారానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమంపై సీఎం దృష్టి.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మించనున్న ఆయిల్‌పామ్ కర్మాగారానికి ఆదివారం రాత్రి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో పది లక్షల ఎకరాలు, వచ్చే సీజన్‌లో మరో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పామాయిల్ సాగులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉంటుందన్నారు. ఇతర దేశాల నుంచి నాణ్యమైన, తక్కువ కాల పరిమితిలో దిగుబడి వచ్చే, ఎత్తు తక్కువగా పెరిగే ఆయిల్‌పామ్ మొక్కలను తెప్పించాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆపకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ.. ఆరు పథకాల హామీని నెరవేర్చే దిశగా కృషి జరుగుతోందన్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు రూ.33 వేల కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సాగు చేసిన పంటలకు బీమా కల్పించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం సొమ్ము చెల్లించేందుకు ప్రభుత్వం భరోసా ఇస్తుందన్నారు.

బ్రోకరేజీ కింగ్ నిఖిల్ కామత్

దేశంలో యంగెస్ట్ బిలియనీర్
రూ.22,300 కోట్ల నికర ఆస్తులు



పుస్తకాలు చదివితే ఏమొస్తుంది గురూ. మహా అయితే కొద్దో గొప్పో శాస్త్ర జ్ఞానం వస్తుంది. దాంతో ఏదో కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవితం గడిపేయవచ్చు. అదే లోకాన్ని చదివితే లోకజ్ఞానం, ఇంకా కాలం కలిసొస్తే కోట్లకు పడగలెత్తడం ఎలాగో కూడా తెలుసుకోవచ్చు. భారత స్టాక్ మార్కెట్లో బ్రోకరేజీ బిజినెస్‌ను సమూలంగా మార్చేసిన నిఖిల్ కామత్ ఇందుకు ఉదాహరణ. జీరో బ్రోకరేజీ సంస్థ 'జీరోధా' ఏర్పాటు చేసి దేశ స్టాక్ బ్రోకరేజీ చరిత్రను తిరగ రాసిన నిఖిల్ కామత్ గురించి మరిన్ని విశేషాలు.

నిఖిల్ కామత్.. ఇప్పుడు దేశ స్టాక్ మార్కెట్లో ఈ పేరు తెలియని ఇన్వెస్టర్ ఉండరంటే అతిశయోక్తి కాదు. జీరో బ్రోకరేజీ నినాదంతో స్టాక్ మార్కెట్ బ్రోకరేజీ చరిత్రను తిరగరాసిన జీరోధా వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ గురించి చాలా కొద్దిమందికే తెలుసు. కాలేజీ చదువు కూడా లేకుండా హేమాహేమీ స్టాక్ బ్రోకరేజీ సంస్థలకే చెమటలు పట్టించి 38 ఏళ్లకే 260 కోట్ల డాలర్ల (సుమారు రూ.22,300 కోట్లు) ఆస్తులతో దేశంలో యంగెస్ట్ బిలియనీర్‌గా నిలిచిన కామత్.. జీవితంలో ఎదగాలనుకునే ఎంతో మంది ఔత్సాహికులకు ప్రేరణ.

జీవితం-చదువు: నిఖిల్ కామత్ కర్ణాటకలోని ఉడుపిలో 1986 సెప్టెంబరు 5న జన్మించారు. తండ్రి బ్యాంకర్. తల్లి టీచర్. వారు నిఖిల్‌ను బాగా చదివించాలనుకున్నారు. అయితే మనోడికి చదువు పెద్దగా అబ్బలేదు. స్కూల్లో ఉండగానే 14 ఏళ్ల వయసులోనే మొబైల్ ఫోన్లు అమ్మి నాలుగు రాళ్లు సంపాదించడం ప్రారంభించాడు. తల్లిదండ్రులకు ఇది ఏ మాత్రం నచ్చలేదు. ముందు టెన్త్ క్లాసైనా పూర్తి చేయ్. తర్వాత నీ ఏడుపు నువ్వు ఏడుద్దువు గాని అని మందలించారు. అయినా మనోడు వింటేగా. దాంతో కామత్ తల్లి కొన్నిసార్లు అతడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు లాక్కుని టాయిలెట్‌లో పడేసేవారు. అయినా మనోడిలో ఏ మార్పు లేదు. ఫోన్లు కాకపోతే ఇంకో బిజినెస్ అనుకుని వేరే చిన్న చిన్న వ్యాపారాలు చేసి డబ్బులు సంపాదించడం ప్రారంభించారు.

ఉద్యోగం: అమ్మా నాన్న పోరు పడలేక నిఖిల్ కామత్ నెలకు రూ.8,000 జీతంతో ఒక కాల్ సెంటర్ జాబ్‌లో చేరారు. అక్కడే నిఖిల్‌కు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ అలవాటైంది. మనోడికి ఉన్న మార్కెట్ విశ్లేషణా శక్తికి తోడు కాలం కూడా కలిసి రావడంతో ఈ ట్రేడింగ్‌లో బాగానే సంపాదించాడు.

జీరోధా స్థాపన: కాల్ సెంటర్ జాబ్ చేస్తూ, ట్రేడింగ్‌లో సంపాదించిన డబ్బుతో సొంతంగా ఏదైనా బిజినెస్ స్టార్ట్ చేయాలనుకున్నాడు. అందుకు అన్న నితిన్ కామత్ కూడా తోడయ్యాడు. ఏ బిజినెస్ ప్రారంభిద్దామా? అని ఆలోచిస్తుంటే స్టాక్ మార్కెట్ బ్రోకరేజీ బిజినెస్ ఆలోచన వచ్చింది. అప్పట్లో షేర్లు అమ్మాలన్నా, కొనాలన్నా బ్రోకరేజీ కమిషన్ ఎక్కువగా ఉండేది. దాంతో చిన్న మదుపరులు ఎవరూ పెద్దగా స్టాక్ మార్కెట్‌కు వచ్చేవారు కాదు. దీన్నే వ్యాపార అవకాశంగా మార్చుకోవాలని అన్నదమ్ములిద్దరూ నిర్ణయించారు. ఇద్దరు కలిసి 2010లో జీరోధా పేరుతో స్టాక్ బ్రోకరేజీ సంస్థను ఏర్పాటు చేశారు. ఇంట్రాడే, డెరివేటివ్స్ ట్రేడింగ్‌పై నిర్ణీత చార్జీలు, డెలివరీ ఆధారిత అమ్మకాలు, కొనుగోళ్లపై నో బ్రోకరేజీ అనే వీరి నినాదం బాగానే పేలింది. ఒక విధంగా చెప్పాలంటే జియో ద్వారా రిలయన్స్ భారత టెలికాం రంగంలో ఎలాంటి సునామీ సృష్టించిందో.. జీరోధా కూడా భారత స్టాక్ బ్రోకింగ్ వ్యాపారంలో అలాంటి మార్పునే సృష్టించింది. అధునాతన టెక్నాలజీ కూడా ఇందుకు తోడవడంతో స్టాక్ బ్రోకింగ్ వ్యాపారంలో జీరోధాకు ఎదురు లేకుండా పోయింది. ప్రస్తుతం దాదాపు కోటి మంది మదుపరులు ఈ యాప్ ద్వారా తమ స్టాక్ మార్కెట్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీన్నిబట్టి కామత్ సోదరులు ఈ యాప్‌ను ఎంతగా మదుపరులకు దగ్గర చేశారో అర్థం చేసుకోవచ్చు.

చిన్న వయసులోనే బిలియనీర్: ఫోర్బ్స్ పత్రిక నివేదిక ప్రకారం నిఖిల్ కామత్ ఆస్తుల ప్రస్తుత విలువ 260 కోట్ల డాలర్లు. ప్రస్తుతం మారకం రేటు ప్రకారం ఇది సుమారు రూ.22,300 కోట్లకు సమానం. దేశంలో అత్యంత చిన్న వయసులో బిలియనీర్‌గా ఎదిగింది ఎవరంటే నిఖిల్ కామతే. పట్టుదల, ముందు చూపు, వినూత్న ఆలోచనలే తనను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టాయని నిఖిల్ కామత్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నాలుగు పదుల వయసు నిండకుండానే ఇంతగా ఎదిగిన ఈ బిలియనీర్‌కు సామాజిక స్పృహ ఎక్కువే. తన ఆస్తుల్లో సగాన్ని సామాజిక సంక్షేమ పథకాలకు ఇచ్చేస్తానని 2023 జూన్‌లో ప్రకటించారు. మంచి వ్యాపార ఆలోచన, టెక్నాలజీ ఉంటే విజయం దానంతట అదే వస్తుందనుకునే ఎందరో ఔత్సాహికులకు నితిన్ కామత్ చక్కటి ఉదాహరణ.

బిజినెస్

'వొడాఫోన్'లో ప్రభుత్వానికి మరింత వాటా

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా ఈక్విటీలో ప్రభుత్వ వాటా ప్రస్తుత 22.6 శాతం నుంచి 48.99 శాతానికి పెరగనుంది. స్పెక్ట్రమ్ బకాయిల కింద తనకు రావలసిన రూ.36,950 కోట్లను ఒక్కోటి రూ.10 ముఖ విలువ ఉండే 3,695 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్చుకునేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో కంపెనీ ఈక్విటీలో ప్రభుత్వ వాటా 48.99 శాతానికి చేరనుందని వొడాఫోన్ ఐడియా తెలిపింది. అయినా కంపెనీ నిర్వహణ ప్రస్తుత ప్రమోటర్లు వొడాఫోన్, ఆదిత్య బిర్లా గ్రూప్ వద్దే ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం ప్రమోటర్లకు వొడాఫోన్ ఐడియాలో వరుసగా 14.76 శాతం, 22.56 శాతం వాటా ఉంది.

ఇండిగోకు రూ.944 కోట్ల పెనాల్టీ

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు (ఇండిగో) ఆదాయ పన్ను శాఖ 2021-22 అసెస్‌మెంట్ సంవత్సరానికి రూ.944.20 కోట్ల జరిమానా విధించింది. శనివారం ఈ ఉత్తర్వులు అందాయని, వాటిని న్యాయస్థానంలో సవాలు చేయనున్నామని ఇండిగో ప్రకటించింది. అలాగే దీని ప్రభావం తమ ఆర్థిక స్థితిపై గాని, నిర్వహణపై గాని కంపెనీ ఇతర కార్యకలాపాలపై గాని ఉండబోదని తేల్చి చెప్పింది.

వచ్చే ఏడాది 6.5% వృద్ధి

ఎర్నెస్ట్ అండ్ యంగ్ అంచనా



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధిని సాధించవచ్చని ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) అంచనా వేసింది. మానవ వనరుల అభివృద్ధికి సహాయపడే ఆర్థిక వ్యూహాలను అనుసరించడంతో పాటు వివేకవంతమైన విత్త నిర్వహణ విధానాలు దీర్ఘకాలిక వృద్ధికి దోహదపడతాయని తాజా నివేదికలో తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వాస్తవిక వృద్ధి రేటు 6.4% ఉండవచ్చని కూడా అంచనా వేసింది. వికసిత్ భారత్ దిశగా దేశం సాగించే పయనానికి మద్దతు ఇచ్చేలా విత్త విధానాన్ని అనుసంధానించవలసి ఉంటుందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఓ అంచనా వేసిన విధంగా 6.5% వార్షిక వృద్ధిని సాధించాలంటే మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికంలో 7.6% వృద్ధిని సాధించాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే ఇంత భారీ వృద్ధి ఇటీవల సంవత్సరాల్లో సాధ్యం కాలేదని తేల్చి చెప్పింది. ఇందుకు ప్రైవేట్ వినియోగ వ్యయం 9.9% అవసరమని కూడా పేర్కొంది. దీనికి బదులుగా పెట్టుబడి వ్యయాలు పెంచేందుకు కృషి చేయడం మంచిదని పేర్కొంది. దేశంలో పెరుగుతున్న యువజనాభాను పరిగణనలోకి తీసుకుంటే 2048 నాటికి విద్యపై ప్రభుత్వ వ్యయాన్ని జీడీపీలో 6.5 శాతానికి పెంచాలని కూడా సూచించింది. ప్రస్తుతం ఈ వ్యయం 4.6% ఉంది. అలాగే ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయాలను 1.1% నుంచి 3.8 శాతానికి పెంచాల్సి ఉంటుందని తెలిపింది.

6 ట్రేడింగ్ సెషన్లు.. రూ.31,000 కోట్ల పెట్టుబడులు

ఈక్విటీ మార్కెట్లపై మళ్లీ ఎఫ్‌పీఐల నజర్

న్యూఢిల్లీ: దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి మళ్లీ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. గడచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో అంటే ఈ నెల 21 నుంచి 28 వరకు ఎఫ్‌పీఐలు.. ఈక్విటీల్లో రూ.30,927 కోట్ల పెట్టుబడులు పెట్టారు. షేర్ల విలువలు ఆకర్షణీయంగా ఉండటం, రూపాయి విలువ పెరుగుతుండటం సహా ఆర్థిక వ్యవస్థలో సానుకూల సంకేతాలు కనిపిస్తుండటమే ఇందుకు కారణం. ఎన్ఎస్ఈ నిఫ్టీ 6 శాతం వరకు రికవరీ సాధించటంతో పాటు మార్కెట్లపై మదుపరుల విశ్వాసం రోజురోజుకు పెరుగుతుండటం కూడా ఎఫ్‌పీఐలు మళ్లీ పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గు చూపుతున్నారని మార్కెట్ వర్గాలంటున్నాయి. ఎఫ్‌పీఐల పెట్టుబడులు భారీగా పెరగటంతో మార్చి నెలలో వీరి ఉపసంహరణ కూడా స్వల్ప మొత్తంలో రూ.3,973 కోట్లుగా ఉన్నాయి.

ప్రతి 2 షేర్లకు ఒక షేరు

బోనస్ ఇష్యూ ప్రకటించిన బీఎస్ఈ

ముంబై: బీఎస్ఈ లిమిటెడ్.. ప్రతి రెండు షేర్లకు ఒక షేరు బోనస్‌గా జారీ చేయనున్నట్లు ప్రకటించింది. బోనస్ ఇష్యూలో భాగంగా వాటాదారులకు రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు ఒక షేరును జారీ చేయనుంది. బోనస్ షేర్ల జారీకి బోర్డు ఆమోదం తెలిపిందని బీఎస్ఈ వెల్లడించింది. అయితే బోనస్ షేర్ల జారీకి బీఎస్ఈ ఇంకా రికార్డు తేదీని ఖరారు చేయలేదు.

హల్దీరామ్‌లో టెమాసెక్‌కు వాటా

న్యూఢిల్లీ: సింగపూర్‌కి చెందిన పెట్టుబడుల సంస్థ టెమాసెక్‌కు వాటాల కేటాయింపుపై హల్దీరామ్ ఆదివారం ఒక ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందం ప్రకారం హల్దీరామ్ ప్రస్తుత వాటాదారుల నుంచి టెమాసెక్ వాటాలు కొనుగోలు చేస్తుంది. అయితే ఈ డీల్ వివరాలు మాత్రం హల్దీరామ్ వెల్లడించలేదు. అయితే రూ.85,000 కోట్ల విలువ గల హల్దీరామ్ కంపెనీలో 10% వాటాలు కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

నేడు మార్కెట్లకు సెలవు

సోమవారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) సందర్భంగా స్టాక్ మార్కెట్లు.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. కమొడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	146	విజయవాడ	152
వరంగల్	146	గుంటూరు	152
కరీంనగర్	146	ఒంగోలు	152
మహబూబ్‌నగర్	146	చిత్తూరు	115
కర్నూలు	146	నెల్లూరు	120
విశాఖపట్నం	124	అనంతపురం	120
గోదావరి	152		



23,400 వద్ద కన్సాలిడేషన్



వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం గరిష్ఠ స్థాయి 22,850 నుంచి బలమైన రియాక్షన్ సాధించి వారం మొత్తం మీద కేవలం 170 పాయింట్ల లాభంతో 23,500 ముగిసింది. ఇది అప్రమత్త సంకేతం. కనిష్ఠ స్థాయిల నుంచి 2,000 పాయింట్ల మేరకు లాభపడినందువల్ల ఈ తరహా టెక్నికల్‌గా కరెక్షన్ రావడం అవసరం. అమెరికన్ మార్కెట్లలో గత శుక్రవారం నాటి బలమైన రియాక్షన్ కారణంగా ట్రెండ్‌లో మరింత అప్రమత్తతకు ఆస్కారం ఉంది. మిడ్‌క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా గత వారం స్వల్ప రియాక్షన్ సాధించాయి.

బుల్లిష్ స్థాయిలు : ఊహిస్తున్న విధంగా అప్రమత్త సానుకూల ధోరణి ప్రదర్శించినట్టయితే మరింత సానుకూలత కోసం నిరోధ స్థాయి 23,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 23,800, 24,000.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మైనర్ మద్దతు స్థాయి 22,400 వద్ద రికవరీ సాధించాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం ప్రధాన స్థాయి 52,000 వద్ద రియాక్షన్ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. స్వల్పకాలిక కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం స్వల్పకాలిక నిరోధం 52,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక మద్దతు స్థాయి 50,800. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్ : మార్కెట్ ప్రస్తుతం 100 డీఎంఏ వద్ద రియాక్షన్ సాధిస్తోంది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితి వల్ల కూడా రియాక్షన్ ఏర్పడుతోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం 23,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,540, 23,600
మద్దతు	23,455, 23,400

23,825 పైన బుల్లిష్

(ఏప్రిల్ 1-4 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 23,412-23,870 పాయింట్ల మధ్యన కదలాడి 169 పాయింట్ల లాభంతో 23,519 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,825 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,573, 23,489, 23,028, 22,795 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,825 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,225
నిరోధ స్థాయిలు: 23,725, 23,825, 23,925 (23,625 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,325, 23,225, 23,125 (23,425 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
31వ తేదీ		విజయవాడ	470
హైదరాబాద్	455	గోదావరి	460
వరంగల్	457	విశాఖపట్నం	460
చిత్తూరు	520	డజను గుడ్లు రూ. 60	





బీజేపీ కార్యాలయంలో హోమం నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి

చండశాసనుడిగా ప్రధాని మోదీ

బీజేపీ ఉగాది వేడుకల్లో పంచాంగకర్త సూర్యనారాయణమూర్తి

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది చండశాసనుడిగా ఉండబోతున్నారని, ప్రపంచానికే దిశానిర్దేశం చేయనున్నారని పంచాంగకర్త కాకునూరి సూర్యనారాయణ మూర్తి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన పంచాంగ పఠనం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం మరింత సస్యశ్యామలం కానుందని పేర్కొన్నారు. ప్రపంచంలో అందరినీ కలుపుకొని పోయే పార్టీ బీజేపీ మాత్రమేనని చెప్పారు. భారతదేశ రాశి మకర రాశి, రామనామం దేశానికి అనుకూలమని, ఎంతమంది రామనామం జపిస్తే అంత మంచిది అని సూచించారు.

త్వరలో రాష్ట్ర పార్టీ కొత్త కమిటీ : కిషన్‌రెడ్డి

తెలంగాణ బీజేపీకి త్వరలో కొత్త కమిటీ ఏర్పాటవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నేతలంతా ఉగాది సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం సోమవారం జరగనుంది.

తెలంగాణలో టీడీపీ కూటమిదే విజయం

- పంచాంగకర్త మల్లికార్జునశర్మ

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో టీడీపీ తన ప్రతిష్ఠను పెంచుకుంటుందని జ్యోతిష్య, వాస్తు పండితులు నాయకంటి మల్లికార్జునశర్మ అన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ ఆధ్వర్యంలో కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో విజయం సాధిస్తుందని చెప్పారు. టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన పంచాంగ పఠనం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వానికి తిరుగులేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శీతలపానీయాలను నిషేధించాలి

- జన విజ్ఞాన వేదిక 'ఉగాది పచ్చడి' పంపిణీ కార్యక్రమంలో మాడభూషి శ్రీధర్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కార్బొనేటెడ్ శీతల పానీయాలను తక్షణమే నిషేధించాలని కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఉగాది సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వద్ద జన విజ్ఞాన వేదిక నిర్వహించిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాడభూషి శ్రీధర్ మాట్లాడారు. విద్యాసంస్థలు, సినిమాహాళ్లు, బహిరంగ ప్రదేశాల్లో శీతలపానీయాలను నిషేధించాలనే ఆదేశాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. ఓ లీటరు శీతలపానీయంలో 0.0180 మిల్లీగ్రాముల క్రిమిసంహారక మందులు ఉంటాయని తెలిపారు. ఇలాంటి క్రిమిసంహారక మందుల మోతాదు 0.0005 మిల్లీ గ్రాములు మించకూడదని, కూల్ డ్రింక్‌లో అది 36 రెట్లు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కోలా సంస్థల అసత్య ప్రచారానికి వ్యతిరేకంగా మేధావులు గళమెత్తాలని ప్రొఫెసర్ రామచంద్రయ్య కోరారు.

రేవంత్‌కు పదవీ గండం.. కేసీఆర్ సీఎం అయ్యే అవకాశం

- బీఆర్‌ఎస్ ఉగాది వేడుకల్లో రాజేశ్వర సిద్ధాంతి
- గులాబీ నేతలు మీడియాతో జాగ్రత్తగా మాట్లాడాలని సూచన

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాజులకు అన్యోన్య వైరం ఉంటుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మే 14 నుంచి పదవీ గండాలు ఎదురవుతాయని, పదవిని కాపాడుకునేందుకు ఆయన జాగ్రత్తగా ఉండాలని జ్యోతిష్య పండితుడు రాజేశ్వర్ సిద్ధాంతి పేర్కొన్నారు. అలాగే, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ ఏడాది సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఉగాది సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో రాజేశ్వర్ సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. రాశి ఫలం ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌కు పదవీ గండం ఉంటుందని చెప్పారు. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రజాభీష్టం మేరకు ఈఏడాది ఆయనకు ముఖ్యమంత్రిగా పట్టంకట్టే అవకాశం ఉందని తెలిపారు. కాగా, కుజుడు నీచస్థానంలో ఉండడంతో ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు నామమాత్రంగానే అమలవుతాయని, రైతులను పట్టించుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. కొద్దిరోజుల తర్వాత పోలీసు వ్యవస్థకు అధికారాలు ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం చెప్పుచేతుల్లోనే అధికార దుర్వినియోగం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. పాలకులు పదవులు కాపాడుకోవడమే ముఖ్యంగా పనిచేస్తారని, ప్రభుత్వం నడిపేందుకూ ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. కేంద్ర సహకారాన్ని కూడా రాష్ట్ర పాలకులు ఉపయోగించుకోలేని పరిస్థితి ఉంటుందని చెప్పారు. బీఆర్‌ఎస్‌పై మీడియా దుష్ప్రచారం చేసే అవకాశం ఉందని, బీఆర్‌ఎస్ నేతలు విలేకరులతో ఆచితూచి మాట్లాడాలని సూచించారు. ఏ స్థాయిలో ఎన్నికలు జరిగినా ఈ ఏడాది బీఆర్‌ఎస్‌దే విజయమని, కానీ, ఎన్నికల నిర్వహణకు పాలకులు ఇష్టపడరని, కోర్టుల జోక్యంతో ఎన్నికలు జరిగే పరిస్థితి వస్తుందని చెప్పారు. కాగా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఈ ఏడాది పెట్టుబడులు పెట్టకపోతే మంచిదని సూచన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఉగాది వేడుకల్లో కేటీఆర్

కాగా, బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నిర్వహణకు కార్యాచరణ రూపకల్పనపై బీఆర్‌ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాలతో కేటీఆర్ ఆదివారం చర్చించి సూచనలు చేశారు.

విశ్వావసులో రియల్ పరుగులు

ప్రజలు మెచ్చేలా రేవంత్ రెడ్డి పాలన.. సీఎంకు బుధ మహర్దశ.. కానీ విపరీతమైన నరఘోష

పంచాంగ శ్రవణంలో సంతోష్‌కుమార్ శాస్త్రి

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

పెట్టుబడుల నగరం 'ఫ్యూచర్ సిటీ' : సీఎం

రవీంద్రభారతి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీ.. పెట్టుబడుల నగరమని, లక్షలాది మందికి ఉపాధి కల్పించేలా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన ఉగాది వేడుకలను ముఖ్యమంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అర్చకులు భద్రాచలం రాములవారి కళ్యాణానికి ఆహ్వానిస్తూ ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. విశ్వావసు నామ సంవత్సరంలో తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం పరుగులు పెడుతుందని చెప్పారు. పాలకులకు పాలన భారమైనప్పటికీ, విశ్వావసు నామ సంవత్సరంలో ధనం వస్తుందని, రిజిస్ట్రేషన్లు పెరిగి రియల్ ఎస్టేట్ రంగం పరుగులు పెడుతుందన్నారు. రాజు ఒంటి చేత్తో బాధ్యతలు మోస్తారని, సేనాధిపతి శని అయ్యాడని, శాంతి భద్రతల విషయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తారని అన్నారు. ఉభయ రాష్ట్రాల పాలకులు పోటీపడి పని చేస్తారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చే విధంగా పాలన చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలకు ఇబ్బంది లేదని, పంటలు పండుతాయని, ఎర్రటి భూములు మంచి ఫలితాలు ఇస్తాయని తెలిపారు. నీళ్ల విషయంలో పొరుగు రాష్ట్రాలతో ఇబ్బందులు వస్తాయని, కానీ ముఖ్యమంత్రి వాటిని అధిగమిస్తారని చెప్పారు. పాలనలో ఆచితూచి అడుగులు వేయాలని, రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు తెచ్చే ప్రయత్నం అధికంగా జరుగుతుందని తెలిపారు.



రవీంద్రభారతిలో జరిగిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి, జూపల్లి, సురేఖ

సీఎంకు విపరీతమైన నరఘోష

పంచామాధి, సప్తామాధిపతి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డికి బుధుడి మహాదశ మొన్ననే ప్రారంభమైందన్నారు. సీఎంకు పేరు ప్రఖ్యాతలతో పాటు విపరీతమైన నరఘోష కలిచివేస్తోందని అన్నారు. దీంతో సీఎం రేవంత్ చిరునవ్వులు చిందిస్తూ పండితుడి వైపు చూసి ఆయన మాటలను ఆసక్తిగా విన్నారు. వృశ్చికరాసి, వృశ్చిక లగ్నం ప్రధానమంత్రిదని, ఈ ఏడాది ఆయనకు మధ్యస్థ స్థితిలో ఉంటుందన్నారు.

పెట్టుబడుల నగరంగా ఫ్యూచర్ సిటీ....

ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ షడ్రుచుల కలయికలా ఉందని అన్నారు. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి యత్నిస్తున్నామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ ప్రజలు నివసించే నగరమే కాదని, పెట్టుబడుల నగరమని అన్నారు. శ్రీమంతుల మాదిరే పేదలు కూడా సన్న బియ్యం తినాలని ఆకాంక్షించారు. కాగా, తెలుగుదనం ఉట్టిపడేలా అట్టహాసంగా జరిగిన ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు బాగు, పంటలు మెండు!

విశ్వావసు నామ సంవత్సరంలో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని, పంటలు విశేషంగా పండుతాయని పంచాంగ శ్రవణ కర్త శ్రీనివాస మూర్తి వెల్లడించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలూ బాగుగా అమలవుతాయన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది వరి, తృణధాన్యాలు అధికంగా పండుతాయని, విదేశాలకు ఎగుమతి జరుగుతుందన్నారు. అదనపు విద్యుత్ ఉత్పత్తి జరిగి విద్యుత్ కొరత ఉండే అవకాశం తక్కువగా ఉందన్నారు. నూతన పరిశ్రమలు వస్తాయని, దేశమంతా గృహ నిర్మాణ పథకాలు బాగా అమలవుతాయని చెప్పారు. దేశ సరిహద్దుల్లో యుద్ధం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సీఎం రేవంత్, మంత్రులు రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు పని చేస్తున్నారని, ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలి

- తెలుగులో ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా ఉగాది శుభాకాంక్షలు
- సుఖసంతోషాలు తేవాలి: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆకాంక్షించారు. తెలంగాణ, ఏపీ ప్రజలకు ఎక్స్ వేదికగా తెలుగులో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 'ఇది ఆశ, ఉత్సాహాలతో ముడిపడి ఉన్న ప్రత్యేక పండుగ. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని, విజయాలను తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను' అని మోదీ పేర్కొన్నారు. 'భగవన్నామస్మరణతో, షడ్రుచుల సమ్మేళనంతో నూతన సంవత్సరాన్ని ఘనంగా స్వాగతిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని నా బంధుమిత్ర సోదరసోదరీమణులకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు' అని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు తేవాలని రాహుల్ ఆకాంక్షించారు.

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక

- ముస్లింలు సంతోషంగా పండుగను జరుపుకోవాలి: సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. 'రంజాన్ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీక. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దానధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి' అని పేర్కొన్నారు. తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా అల్లా ఆశీర్వాదం ఉండాలని సీఎం ఆకాంక్షించారు.



మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

నా రాజకీయ జీవిత కథను నేనే రాశా

సినిమాల్లో హీరోలు చేసేవి నేను నిజజీవితంలోనే చేశా.. విద్యార్థి నేతగా ఉన్నప్పటి నుంచే నాపై కుట్రలు

- డైరెక్టర్ రామానుజం చెప్పిన కథ.. నా నిజజీవితానికి దగ్గరగా ఉంది
- అందుకే సినిమా చేయాలని నిర్ణయం
- జగ్గారెడ్డి.. ఎ వార్ ఆఫ్ లవ్ కార్యాలయం ప్రారంభోత్సవంలో తూర్పు జగ్గారెడ్డి
- టీజర్‌ను విడుదల చేసిన యూనిట్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): "సినీ హీరోలు ఎవరో రాసిన కథల్లో నటిస్తుంటారు. ఆయా సినిమాల్లో పోలీసులను కొట్టినట్లు.. వారితో ఫైటింగ్ చేసినట్లు నటన చేస్తుంటారు. కానీ ఇవన్నీ నేను నా నిజజీవితంలో చేశా! నా రాజకీయ జీవిత కథను నేనే రాసుకున్నా!" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. తాను విద్యార్థి నాయకునిగా ఉన్నప్పటి నుంచే తనపైన ఎన్నో కుట్రలు జరిగాయని వెల్లడించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం 'జగ్గారెడ్డి.. ఎ వార్ ఆఫ్ లవ్' సినిమా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డితో పాటు ఆయన భార్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఈ సినిమా నిర్మాత, జగ్గారెడ్డి కూతురు జయలక్ష్మిరెడ్డి, కుమారుడు తూర్పు దత్తసాయి, దర్శకుడు రామానుజం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఈ సినిమాలో తానూ ఒక పాత్రలో నటిస్తున్నానని, అయితే తన నిజజీవితంలోని కొన్ని సంఘటనలను కూడా ఇందులో చూపిస్తున్నామని తెలిపారు. ఈ సినిమా చేయడానికి మూల కారకుడు దర్శకుడు రామానుజమన్నారు. ఓ వేడుకలో తనను కలిసిన రామానుజం.. కొన్ని సంవత్సరాల పాటు శ్రమించి రాసుకున్న కథను వినిపించారని, అందులో తనను నటించాలని కోరారని వెల్లడించారు. సినిమాలో తాను పోషించాల్సిన పాత్ర గురించీ వివరించారని, ఆ పాత్ర తన నిజజీవితానికి దగ్గరగా ఉండటంతో ఆ సినిమాలో నటించేందుకు అంగీకరించానన్నారు. ఈ సందర్భంగా తనపై రూపొందించిన పోస్టర్‌ను రామానుజం చూపించారన్నారు. అది తనను బాగా ఆకర్షించిందన్నారు. రాజకీయాల్లో తాను పోషించిన పాత్ర, సాధించిన విజయాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు చెప్పారు. "నా రాజకీయ జీవితానికి సంబంధించి కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అంతా నాదే. అలాగని నా గురించి నేను ఎక్కువగా ఊహించుకోను. విద్యార్థి నాయకునిగా మొదలైన నా రాజకీయ ప్రయాణం.. రాష్ట్ర నేత అయ్యే దాకా వచ్చిందంటే.. అందులో చాలా మలుపులు ఉన్నాయి. ఈ ప్రయాణమంతా సినిమా కథలో కనపడుతుంది" అని చెప్పారు. తన కూతురు జయలక్ష్మిరెడ్డి ఆలోచనలు.. తన ఆలోచనలకు దగ్గరగానూ ఉంటాయని ఆయన చెప్పారు. జయలక్ష్మీరెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి జగ్గారెడ్డి జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను తెరపైన చూడబోతున్నామనే ఆలోచనే తనను ఉద్వేగానికి గురిచేస్తోందన్నారు. సినిమా అందరికీ నచ్చే విధంగానూ ఉంటుందన్నారు. దర్శకుడు రామానుజం మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన జగ్గారెడ్డి రుణాన్ని.. మంచి సినిమా ఇచ్చి తీర్చుకుంటానన్నారు. సంగారెడ్డికి వెళ్లి.. పలువురితో మాట్లాడి.. జగ్గారెడ్డి గురించి తెలుసుకున్నానని చెప్పారు. సినిమాలో జగ్గారెడ్డి పాత్రతో పాటుగా మంచి ప్రేమ కథ కూడా ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు నడుస్తున్నాయని, త్వరలోనే ఈ సినిమా ప్రారంభం కానుందని తెలిపారు. కాగా.. 'జగ్గారెడ్డి.. ఎ వార్ ఆఫ్ లవ్' సినిమా టీజర్‌ను చిత్ర యూనిట్ ఆదివారం విడుదల చేసింది.

ప్లీజ్... మాలో ఒకరికి చాన్స్ ఇవ్వరూ!

కాంగ్రెస్ అధిష్ఠానానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేల వినతి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గరపడుతున్నందున ఎవరికి స్థానం దక్కుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఒక్కతాటిపైకి వచ్చారు. ఇప్పటి వరకు ఒక్కరికీ ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నుంచి మంత్రివర్గంలో స్థానంలేనందున ఈసారి మంత్రివర్గ విస్తరణపై ఎమ్మెల్యేలు కొండంత ఆశపెట్టుకుని ఎవరికి వారే తీవ్రంగా ప్రయత్నించారు. అయితే సానుకూల సంకేతాలు లేకపోవడంతో అంతా కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. తమలో ఎవరో ఒకరికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 14 స్థానాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి (ఇబ్రహీంపట్నం), ప్రసాద్‌కుమార్ (వికారాబాద్), టి.రామ్మోహన్‌రెడ్డి (పరిగి), మనోహర్‌రెడ్డి (తాండూరు) గెలిచారు. ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్ స్థానం దక్కింది. కీలకమైన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం కొన్ని దశాబ్దాల్లో ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో ఆ నలుగురు ఎమ్మెల్యేలు తమలో ఒకరికి అవకాశం కల్పించాలని కోరుతూ పార్టీ అధిష్ఠానానికి ఇచ్చేందుకు లేఖ సిద్ధం చేశారు. హైదరాబాద్ జిల్లా నుంచి కూడా మంత్రివర్గంలో స్థానం లేకపోవడాన్ని ప్రస్తావించారు. ఈ లేఖపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంతకం చేసినట్లు ఒక ఎమ్మెల్యే తెలిపారు. ఈ లేఖతో ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ వెళ్లి రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గేను కలవనున్నట్లు ఎమ్మెల్యేలు చెప్పారు. ఇదిలా ఉండగా.. ఆదివారం ఎమ్మెల్యేలు పార్టీ ముఖ్యనేత జానారెడ్డిని కలిసి మద్దతు కోరారు. వీరిలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కూడా ఉన్నారు.

పేదలకు ఇక పండగే

(మొదటిపేజీ తరువాయి)

అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పేదలకు సన్నబియ్యం పథకం ఆషామాషీ పథకం కాదని, చరిత్రలో శిలాశాసనంలా నిలిచిపోయే పథకమని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా.. ఎవరు సీఎంగా ఉన్నా.. ఈ పథకాన్ని కొనసాగించి తీరాల్సిందేనన్నారు. ఇప్పటి వరకు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు దొడ్డు రకాల బియ్యం అందుతున్నాయని, ఇందుకోసం ప్రతి ఏటా రూ.10,565 కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అయితే.. కాలక్రమేణా ప్రజలు దొడ్డు బియ్యం తినడం మానేయడంతో.. అవి పక్కదారి పడుతున్నాయన్నారు. దొడ్డు బియ్యం తిరిగి తిరిగి మిల్లర్ల ద్వారా మళ్లీ ప్రభుత్వానికే వస్తున్న విషయాన్ని గుర్తించి దానిని కట్టడి చేయాలని భావించామని, ఆ మథనం నుంచే సన్నబియ్యం పంపిణీ చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం రూ.21 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లర్ల వద్ద తాకట్టు పెట్టిందని సీఎం అన్నారు. చివరకు రూ.7 వేల కోట్ల విలువైన ధాన్యానికి టెండర్లు వేస్తే ఇప్పటికి రూ.3 వేల కోట్ల విలువైన ధాన్యమే వచ్చిందన్నారు.

కేసీఆర్ ఈ ఆలోచన ఎందుకు చేయలేదు?

మాజీ సీఎం కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన చేయలేదని సీఎం రేవంత్ విమర్శించారు. పైగా రైతులు వరి వేయవద్దని, వరి వేస్తే ఉరేనని బెదిరించారని, కానీ.. తన ఫాంహౌస్‌లో మాత్రం వెయ్యి ఎకరాల్లో వరి పండించారని అన్నారు. ఆ ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.4500కు కావేరి సంస్థ కొనుగోలు చేసిందని, తాను పూర్తి ఆధారాలతోనే ఈ ఆరోపణ చేస్తున్నానని తెలిపారు. రైతులకు మాత్రం మద్దతు ధర కూడా ఇప్పించకుండా కేసీఆర్ గోస పెట్టించారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మద్దతు ధర ఇప్పిస్తున్నారని, సన్నవడ్లు పండించిన రైతులకు అదనంగా రూ.500 బోనస్ కూడా ఇప్పిస్తున్నారని ప్రశంసించారు. ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల కింద కలిపి దేశంలోనే అత్యధికంగా వడ్లు పండించిన ఘనత తమ ప్రభుత్వానిదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరం అయిందని, మూడేళ్లలో రూ.లక్ష కోట్లు మెక్కారని సీఎం ఆరోపించారు. మూడేళ్లలో కూలిన ఏకైక వింత ప్రాజెక్టు అని ఎద్దేవా చేశారు. వారు చేసిన పాపాలకు ఉరేసినా తప్పులేదని వ్యాఖ్యానించారు. నల్లగొండ జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కాంగ్రెస్ హయాంలోనే 34 కిలోమీటర్లు పూర్తయిందని, గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. మళ్లీ తమ ప్రభుత్వం వచ్చాకే పనులను తిరిగి ప్రారంభించామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌కు ఈ జిల్లా ఓట్లు, సీట్లు తప్ప నీళ్లివ్వాలనే చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.



హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభ సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు



హుజూర్‌నగర్‌లో మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి తదితరులు

సేవచేయాలని ఉన్నందునే సీఎం అయ్యాను..

ప్రజలకు సేవ చేయాలనే సత్సంకల్పం తనకు ఉండబట్టే దేవుడు కరుణించాడని సీఎం రేవంత్ అన్నారు. అందుకే ఉద్ధండుల వంటి నేతలున్నా ప్రజల ఆశీర్వాదంతో తనకు సీఎంగా అవకాశం దక్కిందన్నారు. ఈ 15 నెలల పాలనలో ఒక్కో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నామని, గత ప్రభుత్వం ఎగనామం పెట్టిన రైతు బంధు నిధులు రూ.7,625 కోట్లను కూడా రైతులకు అందజేశామని తెలిపారు. రుణమాఫీ విషయంలో కేసీర్‌కు, తనకు.. నందికి, పందికి ఉన్నంత తేడా ఉందని వ్యాఖ్యానించారు. ఐదేళ్ల కోసం ఎన్నికైన ప్రభుత్వం 15 నెలల్లో ఎన్ని చేయగలదో అన్నీ చేసిందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇంకా చేస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు రేషన్‌కార్డులపై సన్నబియ్యం ఇచ్చే పథకాన్ని ప్రారంభించడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమన్నారు. దీనిని హుజూర్‌నగర్‌లో చేపట్టడం తమకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. కాగా, మంత్రి ఉత్తమ్ కోరిక మేరకు హుజూర్‌నగర్ నియోజకవర్గానికి వ్యవసాయ కళాశాల మంజూరు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కోదాడ నియోజకవర్గానికి ఏటీసీ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్)ను మంజూరు చేస్తామన్నారు. మిర్యాలగూడ, కోదాడ, దేవరకొండలకు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి హెలిప్యాడ్‌లో దిగిన తర్వాత మంత్రులు ఉత్తమ్, పొంగులేటితో కలిసి రామస్వామి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న 2065 సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్ల మోడల్ కాలనీని సందర్శించారు. ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న కాంగ్రెస్ సిద్ధాంతాన్ని సన్నబియ్యం పథకంతో నిజం చేయాలన్నదే తన సంకల్పమని 'ఎక్స్'లో సీఎం పేర్కొన్నారు.



వర్సిటీ ఆవరణలో ఆందోళనకు దిగిన విద్యార్థులు

అట్టుడికిన హెచ్‌సీయూ

చెట్ల తొలగింపునకు వచ్చిన అధికారులను అడ్డుకున్న విద్యార్థులు

- భూముల వేలాన్ని అడ్డుకుంటామని బైఠాయింపు
- పోలీసులు, విద్యార్థుల మధ్య వాగ్వాదం.. పోలీసుల లాఠీచార్జి

రాయదుర్గం/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ నాడు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) రణరంగంగా మారింది. ప్రశాంతంగా ఉన్న వర్సిటీని ఆగం చేయొద్దని, బంగారంలాంటి భూములను వేలం వేయొద్దని ఓవైపు విద్యార్థులు.. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడం సరికాదని పోలీసులు, అధికారులు మరోవైపు వాదించడంతో వర్సిటీ ప్రాంగణం దద్దరిల్లింది. దాదాపు మూడు గంటల పాటు పోలీసులు, విద్యార్థుల మధ్య పరస్పర వాగ్వాదాలు, తోపులాటలతో అట్టుడికింది. క్యాంపస్‌లోని 400 ఎకరాల అటవీ భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిందని, దీన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వేలం వేయాలనుకున్న భూమిలోని చెట్లను ఎక్స్‌కవేటర్లతో తొలగించేందుకు ఆదివారం అధికారులు వచ్చారు. అయితే విద్యార్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. దీంతో భారీగా పోలీసు బలగాలు అక్కడికి చేరుకున్నాయి. భూములను వేలం వేస్తే సహించేది లేదని, వేలాన్ని అడ్డుకుంటామని విద్యార్థులు అక్కడే బైఠాయించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో పలువురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. కాగా, సుమారు వందమంది విద్యార్థులను మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారని, మిగతా వారిని ఎక్కడకు తీసుకెళ్లారో తెలియదని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ప్రభుత్వం వేలం వేయాలనుకుంటున్న భూముల వద్దకు ఎవరు వెళ్లకుండా ఎక్కడిక్కడ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి 10గంటల సమయంలో 28 మంది విద్యార్థులను విడుదల చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి సమస్య..

హెచ్‌సీయూలో పోలీసులు ప్రవర్తించిన తీరుపై ఏబీవీపీకి చెందిన కొందరు విద్యార్థులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఈ ఘటనపై బండి సంజయ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ద్వారా భయపెట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేయాలని చూస్తోందని, వర్సిటీ భూములకే రక్షణ లేకపోతే ఎలా? అని మండిపడ్డారు. భూముల వేలం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. హెచ్‌సీయూలో పోలీసులు హింసాత్మకంగా ప్రవర్తించారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. 2016లో రోహిత్ వేముల మరణ సమయంలో విద్యార్థుల బాధను చెబుతూ వర్సిటీలోకి వచ్చిన రాహుల్ గాంధీ.. ఇప్పుడు అదే క్యాంపస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

పోరాటం చేస్తాం: హెచ్‌సీయూ విద్యార్థులు

భూముల వేలం పాటను అడ్డుకుంటామని పలు విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. జీవవైవిధ్యం దెబ్బతినేలా వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలన్న ప్రభుత్వం నిర్ణయం సరికాదని హెచ్‌సీయూ స్టూడెంట్స్‌యూనియన్ జాయింట్ సెక్రటరీ త్రివేణి అన్నారు. ఇక్కడి భూముల్లో అనేకరకాల జంతువులు, చెట్లు ఉన్నాయని వాటిని కాపాడేందుకు పోరాటం చేస్తామని వర్సిటీ విద్యార్థిని అనన్య హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పోలీసులతో దాడులు చేయించినంత మాత్రాన భయపడేది లేదని స్టూడెంట్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ నిహాద్ పేర్కొన్నారు. విద్యార్థులపై పోలీసులు ప్రవర్తించిన తీరును ఎస్ఎఫ్ఐ తెలంగాణ విభాగం ఖండించింది.



విద్యార్థినులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సర్కార్ అణచివేత పెరిగిపోయింది

- దీనిపై రాహుల్ గాంధీ మౌనం వీడాలి: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రభుత్వ అణచివేత, దమనకాండ విపరీతంగా పెరిగిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో పోలీస్ అరాచకత్వం కొనసాగుతోందని, పాత్రికేయులను సైతం అరెస్టు చేస్తున్నారని ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసించే ప్రతి గొంతునూ బంధిస్తున్నారని ఆరోపించారు. అరెస్టయిన విద్యార్థులు, జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వందల ఎకరాల భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ ఆదివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులతో పాటు జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవడంపట్ల అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశంలోని ప్రతిపట్టణానికి వెళ్లి ప్రజాస్వామ్యం, పత్రికాస్వేచ్ఛ గురించి ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న అరాచకత్వానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత పార్టీ పాలనలో జరుగుతున్న అరాచకంపై మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు.

భద్రాద్రిలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

భద్రాచలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు ఉగాది రోజు ఆదివారం సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవాంగ స్నపనంతో వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. మట్టిని సేకరించి కల్యాణ అంకురార్పణకు వినియోగించారు. ఉగాదిని పురస్కరించుకొని రాత్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి కల్పవృక్ష వాహనసేవ నిర్వహించారు. కాగా, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో భద్రాద్రి రామయ్య ఆదాయం పెరిగి, వ్యయం తగ్గే అవకాశాలున్నాయని దేవస్థానం స్థానాచార్యులు కేశ స్థలశాయి తెలిపారు.

రామయ్య కల్యాణం, మహాపట్టాభిషేకాలకు రండి

- సీఎం, గవర్నర్‌లకు రాజపత్రాల అందజేత

భద్రాచలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఏప్రిల్ 6న నిర్వహించే సీతారాముల కల్యాణానికి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఈవో ఎల్.రమాదేవి, వైదిక సిబ్బంది ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన్ను దేవస్థానం వైదిక పరిపాలన అధికారులు కలిశారు. రామయ్య కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తూ రాజపత్రాన్ని చదివి వినిపించి అందజేశారు. అనంతరం స్వామివారి ప్రసాదం, ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఏప్రిల్ 7న నిర్వహించనున్న శ్రీరామ మహాపట్టాభిషేకంలో పాల్గొనాలంటూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆహ్వానించారు. రాజపత్రం చదివి వినిపించి, ఆహ్వాన పత్రికలను కూడా అందజేశారు.

పురుషులకు 59.. మహిళలకు 41

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా 532.5 మార్కులు వచ్చాయి. జనరల్ ర్యాంకింగ్‌లో ఈమెది 4వ స్థానం. టాప్ 100 ర్యాంకుల్లో పురుషులు ముందంజలో ఉన్నారు. వెబ్‌సైట్‌లో మొత్తం 12,622మంది అభ్యర్థుల మార్కులు, ర్యాంకుల జాబితాను అందుబాటులో ఉంచింది.

కల సాకారమవుతోంది..

గ్రూప్-1 అభ్యర్థుల ఎన్నో ఏళ్ల కల సాకారం కాబోతోంది. 563 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ గత ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. అక్టోబరులో మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. ఈ నెల 10న అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కులను వాళ్ల లాగిన్‌లో విడుదల చేసింది. వాటిలో ఏమైనా అభ్యంతరాలుంటే.. ఈ నెల 24 వరకు రీ కౌంటింగ్‌కు అవకాశం ఇచ్చింది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం ఆదివారం జనరల్ ర్యాంకింగ్ ఫలితాలను విడుదల చేసింది. త్వరలో కేటగిరీల వారీగా అర్హులకు 1:2 పద్ధతిన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని.. ఈ విషయాన్ని అభ్యర్థులకు తెలియజేయడంతో పాటు వెబ్‌సైట్‌లో సైతం సమాచారాన్ని ఉంచుతామని తెలిపింది. అభ్యర్థుల మార్కుల మెమోను వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్‌లో పొందుపరిచామని, హాల్ టికెట్ నంబరు, పుట్టిన తేదీ, టీజీపీఎస్సీ ఐడీ, రిజిస్టర్ మొబైల్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. మార్కుల మెమో వారం రోజులు, జనరల్ ర్యాంకు జాబితా ఏప్రిల్ 28 వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తామని కమిషన్ తెలిపింది.

తాజా ఫలితాల్లో టాప్ 10 ర్యాంకుల్లో ఆరుగురు మహిళలు.. నలుగురు పురుషులు ఉన్నారు. టాప్ 100లో కూడా 59 మంది పురుష అభ్యర్థులు ర్యాంకులు సాధించగా.. 41 మంది మహిళలు ర్యాంకులు సాధించారు. తొలి 100 ర్యాంకర్లలో బీసీలు 48 మంది.. ఓసీలు 32 మంది, ఓసీ ఈడబ్ల్యూఎస్‌లో 12 మంది, ఎస్టీలు ఐదుగురు, ఎస్సీలు ముగ్గురు ఉన్నారు. ఇక టాప్ 500 ర్యాంకుల్లో మాత్రం మహిళల కంటే మగాళ్లే ఎక్కువ మంది ఉన్నారు. పురుషులు 296 మంది ఉండగా.. మహిళలు 204 మంది ఉన్నారు. టాప్ టెన్‌లో మల్టీజోన్-2లో ఐదుగురు మంచి ర్యాంకులు సొంతం చేసుకున్నారు. మల్టీ జోన్-1లో నలుగురు, మల్టీ జోన్-9 (తెలంగాణేతరులు)లో ఒకరు ర్యాంకులు సాధించారు. వీరిలో ఏడుగురు ఓసీ అభ్యర్థులు కాగా.. ఇద్దరు బీసీ-బి, ఒకరు బీసీ-ఏ అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 52 మంది అభ్యర్థులు 500కు పైగా మార్కులు సాధించారు. కాగా, అభ్యర్థులు సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ నంబరు 040 2354218/040 23542187 లేదా హెల్ప్‌డెస్క్ ఎట్ ది రేట్ టీజీపీఎస్సీ డాట్ జీవోవీ డాట్ ఇన్ లో సంప్రదించాలని కమిషన్ సూచించింది.



జిన్నా తేజస్వినిరెడ్డి, 4వ ర్యాంకర్

ఉత్తమ ర్యాంకులు సాధించిన కొందరి వివరాలు..

అభ్యర్థి పేరు	ర్యాంకు
కొమ్మిరెడ్డి లక్ష్మీదీపిక	1
దాది వెంకటరమణ	2
జిన్నా తేజస్వినిరెడ్డి	4
సిద్దాల కృతిక	5
అనూషారెడ్డి	7
కాలిపాక శ్రీకృష్ణసాయి	10

కలెక్టర్ కావాలనేది కల: వెంకటరమణ

నల్లగొండకు చెందిన దాది వెంకటరమణ రాష్ట్రస్థాయిలో 535.5 మార్కులతో రెండో ర్యాంకు సాధించారు. ఐదేళ్లుగా సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ప్రకటించిన జేఎల్, డీఏవో, గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాల్లోనూ ప్రతిభ చూపారు. ప్రస్తుతం జహీరాబాద్‌లో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వరిస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు దాది శ్రీనివాస రావు విద్యాశాఖలో ఉద్యోగి కాగా, తల్లి రమాదేవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. మొదటినుంచి కలెక్టర్ కావాలన్నది తన కల అని వెంకటరమణ చెప్పారు. గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడంతో డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ వస్తుందన్నారు.

తేజస్వినిరెడ్డికి 4వ ర్యాంకు

హనుమకొండ జిల్లా మాందారిపేటకు చెందిన జిన్నా విజయ్‌పాల్‌రెడ్డి-హేమలత దంపతుల కూతురు తేజస్వినిరెడ్డి 532.5 మార్కులతో నాలుగో ర్యాంకు సాధించారు. తేజస్వినిరెడ్డి 2019లో నిర్వహించిన గ్రూప్-2లో అర్హత సాధించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో పంచాయతీ అధికారిగా పనిచేశారు. ప్రస్తుతం గ్రూప్-1లో 4వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ అయ్యే అవకాశాన్ని దక్కించుకున్నారు.

● మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన బోయినిపల్లి ప్రణయ్ సాయి 17వ ర్యాంకు, వనపర్తి జిల్లాకు చెందిన మండ్ల పవన్‌కుమార్‌కు 25, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వెంకటేశ్ ప్రసాద్ సాగర్‌కు 27, మెదక్‌కు చెందిన శైలేశ్ 41వ ర్యాంకు, నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సతీమణి బరీరా ఫరీద్‌కు 68, మెదక్ జిల్లా మూసాపేటకు చెందిన ప్రభాత్‌రెడ్డి 73, సిద్దిపేట జిల్లాకు చెందిన అఖిల్‌రెడ్డి 75, లావుడ్య శ్రీకాంత్ 89, వికారాబాద్‌కు చెందిన వర్షితకు 100వ ర్యాంకు దక్కింది.

అంధుల విభాగంలో అహ్మద్ అగ్రస్థానం

వరంగల్‌కు చెందిన అహ్మద్ దివ్యాంగుల (అంధుల) విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. 471 మార్కులు సాధించిన అహ్మద్‌కు జనరల్ కేటగిరీలో 261 ర్యాంకు రాగా.. దివ్యాంగుల విభాగంలో ప్రథమ స్థానం దక్కింది. ఆయన ప్రస్తుతం ప్రజారోగ్య సాంకేతిక శాఖ వరంగల్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్నారు. తనకు డిప్యూటీ కలెక్టర్ పోస్ట్ వచ్చే అవకాశం ఉందని అహ్మద్ ఆనందం వ్యక్తం చేశారు.

ఎస్సీ కేటగిరీలో హరిణి ఫస్ట్

ఎస్సీ విభాగంలో కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి ఫస్ట్ ర్యాంకు సాధించారు. 499.5 మార్కులతో జనరల్ కేటగిరీలో 55వ ర్యాంకు సాధించిన హరిణి.. ఎస్సీ విభాగంలో రాష్ట్రంలోనే ఫస్ట్ ర్యాంకు దక్కించుకున్నారు. 2019లో బీటెక్ పూర్తి చేసిన హరిణి.. రెండేళ్ల పాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేశారు. తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి, సివిల్స్‌కు సన్నద్ధమవుతూ.. గ్రూప్-1 కూడా రాశారు. గ్రూప్-1 ఉద్యోగంలో చేరినప్పటికీ ఐఏఎస్ లక్ష్యంగా పెట్టుకొని సివిల్స్ రాస్తానని హరిణి చెప్పారు.

ఆరేళ్ల నిరీక్షణతో ఏడో ర్యాంకు..



గ్రూప్-1లో 524 మార్కులతో 7వ ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. నేను ప్రస్తుతం బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. నా భర్త రవీందర్ రెడ్డి ఇరిగేషన్ శాఖ ఉద్యోగి. మాకు ఇద్దరు పిల్లలు. ఒకవైపు ఉద్యోగం, మరోవైపు కుటుంబ బాధ్యతలతో నేను ఇంత మంచి ర్యాంకు సాధించడం వెనుక మా అత్తమ్మ జయమ్మ, నా తోటికోడలు రజిత తోడ్పాటు ఉంది. మెట్టినింటి సహకారంతో గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపిక కావాలన్న నా కల సాకారమైంది. 2018లో యూపీఎస్సీ పరీక్ష రాశాను. కానీ ప్రిలిమ్స్‌దాటలేదు. ఆపై గ్రూప్-1మీద పూర్తి శ్రద్ధ పెట్టాను. రోజుకు ఆరు గంటలు చదివాను. ఆరేళ్ల నా నిరీక్షణ ఫలించింది. కలెక్టర్ కాలేకపోయినా, డిప్యూటీ కలెక్టర్ అవుతున్నందుకు సంతోషంగా ఉంది.

- అనూషా రెడ్డి, 7వ ర్యాంకు

23 ఏళ్లకే 40వ ర్యాంక్..



మాది హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి. 23 ఏళ్ల వయస్సులోనే గ్రూప్-1కు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. 504.5 మార్కులతో నాకు 40వ ర్యాంక్ వచ్చింది. మా తండ్రి శ్రీనివాస్ ప్రైవేట్ ఉద్యోగి. తల్లి చెరుకూరి పద్మ గణిత అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. 2022 నుంచి ఢిల్లీలో ఉంటూ యూపీఎస్సీకి సిద్ధం అవుతున్నా. ఒక సబ్జెక్టు మినహా మిగిలిన సబ్జెక్టుల సిలబస్ ఒకే రకంగా ఉండటం వల్ల గ్రూప్-1 పరీక్ష రాశా. ఇంత మంచి ర్యాంక్ రావడాన్ని రివార్డ్‌గా భావిస్తున్నా. ఈ ర్యాంక్ ఆధారంగా వచ్చే ఉద్యోగాన్ని చేస్తూనే.. ఐఏఎస్ సాధించాలన్నది నా లక్ష్యం.

- ఇమ్మాని సాకేత్, 40వ ర్యాంకు

సివిల్స్ సన్నద్ధతతోనే గెలుపు

- ప్రత్యేకంగా గ్రూప్-1 కోసం చదవలేదు
- ఏ పరీక్ష కోసమూ కోచింగ్ తీసుకోలేదు
- రెండుసార్లు సివిల్స్ ఇంటర్వ్యూకు వెళ్లా
- అభ్యర్థులకు ఓపిక, స్థిరత్వం అవసరం
- గ్రూప్-1 ఫస్ట్ ర్యాంకర్ డాక్టర్ లక్ష్మీ దీపిక



హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ చదివిన ఆమె.. సమాజానికి ఉన్నత స్థాయిలో సేవ చేయాలనే లక్ష్యంతో సివిల్ సర్వీసెస్ వైపు మొగ్గు చూపారు. కోచింగ్ లేకుండా సన్నద్ధత మొదలుపెట్టి.. రెండు సార్లు యూపీఎస్సీ ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. అంతే కాదు, ఏపీ సర్కారు నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో మంచి ర్యాంకు పొందారు. తాజాగా తెలంగాణ సర్కారు విడుదల చేసిన గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ఆమె మొదటి స్థానంలో ఉన్నారు. ఆమే.. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ దీపిక కొమ్మిరెడ్డి. 900 మార్కులకు గాను ఆమె 550 మార్కులు సాధించారు. పరీక్ష కోసం సిద్ధమైన విధానంతో పాటు అనేక అంశాలపై ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

యూపీఎస్సీ కోసమే సన్నద్ధత..

పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో ర్యాంకు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఏపీపీఎస్సీలో 2023-2024 నాన్ లోకల్ కేడర్‌లో నాకు తొలిసారిగా సర్వీస్ వచ్చింది. అది ఎంపీడీవో కావడంతో జాయిన్ కాలేదు. తెలంగాణలో నేను లోకల్. ఇక్కడ జరిగిన మొదటి గ్రూప్-1 పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. అంతకు ముందు యూపీఎస్సీలో రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. నేను చదివింది సివిల్స్ కోసమే. ఆ సంసిద్ధతే ఇప్పుడు ఉపయోగపడింది. గ్రూప్-1 కోసం ప్రత్యేకంగా చదవలేదు. తెలంగాణ స్థానిక అంశాలు, ఉద్యమాలు, చరిత్ర తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాను. యూపీఎస్సీకి సిద్ధం కావడం వల్ల గ్రూప్-1 పరీక్ష రాయడం సులువైంది.

ఇలాంటి ర్యాంక్ అనూహ్యం..?

గ్రూప్-1 పరీక్షలు బాగా రాశాను.. కానీ ఫస్ట్ ర్యాంక్ ఊహించలేదు. గ్రూప్-1 వచ్చింది కాబట్టి యూపీఎస్సీ వదిలేసినట్లు కాదు. సొంత రాష్ట్రాన్ని వదిలి వెళ్లాలని లేదు. యూపీఎస్సీలో హోమ్ క్యాడర్ వస్తే మరింత సంతోషం. నేను సివిల్స్, గ్రూప్-1 కోచింగ్ ఎక్కడా తీసుకోలేదు. యూపీఎస్సీ తొలి ప్రయత్నంలో జీఎస్, తెలుగు సాహిత్యాన్ని ఆప్షనల్‌గా తీసుకున్నప్పుడు ఆకెళ్ల రాఘవేంద్ర నాకు మెంటార్‌గా ఉన్నారు. ఆయన తెలుగు సాహిత్యంపై తర్ఫీదు ఇచ్చారు. మార్గనిర్దేశమూ చేశారు. కానీ ఈసారి (2024) ఆంత్రోపాలజీ తీసుకున్నాను.

డాక్టర్‌నే కానీ.. ప్రాక్టీస్ చేయడం లేదు..

ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివాను. హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌లో డిస్టెన్స్‌లో ఎంబీఏ చేశాను. డాక్టర్‌నే కానీ, రెగ్యులర్ ప్రాక్టీస్ లేదు. అప్పుడప్పుడూ ఆన్‌లైన్ కన్సల్టేషన్లు చేస్తుంటాను. యూఎస్ వెళ్లి రెసిడెన్సీ చేయాలనుకున్నా. కానీ అక్కడ ఇమడగలనా అని ఆలోచించా. అప్పుడే సివిల్స్ రాయాలనే ఆలోచన వచ్చింది. అలా సొంతంగా సిద్ధమై 2023లో తొలిసారి పరీక్ష రాశాను. గ్రూప్-1 పరీక్షల కోసం సన్నద్ధమవడానికి నాకు పెద్దగా సమయం దొరకలేదు. పరీక్షల ముందు మాత్రం 8-9 గంటలు ప్రభావవంతంగా చదివాను.

తల్లిదండ్రులు వెన్నంటే ఉంటారు..

మా నాన్న పేరు కృష్ణ. హైదరాబాద్‌లోని ఏజీ ఆఫీస్‌లో సీనియర్ ఆడిట్ ఆఫీసర్. అమ్మ పద్మావతి, గృహిణి. వారి తోడ్పాటు లేకుండా నేను సాధించింది ఏమీ లేదు. వారి సహకారం అనన్య సామాన్యం. మా నాన్న నాకు కావాల్సిన పుస్తకాలన్నీ తెస్తుంటారు. నేను సాధారణంగా రాత్రిళ్లు ఎక్కువగా చదువుతుంటాను. మా అమ్మ కూడా నాతో పాటు అలా మెళకువగానే ఉంటుంది. పరీక్ష హాల్ దగ్గరకు కూడా ముగ్గురమూ వెళ్తుంటాం. నేను పరీక్ష రాసేంత వరకూ వారు బయటే ఉంటారు. వారే నా బలం.

గ్రూప్స్ రాసే వాళ్లు ఇవి చూసుకోవాలి..

నేపథ్యాలను అర్థం చేసుకుంటూ చదివితే మంచిది. విశ్లేషణాత్మకంగా ఎంత గొప్పగా రాయగలిగితే అంత ప్రయోజనం ఉంటుంది. ఓ జవాబును పది మంది ఒకే రకంగా రాయవచ్చు. కానీ మన వైవిధ్యత చూపాలంటే విశ్లేషించాలి. అది పలు అంశాలను అర్థం చేసుకోవడానికి మాత్రమే కాదు, యూపీఎస్సీ ఇంటర్వ్యూలో కూడా చాలా సహాయపడుతుంది. ఇక పోటీ పరీక్షల సంసిద్ధతలో కావాల్సింది ఓపిక, స్థిరత్వం. నేను దాదాపు నాలుగేళ్లుగా యూపీఎస్సీ, గ్రూప్-1 కోసం సిద్ధమవుతున్నాను. ఓ సంవత్సరం కష్టపడితే కొట్టేస్తాం అని అనుకోవద్దు.

సివిల్స్‌లో తగ్గి.. గ్రూప్స్‌లో నెగ్గి

5వ ర్యాంకు సాధించిన సిద్దాల కృతిక.. ఇప్పటికే గ్రూప్-4 కొలువులో సేవలు



సరూర్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు.. ఏడేళ్లుగా పట్టు వదలకుండా పరీక్షలకు సిద్ధమవుతూ వచ్చింది. సివిల్స్‌లో నాలుగు సార్లు అర్హత సాధించకపోయినా నిరాశ చెందకుండా.. గ్రూప్స్ వైపు దృష్టి మళ్లించింది. గ్రూప్-4లో 511వ ర్యాంకు వచ్చినా తృప్తి చెందలేదు. పట్టుదలతో గ్రూప్-1 రాసి రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించింది. ఆమే.. మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన మాజీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య-బీరప్ప దంపతుల కుమార్తె సిద్దాల కృతిక(27). 2017లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె సివిల్స్‌పై దృష్టి పెట్టింది. వరుసగా నాలుగు సార్లు పరీక్ష రాసినా అర్హత సాధించలేక పోయింది. అయినప్పటికీ కుంగిపోకుండా గ్రూప్స్ వైపు దృష్టి మళ్లించి 5వ ర్యాంకు దక్కించుకుంది. అటు సివిల్స్ కోసం కానీ, ఇటు గ్రూప్స్ కోసం కానీ ఆమె ఎక్కడా కోచింగ్ తీసుకోకపోవడం గమనార్హం. ఇంట్లోనే ఉండి ఏరోజుకారోజు సబ్జెక్టును ఎంచుకుని, ఎన్ని గంటలైనా దానిని పూర్తి చేసేదాకా వదిలిపెట్టేది కాదు. గ్రూప్-4 రాసిన కృతిక కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. "నేను పదో తరగతి, ఇంటర్ చదువుతున్నప్పటి నుంచే ప్రభుత్వం ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్నాను. నా లక్ష్యానికి మా తల్లిదండ్రులు పూర్తిగా సహకరించారు" అని కృతిక అన్నారు.

యూపీఎస్సీ ఫలితాల కోసం చూస్తున్నా..



మాది హన్మకొండ. మా నాన్న విష్ణు న్యాయవాది. అయినా, నాకు సామాజిక శాస్త్రాల పట్ల చిన్నప్పుడు ఆసక్తి తక్కువనే చెప్పాలి. వరంగల్ నిట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో సామాజిక శాస్త్రాలపై ఇష్టం మొదలైంది. ఆర్థిక, రాజనీతి శాస్త్రాలు, రాజ్యాంగం... సంబంధిత అంశాలు చదవడం, దినపత్రికల ద్వారా సమకాలీన విషయాలపై అవగాహన పెంచుకోవడం నా దినచర్యలో భాగమైంది. అలా సామాజిక విషయాలను అధ్యయనం చేస్తున్నకొద్దీ సివిల్ సర్వీసెస్ వైపు వెళ్లాలన్న ఆకాంక్ష మొదలైంది. ఇంజనీరింగ్ అయిపోయిన వెంటనే 2020లో యూపీఎస్సీకి సిద్ధమయ్యాను. ప్రతికూల ఫలితం వచ్చినా వెనక్కితగ్గలేదు. నాలుగోసారి ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించాను. ఈ ఏడాది జనవరిలో ఇంటర్వ్యూకు వెళ్లాను. ప్రస్తుతం ఆ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాను. ఈ సమయంలో గ్రూప్-1లోనూ 519 మార్కులతో 10వ ర్యాంకు సాధించడం చాలా ఆనందంగా ఉంది. సివిల్స్, గ్రూప్-1కు సొంతంగా సిద్ధమయ్యాను. రోజుకు కనీసం పది గంటలు చదివాను. నా ర్యాంకు ఆధారంగా డిప్యూటీ కలెక్టరు పోస్టు వస్తుంది.

- కాలిపాక శ్రీకృష్ణసాయి, పదో ర్యాంకు

ఐఏఎస్ లక్ష్యంతో సిద్ధమవుతున్నా..

మాది ఖమ్మంలోని రాపర్తి నగర్. నాన్న మల్లికార్జున్‌రెడ్డి వ్యవసాయదారు. గ్రూప్-1 ఫలితాల్లో 502 మార్కులతో 48వ ర్యాంక్ సాధించాను. ఇంజినీరింగ్ పూర్తయ్యాక 2018 నుంచి 5 సార్లు యూపీఎస్సీ ఇంటర్వ్యూ వరకు వెళ్లా. ఆ అనుభవంతో గ్రూప్-1కు సిద్ధమయ్యా. పట్టణాల్లో రోడ్డు పక్కన అనేక మంది తిండి లేక పడుతున్న ఇబ్బందులను చూసి.. అలాంటి వాళ్లకు ఏదైనా సేవ చేయాలనే ఉద్దేశంతో ఐఏఎస్ లక్ష్యం పెట్టుకున్నా. ప్రస్తుతం వచ్చిన మార్కులతో ఆర్డీవో ఉద్యోగం వస్తుందని అనుకుంటున్నా.

- జి.నవీన్‌రెడ్డి, 48వ ర్యాంకు

జీవితాంతం సమాజం కోసమే

చివరి వరకు ప్రజల కోసమే పనిచేస్తా .. ఉగాది వేడుకల్లో ఏపీ సీఎం చంద్రబాబు



ఏపీ సీఎం చంద్రబాబు నుంచి కళారత్న అవార్డు అందుకుంటున్న ఆంధ్రజ్యోతి న్యూస్ ఎడిటర్ కేఎన్ సుధాకర్

అమరావతి/ విజయవాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): 'నా జీవితాంతం సమాజం కోసం పనిచేయాలన్న ఏకైక లక్ష్యంతో ఉన్నాను. చివరి వరకు ప్రజల కోసమే పనిచేస్తాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనూ, కృష్ణాజిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆదివారం నిర్వహించిన ఉగాది సంబరాల్లోనూ ఆయన పాల్గొని, మాట్లాడారు. 'పండుగలు మన దేశ సంస్కృతిలో ఒక భాగం. అవి మన వారసత్వం. పండుగ అంటే స్వీట్లే కాకుండా.. అన్ని రకాల సమస్యలూ ఉంటాయి. వీటిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను సమాజం, కుటుంబ వ్యవస్థలు మనకు ఇచ్చాయి. వికసిత్ భారత్ ద్వారా 2047 నాటికి ప్రపంచంలోకెల్లా నంబర్ 1, 2 స్థానాల్లో భారతదేశం ఉంటుంది. ఇప్పుడు నేను వేసే పునాది ప్రపంచంలోనే తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెడుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.